అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 04-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 185 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50

ఉద్యోగ బదిలీలకు పచ్చజెండా

- రేపటి నుంచి 20 వరకు కౌన్సెలింగ్
- నిషేధం ఎత్తేస్తూ సర్కారు ఉత్తర్వులు
- 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- రెండేండ్ల సర్వీసు ఉన్నోళ్లే అర్హులు
- ఒకేచోట నాలుగేండ్లు పనిచేస్తే తప్పనిసరి ట్రాన్స్‌ఫర్
- ఏడాదిలోపు ఉద్యోగ విరమణ పొందేవారికి మినహాయింపు
- వికలాంగులు, వితంతువులు, వ్యాధిగ్రస్తులకు ప్రాధాన్యం
- జులై 21 నుంచి నిషేధం మళ్లీ అమల్లోకి

13లో..

మారని మోడీ తీరు

ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ రాజ్యసభలోనూ ప్రసంగం

ప్రధాని అసత్యాలపై ఇండియా బ్లాక్ వాకౌట్



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

నిన్న లోక్‌సభలో ప్రతిపక్షాలను టార్గెట్ చేసిన ప్రధాని రాజ్యసభలోనూ అదే తీరులో వ్యవహరించారు. ప్రధాని మోడీ అసత్య ప్రసంగాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. బుధవారం రాజ్యసభలో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తొలుత ఎంపీ హర్భజన్ సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ డి.శ్రీనివాస్ మృతికి సంతాపాన్ని తెలియజేశారు. అలాగే మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో బోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. రాజ్యసభ సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం సభా కార్యక్రమాలను చైర్మన్ ప్రారంభించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ చర్చకు ప్రధాని మోడీ సమాధానం ఇచ్చారు. రెండు గంటల పాటు సుదీర్ఘంగా ప్రధాని మోడీ లోక్‌సభలో ఎలా అయితే ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ మాట్లాడారో అదే తీరులో ప్రసంగించారు. దీనిపై విపక్షాలు నిరసన తెలిపాయి. అలాగే మణిపూర్‌పైన ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్యే ప్రధాని మోడీ ప్రసంగం కొనసాగింది. రాబోయే ఐదేండ్లలో పేదరికంపై పోరాటంలో విజయం సాధిస్తామని చెప్పారు. గత పదేండ్ల అనుభవాలతో తాను ఈ మాట చెబుతున్నానని అన్నారు. ఈ ఐదేండ్లలో మరిన్ని కీలక నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే నాటికి ఆ ప్రభావం అన్ని రంగాలపై ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కాంగ్రెస్ తీరు మారలేదని ఎద్దేవా చేశారు. 140 కోట్ల మంది ప్రజలను ప్రతిపక్షాలు అవమానిస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం వల్లే తనలాంటి వారు పార్లమెంట్ వరకూ రాగలిగారన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ. 60,000 కోట్ల వరకూ రైతుల రుణాలు మాఫీ చేసినా లబ్ధిదారుల జాబితాలో చిన్న, సన్నకారు రైతుల పేర్లు చేర్చలేదని ఆరోపించారు. ప్రతిపక్షాలు రాజ్యసభ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నాయని విమర్శించారు. సభను ప్రతిపక్షాలు అవమానించడం తగదని, వారి తీరు మారకపోవడం బాధాకరమన్నారు. అసత్యాలను ప్రచారం చేసే వారికి నిజాన్ని వినే ధైర్యం లేదని, దేశ ప్రజలు ఈ విషయాలు ...13లో

ఉసురు తీస్తున్న పోటీ పరీక్షలు





ఆత్మహత్యలకు కేరాఫ్‌గా మారుతున్న భారత్

ఒత్తిడి,, ఆందోళనతో సూసైడ్లు

విద్యార్థులను కుంగదీస్తున్న మానసిక అనారోగ్యం

అగ్నికి ఆజ్యం పోస్తున్న కోచింగ్ కేంద్రాలు

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకే జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలు నిర్వహిస్తారు. కానీ దురదృష్టవశాత్తూ ఈ పరీక్షలు యువతలో ఒత్తిడికి, ఆందోళనకు, మానసిక ఆరోగ్య సంబంధమైన సమస్యలకు దారితీస్తున్నాయి. నీట్ వివాదానికి సంబంధించి ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. వైద్య శాస్త్రాన్ని అభ్యసించాలని కలలు కంటున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది. ఇది చాలదన్నట్టు ఉమ్మడి యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష (సీయూఈటీ) ఫలితాలను ప్రకటించడంలో జరుగుతున్న జాప్యం ఆందోళనను మరింత పెంచుతోంది.

న్యూఢిల్లీ : చాలా మంది విద్యార్థులు 14-15 సంవత్సరాల వయసులోనే వేర్వేరు పరీక్షలకు సన్నద్ధమవుతుంటారు. ఎందుకంటే వీటిలో పోటీ చాలా అధికంగా ఉంటుంది. విజేతగా నిలవాలంటే రాత్రింబవళ్లు కష్టపడాల్సిందే. పేరొందిన సాంకేతిక, వైద్య కళాశాలలు, యూనివర్సిటీలలో సీటు సంపాదించుకోవాలంటూ కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒత్తిడి తెస్తుంటారు. పరీక్షల్లో విఫలమైతే తల్లిదండ్రుల ఆశలు అడియాసలవుతాయేమోనని యువ విద్యార్థులు భయపడుతుంటారు. దీంతో వారంతా పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేసి కోచింగ్ కేంద్రాలలో చేరతారు. ఈ కేంద్రాలు కోచింగ్ ఇవ్వడంతో పాటు దురదృష్టవశాత్తూ విద్యార్థులపై ఒత్తిడి కూడా పెంచుతుంటాయి. గంటల తరబడి స్టడీ అవర్స్ నిర్వహిస్తాయి. చివరికి కోచింగ్ కేంద్రాలు నిర్వహించే ఇంటర్నల్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు, ర్యాంకులు పొందేందుకు విద్యార్థులు తాపత్రయపడతారు. కోచింగ్ కేంద్రం పెట్టే పరీక్షల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిస్తే ప్రతిష్టాత్మక కాలేజీలో సీటు గ్యారంటీ అనే ధీమా వారిలో కలుగుతుంది.

ఆత్మహత్యల్లో మనమే నెంబర్ వన్

ప్రపంచంలో జరుగుతున్న ఆత్మహత్యలకు మన దేశమే రాజధానిగా మారుతోంది. ఏటా 2.6 లక్షల ఆత్మహత్యల కేసులు నమోదవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వద్ద ఉన్న సమాచారం ప్రకారం మన దేశంలో ఆత్మహత్యల సగటు రేటు లక్ష జనాభాకు 10.9గా ఉంది. విషాదకరమైన విషయమేమంటే మన దేశంలోనే యువత అత్యధికంగా బలవన్మరణాలకు పాల్పడుతోంది. 2020లో ప్రతి 42 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తెలిపింది. అంటే రోజుకు 34 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారన్న మాట. ఆ సంవత్సరంలోనే 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న 11,396 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. 2021లో 13 వేల మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అంటే రోజుకు 35 మందికి పైగా చనిపోయారన్న మాట ...6లో

ఒత్తిడి పెంచుతున్న కోచింగ్ కేంద్రాలు

గత సంవత్సరం కోటాలో లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ నిర్వహించిన ఓ సర్వే ప్రకారం 85శాతానికి పైగా విద్యార్థులు ప్రతిరోజూ ఆరు నుంచి ఏడు గంటల పాటు కోచింగ్ కేంద్రాలలోనే గడుపుతున్నారు. కొందరు ఎనిమిది గంటల వరకూ అక్కడే ఉండి కోచింగ్ తీసుకుంటున్నారు. ఈ ఒత్తిడిని తగ్గించుకునేందుకు వారానికి కనీసం ఒక రోజైనా విశ్రాంతి కావాలని 80శాతం మంది కోరుకుంటున్నారు. కొందరు విద్యార్థులైతే కోటాలో ప్రవేశించగానే ఒంటరితనాన్ని ఫీలవుతారు. వారిలో అలసట, కోపం, విచారం, నిరాశ వంటి లక్షణాలన్నీ కలగలిపి కన్పిస్తాయి. చాలా మంది విద్యార్థులు రాత్రి బాగా పొద్దుపోయాక నిద్రపోతారు. ఫలితంగా వారిని సరైన విశ్రాంతి లభించక మానసిక ఒత్తిడికి గురవుతారు. కోచింగ్ కేంద్రాలు ధనార్జనే ధ్యేయంగా, ఇతర సెంటర్లతో పోటీ పడి అధిక ర్యాంకులు సంపాదించాలన్న కీర్తికండూతితో వ్యవహరించడం పరిస్థితిని మరింత జటిలం చేస్తోంది.





విలీన మండలాల సాధన కోసం

దీక్ష చేయండి

బీఆర్ఎస్ నేతలకు డిప్యూటీ సీఎం భట్టి సూచన

- బీజేపీ, బీఆర్ఎస్‌ల ఒప్పందం మేరకు విలీనం
- రైతు భరోసాపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం
- కౌలు రైతులను ఆదుకుంటాం
- బాబు, రేవంత్ సీఎమ్‌లే..గురుశిష్యులు కాదు
- 6న విభజన సమస్యల పరిష్కారంపై చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నాయకులకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఏడు మండలాల సాధన కోసం దీక్ష చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా సమయంలోనే కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్ ద్వారా ఆ మండలాలను విలీనం చేసిందని విమర్శించారు. అప్పుడు కేసీఆర్ ఏమీ మాట్లాడలేదన్నారు. పార్లమెంటులో బీఆర్ఎస్, బీజేపీ ఒప్పందం ...5లో

ఎన్నో ఆటు పోట్లను

తట్టుకుని నిలబడ్డాం

బీఆర్ఎస్ ప్రస్థానంలో

ప్రతి అడుగులో విజయమే

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి

లెక్కలోకే రాదు : కేసీఆర్ 5లో..



జార్ఖండ్ సీఎం చంపయ్ రాజీనామా

నూతన ముఖ్యమంత్రిగా

హేమంత్ సోరెన్

ఇండియా బ్లాక్ ఎల్పీ

నేతగా ఎన్నిక

గవర్నరుతో భేటీ

నేడు ప్రమాణస్వీకారం ?

వివరాలు 3లో



ఖమ్మం రైతు ఆత్మహత్యలో

మలుపులెన్నో?

ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు, మరొకరు వీడియో తీసినట్టు అనుమానాలు

న్యాయం కోసం తహసీల్దార్ కాళ్లపై పడిన రైతు ప్రభాకర్ పిల్లలు

పొక్లయినర్‌ను సీజ్ చేయాలని ఎస్ఐని అభ్యర్థించిన తండ్రి వీరభద్రం

పది మందిపై కేసు.. ఇంకా ఎవర్నీ అదుపులోకి తీసుకోని పోలీసులు

ఆత్మహత్యపై అనుమానాలు.. ఎవరో ప్రేరేపించినట్టుగా ఆరోపణలు



6లో..



ఆ ఇద్దరి వల్లే బ్రేక్..

మంత్రివర్గ విస్తరణకు తాత్కాలిక విరామం

- పీసీసీ అధ్యక్ష ఎంపిక కూడా వాయిదా
- మదన్‌మోహన్‌రావు..ప్రేమ్‌సాగర్‌రావుల్లో ఎవరో తేల్చుకోలేని అధిష్టానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు బ్రేక్ పడింది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుల్లో ఎవరికి మంత్రివర్గంలో చోటు కల్పించాలనే విషయమై స్పష్టత రాకపోవటంతో విస్తరణను కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలంటూ కాంగ్రెస్ అధిష్టానం సీఎం రేవంత్‌ను ఆదేశించింది. దీంతో పాటు మిగతా బెర్తుల విషయంలోనూ మంత్రులు, సీనియర్ల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తటం, ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా విస్తరణకు బ్రేకులు పడేలా చేసింది. పీసీసీకి నూతన అధ్యక్షుడి నియామకంతో పాటు మంత్రివర్గ విస్తరణను ఒక కొలిక్కి తెచ్చేందుకు వీలుగా ముఖ్యమంత్రి రేవంత్ బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర నేతలతో ఆయన భేటీ అయ్యారు. రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, ఆయనకు ఖర్గే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రేవంత్ పీసీసీ గురించి, క్యాబినెట్ విస్తరణ గురించి ఏఐసీసీ పెద్దలతో చర్చించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో విస్తరణను వాయిదా వేయాలంటూ వారు ఆయనకు సూచించారు. మరో రెండు వారాల తర్వాత వాటిపై మరింత లోతుగా, కూలంకుషంగా చర్చించి, తుది రూపునిద్దామంటూ సలహానివ్వటంతో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకం ప్రస్తుతానికి ఆగిపోయాయి.

పట్టువీడని ఆ ఇద్దరు...

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అల్లుడు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కొండయ్యగారి మదన్‌మోహన్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుల కారణంగానే క్యాబినెట్ విస్తరణ ఆగిపోయినట్టు తెలిసింది. వీరిద్దరూ మంత్రి పదవిపై పట్టుబట్టటంతో ఇప్పటికిప్పుడు లేనిపోని తలనొప్పులు తెచ్చుకోవటమెందుకంటూ కాంగ్రెస్ హైకమాండ్ సీఎం రేవంత్‌కు సూచించింది. నాలుగైదు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసిన మదన్‌మోహన్‌రావు తనకు క్యాబినెట్‌లో చోటు కల్పించాల్సిందేనంటూ ఒత్తిడి తెచ్చారు.

నేతల మధ్య భిన్నాభిప్రాయాలు

రెండు వారాల తర్వాత మరోసారి చర్చలు

సీఎం రేవంత్‌కు ఏఐసీసీ సూచన

ఇందులో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆఫీసు చుట్టూ ఆయన ప్రదక్షిణలు చేశారు. మరోవైపు ప్రేమ్‌సాగర్‌రావు సైతం తనకు మంత్రి పదవిని ఇవ్వాల్సిందేననీ, లేదంటే 'ఆలోచించాల్సి' వస్తుందనే హెచ్చరికలను పంపారు. దీంతో ఏఐసీసీ, సీఎం రేవంత్ సందిగ్ధంలో పడ్డారు. ఒకే సామాజిక వర్గాని (వెలమ)కి చెందిన వీరిద్దరిలో ఎవరికి ఛాన్స్ ఇవ్వాలో తేల్చుకోలేకపోయారు. పోనీ ఇద్దరికీ ఇద్దామంటే ఇప్పటికే అదే సామాజిక వర్గానికి చెందిన జూపల్లి కృష్ణారావుతో కలిపి ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చినట్టవుతుంది. అంతిమంగా ఇది తాము అనుకున్న సామాజిక సమీకరణాలకు విఘాతం కలిగిస్తుందని ఏఐసీసీ భావించింది. అందుకే తాత్కాలిక విరామమిచ్చింది.

మరోవైపు ఇప్పటికే పీసీసీ నియామకంలో బీసీలకు అవకాశం కల్పించేందుకు వీలుగా ఒక అభిప్రాయానికి వచ్చినా, ఎవరికి ఇవ్వాలో నిర్ణయించడానికి ...13లో

కాంగ్రెస్ గూటికి కేకే

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో చేరిక



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

బీఆర్ఎస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ ఏఐసీసీ కార్యాలయంలో కె.కేశవరావుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, తెలంగాణ ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

కవిత కస్టడీ పొడిగింపు

25వరకు తీహార్ జైలులోనే..రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఆమె కస్టడీ ముగియడంతో బుధవారం ఉదయం తీహార్ జైలు అధికారులు వర్చువల్‌గా కవితను న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. 25 వరకు కస్టడీ పొడిగిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఢిల్లీ మద్యం పాలసీ ...13లో

తలలో పెన్ను గుచ్చుకుని...

భద్రాచలంలో చిన్నారి మృతి


(ఫైల్)

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తలలో పెన్ను గుచ్చుకొని చిన్నారి మృతి చెందిన విషాదకర ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో బుధవారం జరిగింది. భద్రాచలం పట్టణం సుభాష్ నగర్ కాలనీకి చెందిన చిన్నారి రియాన్షిక(5) యూకేజీ చదువుతున్నది. సోమవారం రాత్రి మంచంపై కూర్చొని రాసుకుంటుండగా...13లో

మూర్ఖత్వమే కారణమా !

వచ్చిన వారిని తోసేయడంతోనే ఘోరం జరిగిందా..?

హత్రాస్ విషాదంపై జ్యుడీషియల్ దర్యాప్తునకు ఆదేశాలు

121కి పెరిగిన మృతులు

వివరాలు 3లో



ఆగని ఎన్‌కౌంటర్లు

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఐదుగురు మావోయిస్టులు హతం

ఈ ఏడాది 138కి చేరిన మృతుల సంఖ్య

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించారని పోలీసులు తెలిపారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా వివిధ భద్రతా బలగాలకు చెందిన జాయింట్ టీమ్ అటవీ ప్రాంతంలో సోదాలు జరిపింది. ఆ సమయంలో అబుజ్‌మడ్‌లోని అడవిలో కాల్పులు ...13లో

సర్పంచుల గోసపై అసెంబ్లీలో చర్చించండి

- పారిశుధ్య కార్మికులకు వేతనాలివ్వకపోవడాన్ని ప్రస్తావించండి :

కేటీఆర్‌కు సర్పంచుల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సర్పంచులు అప్పులు చేసి మరీ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనీ, తమ గోసపై అసెంబ్లీలో చర్చించేలా చూడాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావును సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీల్లో నెలకొన్న పరిస్థితులను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలలుగా నయాపైసా నిధులను విడుదల చేయకపోవడాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లుల విషయమై గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి మొరపెట్టుకున్నా రాష్ట్ర సర్కార్ నుంచి చలనం లేదని వాపోయారు. పారిశుధ్య కార్మికులకు ఏడు నెలలుగా



వేతనాలు ఇవ్వడం లేదని గుర్తుచేశారు. జీతాలు రాక వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచుల పెండింగ్ బిల్లులు, పారిశుధ్య కార్మికుల వేతనాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సర్కారుపై అసెంబ్లీ వేదికగా ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని కేటీఆర్ భరోసానిచ్చారని లక్ష్మీనరసింహారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో సంఘం నేతలు బొజ్జ రామేశ్వర్‌రెడ్డి, యాది రెడ్డి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఏను రద్దు చేయాలి

- కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
- జంతర్ మంతర్‌లో విద్యార్థి సంఘాల ఆందోళన
- సంఘీభావం తెలిపిన సీపీఐ(ఎం) ఎంపీలు
- పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ, విద్యా శాఖ మంత్రి పూర్తిగా విఫలం : ఎస్ఎఫ్ఐ నేతలు వీపీ సాను, మయూఖ్ బిశ్వాస్
- నేడు దేశవ్యాప్త బంద్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజ్‌కు కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్టీఏ పనితీరు, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ బుధవారం జంతర్ మంతర్ వద్ద ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ, సమాజ్‌వాదీ ఛత్రి సభ, ఇతర విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ప్లకార్డులు చేబూని కేంద్ర ప్రభుత్వానికి, ఎన్టీఏకు, కేంద్ర విద్యా శాఖ మంత్రికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు. ఈ ఆందోళనను సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, బికాష్ రంజన్ భట్టాచార్య, వి.శివదాసన్‌లు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీపీ సాను, మయూఖ్ బిశ్వాస్ మాట్లాడుతూ న్యాయమైన, సమర్థమైన పరీక్షా విధానాన్ని నిర్వహించడంలో ఎన్టీఏ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిరంతర ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల వాయిదాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం చేస్తామన్నారు. ఎక్కడ విద్యార్థులకు అన్యాయం జరిగినా తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఎన్టీఏను రద్దు చేయాలనే డిమాండ్‌ను ఎస్ఎఫ్ఐ ఉధృతం చేస్తూనే ఉంటుందన్నారు.

ఈ ఉద్యమం వృథా కాకూడదనే కతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. ఇది సంఘపరివార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో విద్యార్థులు చేస్తున్న పోరాటం అని స్పష్టం చేశారు. నేడు (గురువారం) ఎస్ఎఫ్ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపాయి. జేఎన్‌యూఎస్‌యూ మాజీ అధ్యక్షురాలు ఐషీఘోష్ మాట్లాడుతూ "యూజీసీ, కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్టీఏ దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో పదేపదే ఆడుకుంటోందన్నారు. 2017లో ఎన్టీఏ ప్రవేశపెట్టడంతో విద్య కేంద్రీకరణ ఎజెండాను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించిందని గుర్తు చేశారు. అది పూర్తిగా విఫలమైందని స్పష్టమయిన తరువాత కూడా దానిని తొలగించడానికి వారు ఎందుకు వెనుకాడుతున్నారు అని ప్రశ్నించారు.

పార్లమెంట్ గళం విప్పుతాం : అమ్రారామ్

విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపిన సీపీఐ(ఎం) లోక్‌సభ ఎంపీ అమ్రారామ్ మాట్లాడుతూ "పేపర్ లీక్‌లు, పరీక్షల నిర్వహణలో అసమర్థత, అవకాశాల లేమి, వ్యవస్థలో అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. ఏన్డీఏ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోంది. విద్యార్థులు చెప్పేది వినాలని, పార్లమెంట్‌లో నీట్‌పై చర్చలు ఆపాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తాం. ఈ అవకతవకలకు వ్యతిరేకంగా ఎన్టీఏను రద్దు చేసేందుకు పార్లమెంట్ లోపలా, బయటా గళం విప్పుతాం" అని అన్నారు.

విద్యాసంస్థల బంద్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలనీ, ప్రశ్నాపత్రం లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనీ, రాష్ట్రాలకే పరీక్షలు నిర్వహించుకునే అధికారం కల్పించాలనే పలు డిమాండ్లతో విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల వల్ల 24 లక్షల మంది విద్యార్థులు నష్టపోయి తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఉన్నత చదువులకోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలను నిర్వహించ డంలో ఎన్డీఏ ప్రభుత్వం తీవ్రంగా విఫలమవుతున్నదని విమర్శిం చారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని రద్దు చేయాలనీ, గతంలో మాదిరిగానే మెడికల్ ప్రవేశాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అనుమతివ్వాలంటూ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు జరుగుతున్నాయని పేర్కొ న్నారు. విద్యార్థుల ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతున్నారే తప్ప బాధితులకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. విద్యార్థులకు ఇంత నష్టం వాటిల్లు తున్నా తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు, బీజేపీ ఎంపీలు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడాన్ని తప్పుపట్టారు. ఈ నేపథ్యంలోనే విద్యాసంస్థల బంద్‌ను బలపరుస్తున్నామని తెలిపారు. యువతీ యువకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జార్ఖండ్ సీఎం చంపయ్ రాజీనామా

నూతన ముఖ్యమంత్రిగా హేమంత్ సొరేన్

- ఇండియా బ్లాక్ ఎల్పీ నేతగా ఎన్నిక
- గవర్నరుతో భేటీ
- నేడు ప్రమాణస్వీకారం ?



రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపయ్ సొరేన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో హేమంత్ సొరేన్ సీఎంగా మూడోసారి బాధ్యతలు చేపట్టేందుకు లైన్ క్లియర్ అయింది. ఆయన రాష్ట్రానికి 13వ ముఖ్యమంత్రి కాబోతున్నారు. జార్ఖండ్‌లో బుధవారం పలు రాజకీయ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. చంపయ్ రాజీనామా చేయడం, ఆ వెంటనే ఇండియా బ్లాక్ శాసనసభాపక్షం సమావేశమై హేమంత్ సొరేన్‌ను నేతగా ఎన్నుకోవడం, అనంతరం ఆయన గవర్నరును కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాల్సిందిగా కోరడం చకచకా జరిగిపోయాయి. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు రాజీనామా పత్రం సమర్పించిన అనంతరం రాజ్‌భవన్ ఎదుట చంపయ్ సొరేన్ విలేకరులతో మాట్లాడుతూ 'మా కూటమి హేమంత్ బాబును నేతగా ఎన్నుకోవాలని నిర్ణయించింది. నేను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాను' అని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని హేమంత్ కోరిన వెంటనే చంపయ్ గవర్నరును కలిసి రాజీనామా సమర్పించారు. అంతకుముందు హేమంత్ ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాల నేతలతో కలిసి గవర్నర్‌తో సమావేశమయ్యారు. కాగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన గురువారం ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది.

అంతకుముందు ముఖ్యమంత్రి చంపయ్ సొరేన్, భాగస్వామ్య పక్షమైన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మిర్, పీసీసీ అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్‌తో పాటు పలువురు నేతలు, ఇండియా కూటమికి చెందిన శాసనసభ్యులు రాజధాని రాంచీలో సమావేశమయ్యారు. అధికార మార్పిడికి వారందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 'హేమంత్ మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇర్ఫాన్ అన్సారీ తెలిపారు.

భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో హేమంత్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సుమారు ఐదు నెలలు జైలు జీవితం గడిపిన ఆయన గత నెల 28న బెయిల్‌పై విడుదలయ్యారు. అరెస్టుకు ముందు జనవరి 31న హేమంత్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో చంపయ్ సొరేన్ ఫిబ్రవరి 2న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

తక్కువ బరువుతో శిశువులు

- కోవిడ్ సమయంలో ఇలా జన్మించిన చిన్నారులు 3 శాతం కంటే ఎక్కువే
- కొత్త అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : కోవిడ్ -19 మహమ్మారి సమయంలో భారతదేశంలో తక్కువ బరువుతో జన్మించిన శిశువుల సంఖ్య బాగా పెరిగింది. సుమారు మూడు శాతం కంటే ఎక్కువ మంది పిల్లల జననం ఇలాగే జరిగిందని నూతన అధ్యయనంలో వెల్లడైంది. మహమ్మారి సమయంలో జన్మించిన పిల్లలు పుట్టినప్పుడు తక్కువ బరువు కలిగి ఉండే ప్రమాదం రెండింతలు ఉన్నట్టు ఈ అధ్యయనం కనుగొన్నది. తక్కువ బరువుతో జన్మించిన పిల్లల పెరుగుదల దీర్ఘకాలికంగా ప్రభావాన్ని చూపుతుందని అభివృద్ధి, గ్లోబల్ హెల్త్ ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ యూనివర్సిటీ ఆఫ్ నోట్రే డామ్ సంతోష్ కుమార్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు తక్కువ బరువుతో పుడుతున్నారు. దీనిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2.5 కిలో గ్రాముల కంటే తక్కువ అని నిర్వచించింది. కమ్యూనికేషన్స్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురించ బడిన అధ్యయనం ప్రకారం.. ఈ శిశువులలో 95 శాతం మంది తక్కువ, మధ్య-ఆదాయ దేశాలలో, సగం మంది దక్షిణాసియాలో జన్మించారు. ఈ అధ్యయనం ప్రకారం.. ఏప్రిల్ 2020-ఏప్రిల్ 2021 మధ్య జన్మించిన పిల్లలు మహమ్మారికి ముందు జన్మించిన వారితో పోలిస్తే డబ్ల్యూహెచ్ఓ నిర్వచించిన పరిమితి కంటే తక్కువ బరువు కలిగి ఉన్నారు. రెండు లక్షల మంది శిశువులను విశ్లేషించగా.. అందులో



12,000 మంది మహమ్మారి సమయంలో జన్మించారు. 1,92,000 మంది మహమ్మారికి ముందు జన్మించారు. 2019-2021లో నిర్వహించిన ఇండియన్ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) నుంచి సమాచారం సేకరించారు. సగటున, మహమ్మారి సంవత్స రాలలో జనన బరువులు 11 గ్రాములు తగ్గినట్టు కనుగొనబడింది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలలో గణనీయమైన సంఖ్యలో మహమ్మారి-ప్రభావిత పిల్లలను గమనించినప్పటికీ, ధనిక కుటుంబాల నుంచి పెద్ద సంఖ్యలో పిల్లలు కూడా ప్రభావితమయ్యారని పరిశోధకులు కనుగొన్నారు. కోవిడ్ సమయంలో భౌతిక దూరానికి సంబంధించిన ఒత్తిడి, ఆర్థిక సమస్యలు మాతా-నవజాత శిశువుల సంరక్షణకు అంతరాయం కలిగించాయి. మహమ్మారికి సంబంధించిన అనేక అంశాలు గర్భిణీ స్త్రీల ఆరోగ్య ప్రవర్తనలను ప్రభావితం చేసి, శిశువులు తక్కువ బరువుతో జన్మించటానికి దారి తీసి ఉండవచ్చని పరిశోధకులు చెప్తున్నారు.

కట్టు కథలను నమ్మకండి

ఒక వర్గం మలయాళం మీడియాలో వచ్చిన వార్తలకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఖండన

న్యూఢిల్లీ : ఇటీవల న్యూఢిల్లీలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశం జరిగిన నేపథ్యంలో ఆ సమావేశం గురించి పూర్తిగా కల్పితమైన వార్తలను మలయాళం మీడియాలోని ఒక వర్గం ప్రచురించింది. పార్టీ రాజకీయ పంథాను ఒక సభ్యుడు విమర్శించారని, పైగా పార్టీ ప్రధాన కార్యదర్శిపై ఆరోపణలు చేశారన్నది ఆ కల్పిత వార్తల సారాంశంగా వుంది. ఇటువంటి కల్పిత వార్తలను, అపవాదులను ప్రచారం చేయడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. వాస్తవానికి ఆ సభ్యుడు చర్చలోనే పాల్గొనలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. పార్టీ కార్యకర్తల్లో, కేరళలోని మద్దతుదారుల్లో గందరగోళాన్ని సృష్టించడమే ఇటువంటి చర్యల ఉద్దేశ్యమని స్పష్టం చేసింది. ఇటువంటి ప్రయత్నాలు ఫలించబోవని తెలిపింది. వాస్తవానికి, ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరుపై కేంద్ర కమిటీ కూలంకషంగా సమీక్షించిందని, ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిందని పొలిట్‌బ్యూరో తెలిపింది.

కేరళ రాష్ట్ర కమిటీ నిర్వహించిన సమీక్షలో ప్రధాన అంశాలను కూడా ఈ తీర్మానంలో పొందుపరిచామని ఆ ప్రకటన పేర్కొంది. ఇటువంటి కల్పితమైన, వక్రీకరించే వార్తల ప్రచురణను పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండిస్తోందని ఆ ప్రకటన పేర్కొంది. ప్రస్తుతమున్న సవాళ్ళను పార్టీ కలిసికట్టుగా ఎదుర్కొంటుందని స్పష్టం చేసింది.

తొమ్మిది మాసాల్లో గాజాలో 6050మంది విద్యార్థులు మృతి

10వేల మందికి పైగా గాయాలు

గాజా : గాజాలో గత 9మాసాలుగా ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 6050మంది విద్యార్థులు చనిపోయారని పాలస్తీనా విద్యా శాఖ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. 10,219మంది గాయపడ్డారు. గాజాలో 5,994మంది మరణించగా, 9890మంది గాయపడ్డారని, వెస్ట్ బ్యాంక్‌లో 56మంది విద్యార్థులు చనిపోగా, 329మంది గాయపడ్డారని, 105మందిని నిర్బంధించారని పాలస్తీనా ఇన్ఫర్మేషన్ సెంటర్ తెలిపింది. కాగా ఇప్పటివరకు గాజాలో 266 మంది టీచర్లు, స్కూల్ అడ్మినిస్ట్రేటర్లు చనిపోగా, 973మంది గాయపడ్డారని వెల్లడించింది. గాజావ్యాప్తంగా 351 ప్రభుత్వ స్కూళ్ళు, ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నడిచే 65 పాఠశాలలు బాంబు దాడులకు గురై ధ్వంసమయ్యాయని విద్యా శాఖ వర్గాలు వెల్లడించాయి. వీటిలో 111 భవనాలు తీవ్రంగా దెబ్బతినగా, 40 భవనాలు పూర్తిగా నేలమట్టమై పోయాయి. గాజాలో కొనసాగుతున్న ఈ దాడుల కారణంగా 6,20,000మందికి పైగా విద్యార్థులకు విద్య దూరమైందని పేర్కొంది. విద్యార్థుల్లో చాలామంది మానసిక అస్వస్థతలకు గురయ్యారని, దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని పేర్కొంది.

న్యాయాన్ని అపహాస్యం చేయడమే

- మేథా పాట్కర్ అరెస్టు ఉత్తర్వులపై ఎఐకెఎస్ వ్యాఖ్య
- తక్షణమే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్

న్యూఢిల్లీ : నర్మదా ప్రాజెక్టు బాధితులకు న్యాయం కోసం ఉద్యమించిన మేథా పాట్కర్‌కు 23ఏళ్ళ నాటి కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల అఖిల భారత కిసాన్ సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వున్న వి.కె.సక్సేనా వేసిన పరువు నష్టం కేసులో ఆమెకు 5 నెలల జైలు శిక్ష, రూ.10లక్షల జరిమానా విధిస్తూ సోమవారం ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మేథా పాట్కర్‌ను అరెస్టు చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులు న్యాయాన్నే అపహాస్యం చేసేలా వున్నాయని ఎఐకెఎస్ విమర్శించింది. తక్షణమే నర్మదా ప్రాజెక్టు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అసమ్మతి గళాన్ని ఇలా అణచివేయడం వెనుక కార్పొరేట్ శక్తులు వున్నాయని, బిజెపితో కలిసి ఈ కార్పొరేట్ శక్తులు పేదల జీవనోపాధి హక్కుల కోసం పోరాడుతున్న వారి గొంతులను నొక్కేస్తున్నారని విమర్శించింది. ఆ కార్పొరేట్ శక్తులను ఎండగట్టాలని ప్రజలను కోరింది.

కల్పిత వార్తలు, సమాచారం ప్రాతిపదికగా ప్రముఖ సామాజిక కార్యకర్తను ఇలా శిక్షించడమన్నది న్యాయాన్ని ఎద్దేవా చేయడమేనని విమర్శించింది. తమ అధికారాన్ని దుర్వినియోగం చేయడంలో కార్పొరేట్ శక్తులు విజయం సాధించాయని ఎఐకెఎస్ వ్యాఖ్యానించింది. మేథా పాట్కర్‌కు సంఘీభావాన్ని ప్రకటించింది. నర్మదా ప్రాజెక్టు వల్ల ఇబ్బందులు పడుతున్న వేలాదిమంది బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో విఫలమయ్యాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎఐకెఎస్ విమర్శించింది. భూ సేకరణ పునరావాస చట్టాన్ని యుపిఎ ప్రభుత్వం ఆమోదించినా నర్మదా లోయలోని రైతుల, గ్రామీణ కార్మికుల నష్టపరిహారం, పునరావాసం హక్కుకు మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వాలు హామీ కల్పించలేదని విమర్శించింది.

ఇప్పటికైనా నర్మదా బాధితులకు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం న్యాయం జరిగేలా చూడాలని ఎఐకెఎస్ గట్టిగా డిమాండ్ చేసింది. బాధితులకు ఉపాధి కల్పించాలని, పునరావాసం, రీ సెటిల్‌మెంట్ ద్వారా వారి జీవనోపాధికి మద్దతును అందచేయాలని కోరింది.

మూర్ఖత్వమే కారణమా?

- చూసేందుకు వచ్చిన వారిని తోసేయడంతోనే....
- కర్రలతో అదుపు చేయడానికి చూసిన నిర్వాహకులు
- హత్రాస్ విషాదంపై జ్యుడీషియల్ దర్యాప్తునకు ఆదేశాలు
- 121కి పెరిగిన మృతులు



న్యూఢిల్లీ : మంగళవారం నాటి హత్రాస్ విషాద ఘటనలో మరో ఐదుగురు మరణించడంతో బుధవారం మృతుల సంఖ్య 121కి పెరిగింది. మరో 31మంది గాయపడ్డారు. సాక్ష్యాధారాలను దాచిపెట్టారని, నిబంధనలను నీరు గార్చారని నిర్వాహకులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 80వేల మంది పట్టే స్థలంలో ఏకంగా రెండున్నర లక్షలమంది రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయి తోపులాటలు, తొక్కిసలాటలకు దారి తీసిందని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ దారుణ ఘటనపై జ్యుడీషియల్ దర్యాప్తునకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ బాధ్యత ఎక్కడ వుంది ? ప్రియాంక గాంధీ

"అనుమతించిన జనాల కన్నా మూడు రెట్లు ఎక్కువమంది వచ్చారు. అక్కడ ఏర్పాట్లేవి, జనాలను సద్దుబాటు చేసే చర్యలేవి? తప్పించుకునేందుకు దారి కూడా లేదు. వైద్య బృందాలు లేవు, అంబులెన్సులు లేవు, సాయం చేసేవారు లేరు, డాక్టర్లు లేరు, ఆస్పత్రిలో సదుపాయాలు లేవు అధికార యంత్రాంగం నిర్లక్ష్యం జాబితానే ఇంత కనిపిస్తోంది, కానీ ఎవరూ జవాబుదారి కాదు. మరి ఈ విషాదానికి బాధ్యులెవరు?" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, మరి ప్రభుత్వం ఇక్కడ ఏం చేస్తోందని ప్రశ్నించారు.

మరణించినవారిలో ఆరుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. కాగా ఈ తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు జరపాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలైంది. రష్యా అధ్యక్షుడు పుతిన్, జపాన్ ప్రధాని కిషిదాలు ఈ విషాద ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన జరగడానికి కారణమైన సత్సంగ్ వెనుక గల భోలే బాబా ఈ సంఘటనపై వ్యాఖ్యానిస్తూ ఇదంతా 'సంఘ వ్యతిరేక శక్తుల పని' అని పేర్కొన్నారు. ఈ తొక్కిసలాట జరగడానికి చాలా ముందుగానే తాను ఆ వేదిక నుండి వెళ్ళిపోయానని చెప్పుకున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. కాగా సంఘటనా స్థలంలో నమూనాలను తీసుకునేందుకు బుధవారం ఫోరెన్సిక్ నిపుణుల బృందం వచ్చింది. జాగిలాల బృందాన్ని కూడా తీసుకువచ్చి కొన్ని సాక్ష్యాలను సేకరించారు.

మొయిన్‌పురి ఆశ్రమంలో బాబా ?

ప్రస్తుతం బాబా మొయిన్‌పురి ఆశ్రమంలో వున్నట్లు తెలుస్తోంది. ఆ ఆశ్రమం వెలుపల పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని మొహరించారు.వివిధ పోలీసు స్టేషన్ల నుంచి సిబ్బందిని సమీకరించి బిచవన్ వద్ద గల ఆశ్రమం వెలుపల మొహరించారు. కానీ, బాబా ఆశ్రమంలో వున్నారా లేదా అనే విషయంపై వారెవరూ నోరు విప్పడం లేదు. నిజానికి ఆయన లోపల వున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కానీ మీడియాతో సహా ఎవరినీ లోపలకు అనుమతించడం లేదు.

చూసేందుకు వచ్చినవారిని తోసేయడంతో...

బాబాను చూసేందుకు వచ్చినవారిని బాబా అనుచరులు తోసేయడంతో ఏటవాలుగా వున్న ఆ ప్రాంతంలో జారి పడ్డారు. పైగా అక్కడంతా చిత్తడిగా వుండడం పరిస్థితి దిగజారింది, ఫలితంగా తొక్కిసలాట జరిగిందని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డిఎం) సికందర్ రావు జిల్లా మేజిస్ట్రేట్‌కు అందచేసిన ప్రాథమిక నివేదిక పేర్కొంది. సత్సంగ్‌కు అనుమతినిచ్చిన ఎస్‌డిఎం తోపులాటలు జరిగినపుడు అక్కడే వున్నారని ఆ నివేదిక తెలిపింది. బాబా అక్కడ నుండి వెళ్ళిపోవడానికి ఉద్యుక్తులవగానే ఆయన్ని చూసేందుకు ప్రజలు పరుగులు తీశారని, ఆయన పాదధూళి తీసుకునేందుకు ప్రయత్నించారని నివేదిక పేర్కొంది. రోడ్డు డివైడర్లపై అప్పటికే వేచి వున్న వారందరూ కూడా ఒక్కసారిగా కిందకు గెంతి బాబా వెళ్ళిపోతున్న వాహనం వెంట పడడంతో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని పేర్కొంది. ఈలోగా బాబా వ్యక్తిగత భద్రతా సిబ్బంది (బ్లాక్ కమాండోలు), సేవాదర్స్ (సత్సంగ్ నిర్వాహకుల తరపు వలంటీర్లు) జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నించడంతో కొంతమంది కిందన పడిపోయారని, ఈ పరిస్థితి భయాందోళనలకు దారితీసి, పరిస్థితి అదుపు తప్పిందని నివేదిక పేర్కొంది.

80వేలు పట్టే దగ్గర 2.5లక్షలమంది !

"దాదాపు 80వేల మంది హాజరవుతారని చెప్పి ప్రధాన నిర్వాహకుడు మధుకర్ అనుమతి తీసుకున్నాడు. అధికారులు కూడా అందుకు అనుగుణంగానే ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అయితే అక్కడ ఏకంగా 2.5లక్షల మంది హాజరయ్యారు.

దీంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నెలకొంది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి." అని ఎఫ్ఐఆర్ పేర్కొంది.

సహకరించని నిర్వాహకులు

మంగళవారం రాత్రి పది గంటల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలోనే భోలే బాబా తన కారులో సత్సంగ్ ప్రదేశాన్ని వదిలి పరారయ్యారు. రోడ్డుకు ఆవలి వైపున ఉన్న పొలాల వైపు జనం పరుగులు తీశారని, అయితే అదంతా నీరు, బురదతో నిండి ఉన్నదని, వాలంటీర్లు లాఠీలతో ప్రజలను చెదరగొట్టారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా వారికి నిర్వాహకులు, వాలంటీర్ల నుండి ఎలాంటి సాయం లభించలేదు. అంతేకాదు...తొక్కిసలాట ఫలితంగా చెల్లాచెదురుగా పడిపోయిన బూట్లు, చెప్పులు, ఇతర సామగ్రిని వాలంటీర్లు సమీపంలోని పొలంలోకి విసిరేశారు. ఇప్పటి వరకూ నిర్వాహకులు పోలీసులకు ఎలాంటి సమాచారం అందించకపోవడం గమనార్హం.

నీరు, బురదతో నిండిన ఆ ప్రాంతంలో ప్రజలను బలవంతంగా ఆపేందుకు నిర్వాహక కమిటీ సభ్యులు కర్రలను ఉపయోగించారని, దాంతో జనాలపై మరింత ఒత్తిడి పెరిగిందని ఎఫ్ఐఆర్ తెలిపింది.

భోలే బాబా పరార్

ఎఫ్ఐఆర్‌లో కానరాని పేరు

అజ్ఞానాంధకారంలో మూఢభక్తితో కొట్టుకుపోయే వారికి ఇంగిత జ్ఞానం ఉండదు. అది ఎంతటి అనర్థానికైనా దారితీస్తుందని ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో మంగళవారం జరిగిన తొక్కిసలాట ఉదంతం నిరూపించింది. ప్రార్థనా సమావేశాన్ని నిర్వహించిన నారాయణ్ సకాల్ హరి అలియాస్ భోలే బాబా పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సత్సంగ్ ముఖ్య నిర్వాహకుడు దేవ ప్రకాశ్ మధుకర్, ఇతర గుర్తు తెలియని నిర్వాహకులపై మాత్రమే కేసు నమోదైంది. ప్రార్థనా సమావేశానికి ఎనభై వేల మందికి అనుమతి ఇస్తే రెండున్నర లక్షల మంది వచ్చారని పోలీసులు తెలిపారు. భోలే బాబా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఆయనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మొయిన్‌పురిలో భోలే బాబాకు చెందిన రామ్ కుటీర్ ఛారిటబుల్ ట్రస్టులో సోదాలు నిర్వహించామని, అక్కడ ఆయన కన్పించలేదని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ అధికారులు ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను తీసుకొచ్చి పరిసరాలలో గాలించారు.

సంపాదకీయం

పైపై పూతలు కాదు...

'పైపై సొగసులు కల్లసుమా.. లోపలిదంతా డొల్లసుమా...' అన్నారు కాళోజీ. వ్యక్తి నుంచి వ్యవస్థ వరకూ ఇది అక్షరసత్యం. ప్రభుత్వాలు, వాటి విధానాలకు దీన్ని పోల్చి చూడాల్సి వచ్చినప్పుడు తాత్కాలిక అంశాల కంటే ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలకే అవి పెద్ద పీట వేయాలి. మాదక ద్రవ్యాల మత్తులో చిత్తవుతున్న రాష్ట్ర యువతను రక్షించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ తాజాగా ఉన్నతాధి కారులను ఆదేశించిన దరిమిలా ఈ అంశంపై ఇప్పుడు విస్తృత చర్చ అవసరం. గంజాయి మత్తులో ఉండే యువత...చిన్న పిల్లల నుంచి పండు ముదుసలి వరకూ ఎవ్వరినీ వదిలి పెట్టకుండా లైంగిక దాడులకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల అనేకం వెలుగు చూస్తుండటం ఆందోళనకరం. అందువల్ల గంజాయి, కొకైన్, హెరాయిన్, చరాస్ లాంటి వాటిని నియంత్రించాల్సిందే, నిరోధించాల్సిందే, వాటి విక్రయాలపై ఉక్కుపాదం మోపాల్సిందే.

> ఆకలిరాజ్యంలో కమలహాసన్ పాడుకున్నట్టు 'సాపాటు ఎటూ లేదు...' అనే స్థాయిలో కాకపోయినా రాష్ట్రంలోని చదువుకున్న యువతకు మాత్రం ప్రభుత్వాల 'గ్రహ పాటు' తప్పటం లేదు. అందువల్ల మాదక ద్రవ్యాలను అరికట్టాలనే ఉద్దేశంతో ముందుకు కదులుతున్న పాలకులు, అధికార యంత్రాంగం అన్నిటికంటే ముందు పేదరికం, నిరుద్యోగం, ఉపాధి అవకాశాల వంటి కీలకాంశాలపై దృష్టి సారించాలి. ఇది చేస్తూనే కేరళ సర్కారు తరహాలో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకూ విద్యార్థులందరికీ మద్యం, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వల్ల నష్టాలపై అవగాహన కల్పించాలి. అప్పుడే ఆ మత్తు నుంచి యువతను బయటపడేయగలం.

అయితే ఒక పుండు, గాయానికి పైపైన పూతలు పూసి వదిలేస్తే ఎలాంటి ఉపయోగం ఉండబోదో అదే మాదిరిగా సమాజంలో మద్యపానం, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసైన వారి పరిస్థితులను వాటి వరకే పరిమితమై చూస్తే సమస్యకు పరిష్కారం దొరకదు. దాన్ని భిన్న కోణాల్లో పరిశీలించాలి. శాస్త్రీయమైన, సహేతుకమైన పరిష్కార మార్గాలు కనుక్కోవాలి. ఇందులో సామాజిక, ఆర్థిక కోణాలున్నాయనే విషయాన్ని ఏలికలు మరువరాదు. రాష్ట్రంలోనే కాదు దేశంలోనూ పేదరికమనే భూతం అనేక మందిని మాదక ద్రవ్యాల రవాణాకు వాహకాలుగా మారుస్తోంది. పొట్ట నింపుకోవటం, పూట గడవటం కోసం ఇలా వాహకాలుగా మారుతున్న వారెందరో. ఆ క్రమంలోనే నగరాలు, పట్టణాల్లోని యువత వీటిని అమ్మటమేగాక వాటికి క్రమక్రమంగా అలవాటవుతూ పూర్తి బానిసలుగా మారిపోతున్నారు. మరోవైపు జీవితాన్ని సరైన దారిలో పెట్టే విద్య, చదువుకున్న తర్వాత ఆ చదువుకు తగ్గ పని, ఉపాధి, ఉద్యోగావకాశాలు అందరికీ ఉండాలి. కానీ విద్య అనేది పేదలకు అందని ద్రాక్షగా మారిన ప్రస్తుత తరుణంలో ఉపాధి అవకాశాలు కూడా నానాటికీ తీసికట్టు నాగం బొట్టులా మారి పోతున్నాయి. ఓ నలభై ఏండ్ల కిందట ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీల్లో పేరు నమోదు చేసుకుంటే చిన్నా చితకా ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందనే నమ్మకం ఉండేదంట! కానీ సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత ఆ నమ్మకాలకే కాదు ఏకంగా ఎక్స్ఛేంజీలకే పాలకులు చెల్లు చీటి ఇచ్చారు.



'ప్రస్తుత సమాజం నాకేమిచ్చింది?' అనేది నేటి యువత ప్రశ్న. అందర్నీ భగత్‌సింగ్‌లాగా ఉరికంబాలు పట్టుకుని ఊగాలని చెప్పలేం. జన్మనిచ్చిన తల్లిదండ్రులకే కాదు, పుట్టిన ఊరికి, చుట్టూ ఉన్న సమాజానికి తన వంతు బాధ్యత నెరవేర్చాలనే స్పృహ లేకుండా చేస్తుందీ మత్తు. 1970వ దశకంలో ప్రారంభమై అమెరికాలో విస్తరించిన 'హిప్పీ' సంస్కృతి పాలకులపై తిరగబడాల్సిన యువతను మత్తులో జోకొట్టింది. 1968లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైన విద్యార్థుల తిరుగుబాట్లు (వారిని సిక్స్టీ ఎయిటర్స్‌గా పిలుచుకుంటారు) అమెరికాలోకి జొరబడకుండా నాటి అమెరికన్ పాలకులు వేసిన 'మందుగోళీలు' కావచ్చు ఈ హిప్పీ సంస్కృతి. ఏమైనా సమాజంపై అది ఒక తిరస్కృతి. ఒక ధిక్కారం. ఆ స్థితికి తెలంగాణ సమాజం చేరరాదు.

ఇప్పుడు తెలంగాణలో 'చదువుకున్న నిరుద్యోగుల' పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. గత బీఆర్ఎస్ సర్కారు ఎలాంటి ఉద్యోగం లేని వారికి నెలకు రూ.నాలుగు వేలిస్తామంటూ నిరుద్యోగ భృతిని ప్రకటించింది. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆ హామీ హామీగానే మిగిలింది తప్ప అమలుకు నోచుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలు, రంగాల్లో కలిపి లక్ష పోస్టులు ఖాళీగా ఉంటే వాటిని నింపుదామన్న సోయి అప్పటి గులాబీ సర్కారుకు లేకుండా పోయింది. పైగా మూడు లక్షల మంది అభ్యర్థులు రాసిన గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దయి నిరుద్యోగులకు తీరని శోకాన్ని మిగిల్చింది. ఇక 'కారు' పల్టీలు కొట్టిన తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ తమిళనాడు, కేరళ తరహాలో ప్రతీయేటా 'జాబ్ క్యాలెండర్' వేస్తామని ప్రకటించినా...ఆర్నెళ్లుగా అది పట్టా లెక్కలేదు. బీఆర్ఎస్ మాదిరిగా నిరుద్యోగ భృతి హామీనిచ్చిన కాంగ్రెస్ ఆ వాగ్దానాన్ని ముున్ముందైనా నెరవేరుస్తుందా? లేదా? చూడాలి.

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఆకలిరాజ్యంలో కమలహాసన్ పాడుకున్నట్టు 'సాపాటు ఎటూ లేదు...'అనే స్థాయిలో కాకపోయినా రాష్ట్రంలోని చదువుకున్న యువతకు మాత్రం ప్రభుత్వాల 'గ్రహ పాటు' తప్పటం లేదు. అందువల్ల మాదక ద్రవ్యాలను అరికట్టాలనే ఉద్దేశంతో ముందుకు కదులుతున్న పాలకులు, అధికార యంత్రాంగం అన్నిటికంటే ముందు పేదరికం, నిరుద్యోగం,ఉపాధి అవకాశాల వంటి కీలకాంశాలపై దృష్టి సారించాలి. ఇది చేస్తూనే కేరళ సర్కారు తరహాలో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకూ విద్యార్థులందరికీ మద్యం, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వల్ల నష్టాలపై అవగాహన కల్పించాలి. అప్పుడే ఆ మత్తు నుంచి యువతను బయటపడేయగలం. ఇదే సమయంలో, 140 కోట్ల దేశముందని, దీన్లో కోటానుకోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారని, 30 కోట్ల మంది నిరుద్యోగులుగా, మరెందరో చిరుద్యోగులుగా అత్తెసరు జీవితాలు లాగుతున్నారని వారికోసం తానూ నిలవాలనే సామాజిక స్పృహ నేడు కరువైంది. దాన్ని కల్పించే పని ప్రస్తుత పాలకులు చేయరు. పునాది స్థాయిలో సామాజికోద్యమాలే పరిష్కారం.

తీరు మారని మోడీ రాజ్యం



ఈ దఫా మోడీ నాయకత్వంలో ఏర్పడింది ఎన్డీయే మిశ్రమ ప్రభుత్వం గనక బీజేపీ, ఆరెస్సెస్ గ్ఘనిరంకుశ, మతతత్వ కార్పొరేట్ ఎజెండాతో ముందుకు పోవడంలో తీవ్రమైన చిక్కులు ఎదుర్కోవలసి రావచ్చుని కొన్ని వర్గాల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ ఆశాభావాల్లో కొన్ని అతి అంచనాలేనని చెప్పాలి. బీజేపీ మెజార్టీ కోల్పోయి లోక్‌సభలో 240 స్థానాలకే పరిమితమైంది గనక మోడీ మూడో దఫా పాలనలో ఆయనగానీ ఆరెస్సెస్, బీజేపీలుగానీ అమలు చేయాలనుకున్న ఎజెండాలో కొన్నిటికి అదుపు చేయడం, నెమ్మదించడం జరగొచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థను, లౌకిక సూత్రాలను మరింత దెబ్బ తీసి ఏకీకృత నియంతృత్వాన్ని మళ్లీ రుద్దే విధంగా రాజ్యాంగ మార్పులు చేయడం ఇప్పుడు సాధించడం కష్టమే కావచ్చు. అయితే ఆర్థిక రంగంలో మోడీ విధానాల పరంగానూ, వ్యవస్థలను దెబ్బ తీసి నిరంకుశత్వం పెంచే పోకడలలోనూ మోడీ ప్రభుత్వ వైఖరిలో గుణాత్మకమైన మార్పేమీ వుండదు. ప్రతిపక్షంతో మోడీ సర్కారు ఘర్షణాత్మక వైఖరి, పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల తృణీకరణ పార్లమెంటు సమావేశాల ప్రారంభంలోనే కనిపించింది. కొత్త స్పీకర్‌ను ఎన్నుకునే సందర్భంలో ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ స్థానం ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది. ఆ విధంగా ఎన్నికపై ఏకాభిప్రాయం లేకుండా చేసింది. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం తర్వాత కొద్ది రోజులలోనే దాని నిరంకుశ నిర్బంధ పాలన నిర్మాణ చట్రం రంగంలోకి వచ్చేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కింది కోర్టు బెయిల్ ఇస్తే హైకోర్టు కొట్టివేసింది. కేజ్రీవాల్ జైలు నుంచి బయటికి రాకుండా చేసేందుకై సిబిఐ అదే కేసులో మరోసారి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచింది. రచయిత్రి అరుంధతీరాయ్‌పై ఒక కేసు నమోదైన తర్వాత 14 ఏళ్లకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఉపా కింద విచారణ జరిపేందుకు అనుమతి మంజూరు చేశారు. జులై 1 నుంచి మూడు నేర స్మృతులు (కోడ్స్) అంతకు ముందున్న నేరస్మృతులు శిక్షా స్మృతుల స్థానంలో అమలులోకి (వచ్చాయి)రానున్నాయి. ఈ కొత్త కోడ్స్‌లోని అనేక నిబంధనలు పౌరుల ప్రజాస్వామిక హక్కులపై అనేక రకాలైన ఆంక్షలు పెంచబోతున్నాయి. పౌరులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో పోలీసులకు మరిన్ని అధికారాలు కల్పించడమే గాక..రాజద్రోహం వంటి వాటిని శిక్షించేందుకు కర్కోటకమైన అధికారాలు కట్టబెట్టనున్నాయి.

> హిందూత్వ రాజకీయాల కొనసాగింపు, మైనార్టీలను లక్ష్యంగా చేసుకునే దాడుల విషయంలోనూ ఎలాంటి విరామం వుండబోదు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి కొద్ది రోజులలోనే ఈ విషయం స్పష్టమైంది. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ముస్లిములను లక్ష్యంగా చేసుకుని అనేక దాడి ఘటనలు జరిగాయి. ఛత్తీస్‌గఢ్‌లో రారుపూర్ సమీపంలోని అరంగ్‌లో పశువుల రవాణాదారులైన ముగ్గురిని మూక చంపివేసింది. పశువుల వ్యాపారం చేయడమే వారి నేరమైంది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ మాండ్ల జిల్లాలో తమ ఇంటి రిఫ్రిజిరేటర్లలో పశుమాంసం నిల్వ పెట్టుకున్నారనే ఆరోపణలతో పదకొండు మందిని అరెస్టు చేశారు. ఆ తదనంతరం స్థానిక యంత్రాంగం అక్రమాక్రమణలనే నెపంతో ఆ పదకొండు మంది వ్యక్తుల ఇండ్లను కూల్చివేసింది.

నిర్బంధ చట్టాలకు కోరలు

అమిత్ షాను మళ్లీ హోంమంత్రిగా నియమించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ తదితర సంస్థలు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని తమ కార్యకలాపాలు కొనసాగించబోతున్నాయి. తమకు వ్యతిరేకమైన ఏ ఇతర వ్యక్తులను లేదా వ్యవస్థలను, తమ అవసరాల కోసం బెదిరించి లొంగదీసుకోవలసిన వారి విషయంలోనూ ఇదే జరగబోతుంది.గత ప్రభుత్వ పాలన ఆఖరి దశలో తీసుకొచ్చిన టెలికాం చట్టం, ఐ.టి చట్టం నిబంధనలు ఇప్పుడు అమలులోకి రానున్నాయి. టెలికాం చట్టం 2023 జనవరి 26న పాక్షికంగా నోటిఫై అయ్యింది కూడా. బహిరంగ ఎమర్జెన్సీ సమయంలో ఏ విధంగానైతే ఏదైనా మెసేజ్‌ను ఇంటర్నెట్ ద్వారా చేరవేయకుండా నిరోధించవచ్చునో ఆ విధంగా అడ్డుకోవడానికి ఈ చట్టం ప్రభుత్వానికి అవకాశమిస్తుంది. హోం శాఖ కార్యదర్శి అనుమతి వుంటే చాలు కేంద్ర సంస్థలు ఏ టెలికాం ప్రసారాన్నయినా ఆపేయడానికి నాలుగు కేంద్ర సంస్థలకు అధికారం ఇస్తుంది.

కార్పొరేట్ హిందూత్వ కూటమి దాడి

ఎన్నికల తరుణంలో బడా వాణిజ్య వర్గం నిర్ద్వంద్వంగా నరేంద్ర మోడీకి మద్దతు ఇచ్చింది.బీజేపీకి మెజార్టీ రాలేదని వార్తలు రాగానే స్టాక్ మార్కెట్ వణికిపోయింది. అయితే మోడీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు గురించి ప్రకటన రాగానే ఒక్కసారిగా పైకి లేచి కూచుంది. ఆర్థిక మంత్రిగా మళ్లీ నియమితమైన నిర్మలా సీతారామన్ తన తొలి ప్రకటనలోనే తదుపరి దఫా సంస్కరణలు తక్షణం చేపడతామని ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో పొందుపరచవలసిన తమ కోర్కెల జాబితాతో బడా వాణిజ్య వర్గం ఆర్థిక మంత్రి దగ్గర మంతనాలు జరుపుతున్నది. మోడీ మూడో సర్కారు ఏర్పాటుతో కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలు పూర్తి ఊపుగా కొనసాగబోతున్నాయనే సంకేతం వస్తున్నది. నేషనల్ మానెటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) వంటి ప్రయివేటీకరణ చర్యలు మరింతగా విచ్చుకుంటాయని భావించవచ్చు. ప్రభుత్వంలో మిత్ర పక్ష భాగస్వాములుగా వున్న తెలుగుదేశం పార్టీ, జేడీ(యు) వంటి వాటి స్వభావం రీత్యా కూడా ఈ ఆర్థిక విధానాలకు ఎలాంటి ప్రతిఘటన వుండబోదని అర్థమవుతుంది.

హిందూత్వ రాజకీయాల కొనసాగింపు, మైనార్టీలను లక్ష్యంగా చేసుకునే దాడుల విషయంలోనూ ఎలాంటి విరామం వుండబోదు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి కొద్ది రోజులలోనే ఈ విషయం స్పష్టమైంది. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ముస్లిములను లక్ష్యంగా చేసుకుని అనేక దాడి ఘటనలు జరిగాయి. ఛత్తీస్‌గఢ్‌లో రారుపూర్ సమీపంలోని అరంగ్‌లో పశువుల రవాణాదారులైన ముగ్గురిని మూక చంపివేసింది. పశువుల వ్యాపారం చేయడమే వారి నేరమైంది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ మాండ్ల జిల్లాలో తమ ఇంటి రిఫ్రిజిరేటర్లలో పశుమాంసం నిల్వ పెట్టుకున్నారనే ఆరోపణలతో పదకొండు మందిని అరెస్టు చేశారు. ఆ తదనంతరం స్థానిక యంత్రాంగం అక్రమాక్రమణలనే నెపంతో ఆ పదకొండు మంది వ్యక్తుల ఇండ్లను కూల్చివేసింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో మత ఘర్షణల్లో 51 మంది అరెస్టయ్యారు. మతపరమైన విభజనతో సమీకరణలు చేయడం, మైనార్టీలు లక్ష్యంగా దాడులు జరపడం హిందూత్వ శక్తుల జీవ ధాతు రాజకీయం. కేంద్ర ప్రభుత్వం వీటిని అడ్డుకోవడం, అదుపు చేయడం జరగదు.

కేంద్రంలో జేడీయూ, టీడీపీ

గుర్తించవలసిన విషయమేమంటే ఈ మిశ్రమ కూటమిలో బీజేపీ ప్రధాన శక్తి. ఇద్దరు ప్రధాన మిత్రులుగా వున్న పార్టీలు టీడీపీ, జెడి(యు)లకు ఏదైనా రాజకీయ విధానపరమైన వైఖరి తీసుకోగల శక్తిగాని, గట్టిగా నిలబడాలనే ఆసక్తి గాని లేవు. టీడీపీకి సంబంధించినంత వరకూ దాని నాయకుడైన చంద్రబాబు నాయుడు దృష్టి ఆంధ్రప్రదేశ్‌లో తన స్థానం పటిష్టం చేసుకోవడంపైనే కేంద్రీకరించి వుంది. కేంద్రం పట్ల ఆయన వైఖరి ఏపీలో తన ప్రాధాన్యతా ప్రాజెక్టులకు నిధులు, ప్యాకేజీల గురించి సంప్రదింపులకు పరిమితమై వుంటుంది. ఇక జేడీయూ వరకూ తీసుకుంటే బీహార్ సరిహద్దుల పరిధి మించి వారికి మరేమీ పట్టదు. వచ్చే ఏడాది జరిగే శాసనసభ ఎన్నికల దృష్ట్యా తన స్థానాన్ని గట్టిపర్చుకోవడంపైనే జేడీయూ దృష్టి. ప్రతిపక్ష ఐక్యత కోసం పని చేసే సమయంలో ఈ వాస్తవాన్ని బుర్రలో పెట్టుకోవాలి.

> ప్రతిపక్షంతో మోడీ సర్కారు ఘర్షణాత్మక వైఖరి, పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల తృణీకరణ పార్లమెంటు సమావేశాల ప్రారంభంలోనే కనిపించింది. కొత్త స్పీకర్‌ను ఎన్నుకునే సందర్భంలో ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ స్థానం ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది. ఆ విధంగా ఎన్నికపై ఏకాభిప్రాయం లేకుండా చేసింది. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం తర్వాత కొద్ది రోజుల లోనే దాని నిరంకుశ నిర్బంధ పాలన నిర్మాణ చట్రం రంగంలోకి వచ్చేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కింది కోర్టు బెయిల్ ఇస్తే హైకోర్టు కొట్టివేసింది. కేజ్రీవాల్ జైలు నుంచి బయటికి రాకుండా చేసేందుకై సిబిఐ అదే కేసులో మరోసారి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచింది. రచయిత్రి అరుంధతీరాయ్‌పై ఒక కేసు నమోదైన తర్వాత 14 ఏళ్లకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఉపా కింద విచారణ జరిపేందుకు అనుమతి మంజూరు చేశారు.

విశాల ఐక్యత, వామపక్ష కీలక పాత్ర

పార్లమెంటులో ప్రతిపక్షం బలం పెరిగిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వ విధానాలపై పోరాటం మరింత మెరుగ్గా సాగించవచ్చుననే విషయంలో సందేహం లేదు. ప్రభుత్వ దుశ్చర్యలను మరింత బాగా బహిర్గత పరచడానికిది దోహదపడుతుంది. అయితే ప్రజాస్వామ్యంపై మోడీ ప్రభుత్వ నిరంకుశ దాడులపై ప్రతిఘటన పెంపొందించడం మరింత ముఖ్యం. నయా ఉదారవాద విధానాలతో ప్రజల జీవనోపాధిపై సాగించే దాడులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు, నిరసనలు పెంపొందించాలి. ఈ సందర్భంలోనే వామపక్షాల పాత్ర కీలకమవుతుంది. ఎందుకంటే నయా ఉదారవాద విధానాలను హిందూత్వ భావజాలాన్ని నికరంగా నిరంతరంగా వ్యతిరేకించేది వామపక్షమే.రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం, సమాఖ్యతత్వం కాపాడుకోవడం వంటి విషయాల్లో ఇండియా వేదిక, విశాల ప్రతిపక్ష ఐక్యత ప్రధాన పాత్ర వహించాల్సి వుంటుంది. ప్రజల దైనందిన పోరాటాలలో ప్రజలను సమీకరించడంలో వామపక్షాలు కీలక పాత్ర పోషించాలి, నయా ఉదారవాద విధానాలపై మొత్తం వ్యతిరేక ఉద్యమాలతో వీటిని అనుసంధానం చేయాల్సి వుంటుంది. తద్వారా ప్రత్యామ్నాయ విధానాలను ఒక విశ్వసనీయ వేదికగా రూపొందించాలి. వామపక్షాలతో ముడిపిన వివిధ ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వేదికలు అత్యంత విశాల ఐక్య కార్యాచరణను పెంపొందించాలి. హిందూత్వ కార్పొరేట్ కూటమికి వ్యతిరేకంగా ప్రతిఘటనను తీవ్రం చేయడానికి కొంత రాజకీయావరణం (జాగా) లభించిందనేది లోక్‌సభ ఎన్నికల ఫలితాల నుంచి తీసుకోదగిన ప్రధాన పాఠం.

(జూన్ 26 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

యుద్ధమిపుడొక ఆరని దావానలం

రాజులు రాజ్యాలు
కాలగర్భాన కనుమరుగయ్యాయి
రాజ్యకాంక్ష దండయాత్రలు
యుద్ధాలు విజయాలు
అపజయాలు
గతించిన చరిత్రలే

గతాన యుద్ధమంటే
రాజ్య విస్తరణాకాంక్ష
విశాల సామ్రాజ్యాధిపత్యం
విర్రవీగే విజయోత్సవాలు

గెలుపోటముల సరిహద్దుల్లో
నేలకొరిగిన వీరుల ప్రాణాలు
గాయాలతో రక్తసిక్తమైన
క్షతగాత్రుల హాహాకారాలు
కన్నీటి మడుగున తల్లడిల్లిన



యోధుల దీన కుటుంబాల
విషాద గీతాల జాడల్ని
లిఖించిన చరిత్ర
ఆనవాళ్లేవి కానరావు

రాచరికాలు నిన్నటి
మాటగా మిగిలినా
బలవంతులు కొత్త రూపాన
బడుగు చిరు దేశాలను
దోపిడీ గుప్పిట బంధీజేసి
రాజకీయంగా బలహీనపరిచి
నయా వలసదారులుగా
రూపాంతరం చెందిన రోజులివి

తిరగబడ్డ చిరు దేశాలను
మదబలంతో అణచి
ఎదురు నిలిచి పోరాడితే
కుంటి సాకులతో
ఆధునిక పాశవిక యుద్ధాలతో
కబళిస్తున్న కాలంలో
మరఫిరంగుల దాడులకు
నేలమట్టమైన నగరాల
శిథిలాల కింద నలిగిపోయే
అమాయకుల ఆర్తనాదాలతో
దిక్కులన్నీ హోరెత్తుతున్నాయి

ముగింపే లేని యుద్ధ క్రీడల
నడుమ శవాల గుట్టలు
మానవతను ప్రశ్నిస్తున్నాయి
రక్తపిపాస రాక్షస మూకలకు
ప్రతీకార దాహం తీరేదెన్నడు ?
ఉక్రెయిన్ గాజా ఎక్కడైతేనేమి
ప్రపంచమంతా యుద్ధోన్మాదికి
చంపటం ఓ పైశాచికతయే

ఆరిపోయే ఆనవాళ్లు కానరాని
కార్చిచ్చు అడవిని దహిస్తున్నట్టు
ఇప్పటి విద్వేష యుద్ధజ్వాలలు
రగులుతూ మానవజాతిని
మసి చేయనున్నాయి

అయినా మానవజాతికి
యుద్ధాలు కొత్తవేమీ కాదు
రూపాలు మాత్రమే మారాయి
సామాన్యుడికి లోకాన ఎక్కడైనా
నేడు జీవించడమే ఒక
అంతుతెలియని పోరాటం

భూగోళం మీద బాంబుల
మోతలు వినిపించక
యుద్ధాలు దాడులు
మారణ కాండలు
మచ్చుకైనా కానరాని
మనిషిని మరోమనిషి
హతమార్చే పైశాచిక
దారుణాలు
కానరాని సర్వజనుల ప్రశాంత
జీవనాన్ని ప్రసాదించే
పచ్చని బతుకులు వికసించే
మానవత పరిమళించే
కొత్తలోకం సాకారమెప్పుడో ?

రక్తం కాలువలైన నేలనుండే
గాయమైన దేహాలు
తెగిపడిన శిరస్సులు
నిటారుగా నిలిచి
కొత్త జాతిని చిగురిస్తాయిలే !

- డా. కె.దివాకరాచారి
9391018972

సాయుధ పోరాట వేగుచుక్క 'దొడ్డి కొమురయ్య'

"అమరజీవి నీవు కొమరయ్యా
అందుకో జోహార్లు కొమరయ్యా
న్యాయమన్నది లేని నైజాము రాజ్యానా
విశ్వ రాక్షసుడైన విసునూరి దేశానా
పాలించుచున్న ఆపాల కడవెండిలో
ప్రజల హక్కుల కోసం కొమరయ్యా
ప్రాణాలనిచ్చావు కొమరయ్యా"




శోభ రమేష్
8978656327

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట మంటేనే భూస్వామ్య వ్యతిరేక పోరాటం. నిజాం నిరంకుశ పాలనను ఎదిరించడం. నెహ్రూ, నైజాం సైన్యపు ఊచకోతను ధిక్కరించడం. మూడు వేల గ్రామాల ఇండ్లపై ఎర్రజెండాలు ఎగరేయడం. పదిలక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంచడం. నాలుగు వేల మంది యోధుల వీరమరణం. మరెందరిదో త్యాగాల పర్వం. రక్తధారలు పారిన యుద్ధ భూమిలో శత్రువుని గడగడలాడించిన కార్యక్షేత్రం కడవెండి గ్రామం. ఆ ఊరు పేరు వినగానే మనకు మొదట గుర్తుకొచ్చే పేరు దొడ్డి కొమరయ్య. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో రజాకార్లు, ముష్కరుల తుపాకీ తూటాలకు నేలకొరిగిన తొలి అమరుడు. ఆయన వీరమరణం పొంది నేటికి 78 ఏండ్లు గడుస్తున్నా ఆయన జ్ఞాపకాలు మాత్రం తెలంగాణ చరిత్రలో ఎన్నటికీ సజీవమే. ఒక్కసారి ఆ పోరాట స్మృతులను తెలంగాణ సమాజం గుర్తు చేసుకోవాల్సిన సమయమిది.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఏర్పడ్డ స్వతంత్ర రాజ్యాల్లో నిజాం రాజ్యం ఒకటి. ఇందులో భాగంగానే హైదరాబాద్ సహా తెలంగాణ ప్రాంతం ఉండేది. ఈ నిజాం రాజు ప్రజల్ని తీవ్రంగా హింసించేవాడు. భూమిపై అధిక శిస్తులు వసూలు చేసేవాడు. కట్టనివారిని శిక్షించేవాడు. ఇతనికి అండగా గ్రామాల్లో భూస్వాములు ఉండేవారు. క్రమంగా నిజాం అండ చూసుకుని భూస్వాములు గ్రామాల్లో చెలరేగి పోయారు. వెట్టిచాకిరీ వారి జీవన విధానంగా, బానిస బతుకు జీవన పద్ధతిగా రుద్ది ప్రజల్ని పీడించారు. ఎంతోమంది పేదల భూములు లాక్కొని, వారి చేల్లోనే వారిని కూలీలుగా మార్చారు. ఈ దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా తమ భూములను కాపాడు కోవడానికి, దుర్మార్గ మైన పన్ను వసూళ్లను ఎదిరించ డానికి కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సంఘాలు పెట్టి సమావేశాలు నిర్వహించారు. పోరాటాలకు సన్నద్ధమవుతున్న తరుణంలోనే ఇది సహించని రజాకార్లు తమ హింసాకాండలను మరింత పెంచారు. ఆడవాళ్లపై అఘాయిత్యాలకు ఒడిగట్టారు. ప్రజలపై విపరీతమైన దాడులు చేశారు.నీళ్లలేని బావిలోకి జనాన్ని తోసేసి, సామూహిక సజీవ దహనాలకు తెగబడ్డారు. కొందరు గ్రామస్తులను వరుసగా నిలబెట్టి కాల్చి చంపారు. ఈ దశలోనే కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో గుతుపలు చేతపట్టి పోరాటం చేశారు. తర్వాత యువకులు, మహిళలు దళాలుగా ఏర్పడి గ్రామాలకు రక్షణ కవచలుగా నిలిచారు.

నాడు నల్లగొండ జిల్లాలో భాగమైన జనగామ తాలూకా నేటి ఉమ్మడి వరంగల్ జిల్లా దేవరుప్పుల మండలం కడివెండి గ్రామంలో సాధారణ కుటుంబంలో జన్మించాడు దొడ్డి కొమురయ్య. అప్పటికే నిజాం నిరంకుశత్వంపై ప్రజలు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. 60గ్రామాలకు దేశ్‌ముఖ్‌గా ఉన్న విసునూరు రామచంద్రారెడ్డి దీన్ని జీర్ణించుకోలేకపోయాడు.తన అంతు చూసేందుకే సంఘాలను పెట్టారని కోపంతో రగిలిపోయాడు. ఎలాగైనా వాటిని అణచాలను కున్నాడు.ఈ క్రమంలోనే కడవెండి గ్రామంలో ఆంధ్రమహాసభ ఏర్పాటైంది. ఈ మహాసభ ప్రారంభమైన అనంతరం మహాసభకు ఒక కార్యాలయం అవసరం ఉన్న దృష్ట్యా అందులోని సభ్యుడే కడవెండి గ్రామవ్యాపారి మశెట్టి రామచంద్రయ్య తన ఇల్లును కార్యాలయానికి ఇచ్చాడు. ఇక్కడే ప్రతిరోజు ఆంధ్రమహాసభ నాయకులు సమా వేశమవుతూ కార్యాచరణ రూపొందించుకునేవారు. అమరుడు దొడ్డి కొమురయ్య మరణానికి ముందు గ్రామంలోని ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఈ కార్యాలయం వద్దనే వున్నారు. ఈ కార్యాలయంలో సభలు సమావేశాలే కాకుండా శత్రుదాడులను ఎదుర్కొనేందుకు వీలుగా కర్రలు, రాళ్లు, కారంపొడి సంచులను ఎప్పుడూ సిద్ధంగా వుంచుకొనేవారు.



> అప్పటికే గొర్రెలను కాసి వచ్చి అన్నం గిన్నెను పట్టుకున్న కొమురయ్య ఊరేగింపును చూసి గిన్నె పక్కకు పడేసి మూలకున్న గుతప కర్రను తీసుకొని ఊరేగింపు ముందు భాగాన నిలబడ్డాడు. వెనుకున్న వారికి ధైర్యంగా ఉన్నాడు. 'కమ్యూనిస్టు పార్టీకి జై', 'విసునూరి దేశ్‌ముఖ్ దౌర్జన్యం నశించాలి' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు కదిలాడు. కార్యకర్తలు ధైర్య సాహసాలతో రజాకార్లను ఎదుర్కొవడానికి బొడ్రాయి వరకు చేరుకున్నారు. అప్పటికే అక్కడి పాఠశాలలో మాటువేసిన రజాకార్లు ఎలాంటి హెచ్చరికలు చేయకుండా కార్యకర్తలపై కాల్పులు జరిపారు. దీంతో ఊరేగింపు ప్రదర్శనలో ముందు వరుసలో ఉన్న కొమురయ్యకు తూటాలు సరాసరిగా కడుపులోకి దిగాయి. అయినా ఆయన పోరాట పటిమ వీడలేదు. శరీరంలోకి తూటాలు దూసుకెళ్లినా 'ఆంధ్ర మహాసభకు జై' అంటూ ప్రాణాలొదిలాడు.

ఓవైపు భూస్వాముల ఆగడాలపై అప్పుడప్పుడే పోరాటాలు ఉధృతమయ్యాయి. కడవెండి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు కావట్టి మల్లయ్య ఇస్తారు విష్ణు వ్యాపారి గుమ్మడవెల్లి వెంకయ్యకు అప్పు వుండగా విసునురు దేశముఖ్‌ల అనుచరుడుగా వున్న వెంకయ్య వీరి ఎకరం పొలంను, ఇల్లును స్వాధీనం చేసుకున్నారు. దీన్ని సహించని సంఘం కార్యకర్తలు తిరిగి వ్వాలని వ్యాపారిని అడిగారు. దేశ్‌ముఖ్‌ల అండ చూసుకున్న వ్యాపారి ఎంతకూ ఒప్పుకోలేదు. సంఘం కార్యకర్తలు ఇల్లు, పొలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఊరేగింపు తీశారు. దేశ్‌ముఖ్ ఆగడాలపై నినదించారు. ఈ సందర్భంగా భూస్వాముల భార్యలు సంఘం కార్యకర్తల్ని దుర్భాషలాడారు. మాటలు పెరగ డంతో దీన్ని జీర్ణించుకోలేని దేశముఖ్ అనుచరులు విసునూరు పోలీస్‌స్టేషన్‌లో కార్యకర్తలపై కేసు పెట్టించారు. ఈ కేసును సాకుగా తీసుకుని రజాకార్లు వారిపై దాడులు చేయటానికి సిద్ధ మయ్యారు. సంఘం కార్యకర్తలు కూడా ఈ దాడులను మూకు మ్మడిగా ఎదుర్కోవడానికి రహస్య ప్రదేశాల్లో కాపుకాశారు.

1946 జులై 4 ఆ రోజు సాయుధ పోరాట చరిత్రలో ఒక మైలురాయి వంటి సంఘటన. సంఘం కార్యకర్తలు పోరాట కార్యక్రమాల్లో భాగంగా సమావేశల్లో ఉండగా విసునూరు ఎస్ఐ ఫక్రుద్దీన్‌తో పదిమంది జనాన్లు తుపాకులు ధరించి కడవెండికి చేరుకున్నారు. వీరితో పాటు 40 మంది రజాకార్ల గుండాలు దేశముఖ్ మాయగండ నర్సింహారెడ్డి నాయకత్వంలో మహాసభ నాయకుడు ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డిని చంపాలని పథకం వేశారు. పోలీసులు, గుండాలు కలిసి సంఘం కార్యకర్తల ఇండ్లపై దాడులు చేయడం, రాళ్లు రువ్వడం వంటివి చేశారు. సమాచార మందుకున్న కార్యకర్తలు మోహన్ రెడ్డి నాయకత్వంలో ఊరేగింపు చేసుకుంటూ జంపాల లింగయ్య ఇంటి వైపు కర్రలు పట్టుకొని ప్రతిఘటనకు ముందుకు సాగారు. అప్పటికే గొర్రెలను కాసి వచ్చి అన్నం గిన్నెను పట్టుకున్న కొమురయ్య ఊరేగింపును చూసి గిన్నె పక్కకు పడేసి మూలకున్న గుతప కర్రను తీసుకొని ఊరేగింపు ముందు భాగాన నిలబడ్డాడు. వెనుకున్న వారికి ధైర్యంగా ఉన్నాడు. 'కమ్యూనిస్టు పార్టీకి జై', 'విసునూరి దేశ్‌ముఖ్ దౌర్జన్యం నశించాలి' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు కదిలాడు. కార్యకర్తలు ధైర్య సాహసాలతో రజాకార్లను ఎదుర్కొవడానికి బొడ్రాయి వరకు చేరుకున్నారు. అప్పటికే అక్కడి పాఠశాలలో మాటువేసిన రజాకార్లు ఎలాంటి హెచ్చరికలు చేయకుండా కార్యకర్తలపై కాల్పులు జరిపారు. దీంతో ఊరేగింపు ప్రదర్శనలో ముందు వరుసలో ఉన్న కొమురయ్యకు తూటాలు సరాసరిగా కడుపులోకి దిగాయి. అయినా ఆయన పోరాట పటిమ వీడలేదు. శరీరంలోకి తూటాలు దూసుకెళ్లినా 'ఆంధ్ర మహాసభకు జై' అంటూ ప్రాణాలొదిలాడు. ఆయనతో పాటు పక్కనే ఉన్న పక్కనే వున్న రేషపల్లి కొండయ్య, దేషపల్లి సోమ నర్సయ్యకు తుపాకీ తూటాలు తగిలి గాయాలయ్యాయి. కొమురయ్య మరణంతో అట్టుడికిన ఆంధ్ర మహాసభ కార్యకర్తలు నిజాం గుండాలపై దాడి చేయడంతో వారు అక్కడినుంచి పరారయ్యారు. ఆ తర్వాత జరిగిన భూ పోరాటాల్లో భూస్వాములను ఎక్కడికక్కడే ఎదిరించారు.

"బాంఛన్ దొరా..నీ కాల్మొక్తా' అన్న ప్రజలే బంధూకులు చేతపట్టి భూస్వాములపై తిరబడ్డారంటే దానికి స్ఫూర్తి దొడ్డి కొమురయ్య. ఆయన వీర మరణంతో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం 1946-1952 వరకు వీరోచితంగా సాగింది. భూస్వాములు లాక్కున్న భూముల్ని పేదలకు పంచింది.నిజాంను గడగడ లాడించి భారత సైన్యానికి లొంగిపోయేలా చేసింది.

(నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి)

ఎన్నో ఆటు పోట్లను తట్టుకుని నిలబడ్డాం

- మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రెండున్నర దశాబ్దాల బీఆర్ఎస్ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడ్డాం. ప్రతి అడుగులో అద్భుతమైన విజయాలే తప్ప అపజయాలు లేవు. తెలంగాణ సాధన కోసం బయలుదేరిన నాటి వ్యతిరేక పరిస్థితులనే తట్టుకుని నిలబడ్డ పార్టీకి నేటి పరిస్థితులు లెక్కే కాదు" అని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. బుధవారం ఎర్రవల్లి నివాసంలో తనను కలిసేందుకు మహబూబాబాద్, మేడ్చల్, నల్గొండ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు నాయకులతో కేసీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ అస్థిత్వమే ప్రమాదంలో పడిన దిక్కుమొక్కు లేని చివరిదశ ఉద్యమకాలం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన, అటు నుంచి పదేండ్ల ప్రగతి పాలన దాకా తాను ఎదుర్కొన్న కష్టాలను కేసీఆర్ ఈ సందర్భంగా కార్యకర్తలకు వివరించారు. ఆనాడు తెలంగాణను అష్టదిగ్బంధనం చేసిన సమైక్యవాద శక్తులు, వారి మీడియాతో సహా సమస్త రంగాలు.. వాళ్ల రాసిందే రాత గీసిందే గీతగా నడిచేదని గుర్తుచేశారు. అత్యంత శక్తివంతమైన ఆంధ్రా వ్యవస్థలను తట్టుకుంటూ, తెలంగాణ వ్యతిరేకతకు, సమైక్యవాదానికి సింబాలిక్‌గా ఉన్న నాటి పాలకుడు చంద్రబాబు నాయుడును ఎదిరించి నిలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. అలాంటి సమైక్యవాద కుటిల వ్యవస్థలనే బద్దలుకొట్టి తెలంగాణను సాధించి.. కలబడి నిలబడిన తెలంగాణ సమాజం, భవిష్యత్తులో ఎలాంటి ప్రతిబంధక పరిస్థితులనైనా అధిగమిస్తుందని భరోసా వ్యక్తం చేశారు. గెలుపోటములకు అతీతంగా తెలంగాణ సమాజం మనకు ఎల్లవేళలా అండగా ఉందని కేసీఆర్ వారికి భరోసా ఇచ్చారు.

ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం

- ప్రత్యేక అధికారులను నియమించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బుధవారంతో జెడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసింది. గురువారం జిల్లా, మండల ప్రజాపరిషత్ పాలకమండళ్లలో స్పెషలాధికారులుగా ఎంపీడీఓ పై ర్యాంకు అధికారులను నియమించాలని సూచిస్తూ కలెక్టర్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీచేసింది. జడ్పీలకు కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు)ను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు. దీనికి సంబంధించి గురువారం ఉత్తర్వులు వెలువడనున్నాయి. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా గతంలో ఆలస్యంగా ఎన్నికలు జరిగిన ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని ఎంపీపీలు, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఒక్కో ఎంపీపీ, మహబూబాబాద్ జిల్లాలో రెండు ఎంపీపీలు, ములుగు జిల్లాల పరిధిలోని మూడు ఎంపీపీలు (వాటి పదవీ కాలం ముగియకపోవడంతో) మినహా రాష్ట్రంలోని మిగతా అన్ని చోట్ల ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించింది. పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యా, వైద్యం, మహిళా శిశుసంక్షేమం, వెటర్నరీ, వ్యవసాయ, పరిశ్రమలు, జిల్లా ప్రణాళిక, తదితర శాఖలకు చెందిన అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. మండల పరిషత్‌లకు ఎన్నికలు జరిగి ఎంపీటీసీలుగా సభ్యులు ఎన్నికై, ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకునే దాకా మండలాల్లో ప్రత్యేక అధికారులు కొనసాగనున్నట్టు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతన పంచాయతీరాజ్‌చట్టం, 2018కు అనుగుణంగా ...మండలాలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి సంబంధించి జిల్లా కలెక్టర్లకు అధికారాన్ని కల్పిస్తూ ఆదేశాలిచ్చారు. ఇందుకు అనుగుణంగా ఎంపీడీవోలకు ఒక ర్యాంక్ పైన ఉన్న జిల్లాస్థాయి అధికారులు, డిప్యూటీ డైరెక్టర్లు, ఆర్డీవోలు, ఇతర జిల్లా అధికారుల (ఇంజినీర్లు మినహా)ను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

రైతు ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు జరపాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామ రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. అందుకు కారకులైన దోషులను శిక్షించాలనీ, ఆ రైతు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఉత్తర తెలంగాణలో హెచ్‌సీయూ ఆఫ్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలి

- కేంద్ర విద్యామంత్రికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ లేదా వరంగల్‌లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ఆఫ్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆయన బుధవారం లేఖ రాశారు. సీయూఈటీ, యూజీసీ-నెట్, జేఆర్ఎఫ్ పరీక్షలను మాతృభాష (తెలుగు)లో నిర్వహించాలని కోరారు.

9 లక్షల మంది రైతులకు రూ.10,547 కోట్ల చెల్లింపులు

- ముగిసిన రబీ ధాన్యం కొనుగోళ్లు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. కేవలం మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసినట్టు ప్రభుత్వం తెలిపింది.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన 8,99,546 మంది రైతుల ఖాతాల్లో రూ.10,547 కోట్లు జమ చేసింది. ధాన్యం అమ్మిన రైతులు డబ్బుల కోసం ఎదురుచూసే పరిస్థితులు కల్పించొద్దని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి చెప్పడంతో యుద్ధ ప్రాతిపదికన రైతుల ఖాతాల్లో నగదు బదిలీ చేసినట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ సారి మార్చి 25 నుంచే వరుసగా 7,178 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. జూన్ 30వ తేదీ నాటికి రబీ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసిందనీ, రాష్ట్రమంతటా 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించారు. ఈ ఏడాది 75.40 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోళ్లు జరుగుతాయని అంచనా వేశామనీ, కానీ మార్కెట్లో మద్దతు ధర కంటే ఎక్కువ రేటు రావటం, ప్రయివేటు వ్యాపారులు పోటీపడి మంచి ధరకు కొనుగోలు చేయటంతో కేంద్రాలకు వచ్చిన ధాన్యం అంచనా తగ్గిందని అధికారులు చెప్పారు. ఈదురు గాలులు, అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. గతంలో ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యం తిరిగి ఇవ్వకుండా బకాయి పడిన మిల్లర్లకు ఈసారి ధాన్యం కేటాయించలేదని స్పష్టం చేశారు. గతంలో 1,532 మంది మిల్లర్లు ధాన్యం ఇవ్వకుండా ఎగవేసిన జాబితాలో ఉన్నారనీ, వీరిలో ఇప్పటివరకు 116 మందిపై సివిల్ సప్లయిస్ విభాగం రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించిందని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ నుంచి 2024 మే నెలాఖరు వరకు 28 వేల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ తిరిగి స్వాధీనం చేసుకుంది.

'భగీరథ'పై ప్రకటనలు బోగస్‌వేనా?

- ఇంటింటి సర్వే నివేదికలు ఎమ్మెల్యేలకివ్వండి
- స్థానికంగానే తాగునీటి వనరులు ఏర్పాటు చేయండి
- మిషన్ భగీరథ కార్మికుల వేతనాల పై సమగ్ర నివేదికివ్వండి :డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలో నీటి ఎద్దడి లేదని సర్పంచుల సంతకాలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ప్రకటించింది. కేంద్రానికీ నివేదిక పంపింది. ఇప్పుడేమో చాలా గ్రామాల్లో నీటి కొరత ఉందని అధికారులు ఫైళ్లు పంపుతున్నారు. ఆనాటి ప్రభుత్వ ప్రకటన బోగస్ అని భావించాలా' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆలేరు, భువనగిరి, నల్లగొండ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందట్లేదనీ, నిధులు కావాలని అధికారుల నుంచి ఫైళ్లు తీసుకురావడమేంటని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా జరుగుతున్న తాగునీటి సరఫరాపై జరుగుతున్న సర్వే ఎప్పుడు పూర్తవుతుందని అడిగారు. సర్వే పూర్తికాగానే రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ నివేదికలు అందజేయాలని ఆదేశించారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి కాకుండా సమీపం నుంచే ప్రధాన వనరులను తీసుకోవాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకుంటే తరుచూ పైప్‌లైన్‌లు పగిలిపోయి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద పనిచేస్తున్న సిబ్బంది జీవితాలు నెలల తరబడి ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? ఒక్కో చోట ఒక్కోలా ఎందుకిస్తున్నారు? రూ.8 వేల నుంచి రూ.13 వేలు ఇవ్వడమేంటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలి తప్ప మధ్యలో ఉన్న భక్షులకు కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు, ఏజెన్సీలు కార్మికులకు ఇస్తున్న వేతనాల వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలనీ, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకంగా వేతనాలుండేలా ఫిక్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం కోసం చేసిన వేల కోట్ల రూపాయల అప్పుకు వడ్డీలు చెల్లిస్తున్నా పూర్తిస్థాయిలో ప్రయోజనం నెరవేరట్లేదన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా ఆయా మున్సిపాలిటీలు మిషన్ భగీరథ కింద మంచినీటి సరఫరా చేస్తున్నట్టు రికార్డుల్లో ఎందుకు చూపిస్తున్నారని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. సమీక్షలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ కార్పొరేషన్ కమిషనర్ స్మితా సబర్వాల్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త అప్పులకు రుణమాఫీ వర్తించదు

- అప్పుల కోసం రైతులపై ఒత్తిడి తేవొద్దు : బ్యాంకర్లకు సారంపల్లి విజ్ఞప్తి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అప్పులు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలనీ, బుక్ అడ్జెస్ట్‌మెంట్లు చేసుకోవాలనీ బ్యాంకర్లు రైతులపై ఒత్తిడి తేవొద్దని తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ అవుతున్న సమయంలో బ్యాంకర్లు రైతులకు అన్యాయం చేసేలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పేద రైతులను భయపెట్టి అప్పులు చెల్లించేలా ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 15లోపు ఏ ఒక్క రైతు కూడా అప్పులు చెల్లించకూడదని పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. 11.12.2018 నుంచి 9.12.2023 మధ్య తీసుకున్న అప్పులకే రుణమాఫీ అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తద్వారా రుణమాఫీ కోసం రూ 31వేల కోట్లు అవుతుందనీ, 47 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

ఈ సమయంలో అప్పులు చెల్లించడంద్వారా అవి కొత్త అప్పుగా మారుతాయని తెలిపారు. అప్పుడు అర్హులైన రైతులు అనర్హులుగా మారిపోతారని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా కొన్ని బ్యాంకులు ఈ విధంగా చేయడం వల్ల రుణమాఫీకి అర్హత కోల్పోయారని తెలిపారు. మరోసారి బ్యాంకర్లు రైతులను మోసం చేసేందుకు అప్పులను రెన్యూవల్ చేసుకోవాలని కోరడం సరైందికాదని సూచించారు. ధనిక రైతుల జోలికి పోకుండా సన్న, చిన్నకారు రైతులను లక్ష్యంగా బ్యాంకర్లు వ్యవహరించడమేంటని ప్రశ్నించారు.

నిరుద్యోగుల సమస్యలపై సీఎం స్పందించాలి

- డీఎస్సీ రాతపరీక్షలను వాయిదా వేయాలి
- జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలి
- లేదంటే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తాం :వామపక్ష యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన స్పందించి, వాటిని పరిష్కరించాలని వామపక్ష యువజన, విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించింది. బుధవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ (డీవైఎఫ్ఐ), కె ధర్మేంద్ర (ఏఐవైఎఫ్), కెఎస్ ప్రదీప్ (పీవైఎల్), మమత (ఎస్ఎఫ్ఐ), గ్యార నరేష్ (ఏఐఎస్ఎఫ్), పి రామకృష్ణ, నామాల ఆజాద్, పి మహేష్ (పీడీఎస్‌యూ) మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇబ్బందులు రాకుండా, ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులు అన్ని రకాలుగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను అనుసరిస్తే అదే పరిస్థితి నేడు కాంగ్రెస్‌కు కూడా వస్తుందని వారు హెచ్చరించారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడాలనీ, వారి సమస్యలపై సీఎం ప్రత్యేకంగా హామీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే డీఎస్సీ రాతపరీక్షలను కనీసం 45 రోజులు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. టెట్ ఫలితాలను నార్మలైజేషన్ ద్వారా ప్రకటించాలని కోరారు. తక్షణమే నిర్దిష్టమైన జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గురుకుల అభ్యర్థులకు సత్వరమే న్యాయం చేయాలని చెప్పారు. గ్రూప్-1 మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి 1:50పై ప్రభుత్వం పునలోచించాలని కోరారు. గ్రూప్స్ పోటీ పరీక్షల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తూ నిరుద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. ఖాళీ పోస్టులపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలనీ, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ నాగేశ్వరరావు, శ్రీనివాస్ (పీడీఎస్‌యూ), రమేష్ (ఎస్ఎఫ్ఐ), అనిల్, వంశీ (ఏఐవైఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

వయస్సుతో నిమిత్తం లేకుండా అంగన్‌వాడీలకు పదోన్నతులివ్వాలి



- మంత్రి సీతక్కకు టీఎన్జీవో, టీజీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంగన్‌వాడీ ఉద్యోగులకు వయస్సుతో నిమిత్తం లేకుండా పదోన్నతులను కల్పించాలని టీఎన్జీవో, టీజీవో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను బుధవారం హైదరాబాద్‌లో ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు 45 ఏండ్ల వయస్సు నిబంధనను తొలగించాలనీ, వయస్సుతో నిమిత్తం లేకుండా పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, నాయకులు పర్వతాలు, హరికృష్ణ, కిషన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విభజన సమస్యల పరిష్కారానికి నాంది కావాలి

- తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశాన్ని స్వాగతించిన సీపీఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో శనివారం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్వాగతించారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సత్వర పరిష్కారానికి ఈ సమావేశం నాంది కావాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రాచలంలో ఐదు గ్రామాలను తెలంగాణకు తిరిగి ఇచ్చే విషయంలో సానుకూలతకు రావడం ద్వారా ఉభయ రాష్ట్రాల సీఎంల సమావేశం మంచి సంకేతాలు పంపాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తయినా, ఇంకా సమస్యలు కొనసాగడం బాధాకరమని తెలిపారు. ఇందుకు కేంద్ర, గత రాష్ట్ర ప్రభుత్వాల వైఖరే కారణమని విమర్శించారు. చర్చల ద్వారా తప్ప వివాదాల ద్వారా సమస్యలకు త్వరిత పరిష్కారం లభించబోదని పేర్కొన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కారానికి వచ్చేలా ముఖ్యమంత్రుల సమావేశంలో ఏకాభిప్రాయానికి రావాలని సూచించారు.

రేవంత్‌రెడ్డికి పుస్తకాన్ని అందించిన చాడ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 'అసెంబ్లీ సాక్షిగా నా ప్రసంగాలు' అనే పుస్తకాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ సచివాలయంలో కలిసి అందజేశారు.

'రామగుండం' జెన్‌కోకే ఇవ్వాలి

- విద్యుత్‌శాఖ మంత్రి భట్టికి టీజీపీఈజేఏసీ విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రామగుండంలో టీజీఎస్ జెన్‌కో ద్వారానే 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్కేంద్రాన్ని నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు రూ.3.352 కోట్ల ఉద్యోగుల పెన్షన్ ఫండ్ బకాయిలను తెలంగాణకు చెల్లించాల్సి ఉందనీ, వాటిని ఇప్పించాలని కూడా కోరారు. ప్రస్తుతం రామగుండంలో కాలం చెల్లిన పాత జెన్‌కో విద్యుత్ కేంద్రాన్ని మూసివేసి, అక్కడి 540 ఎకరాల స్థలాన్ని సింగరేణికి ఇస్తారని ప్రచారం జరుగుతున్నదనీ, అలాంటి చర్యల్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించాలి

- డీఎస్సీ రాతపరీక్షలను వాయిదా వేయాలి :డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించి పూర్తి వివరాలను ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ద్వారా ఏర్పడిన ఖాళీలను జిల్లాల వారీగా వెల్లడించాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ పోస్టులను ప్రస్తుత డీఎస్సీలో కలపాలని కోరారు.

అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. డీఎస్సీ రాతపరీక్షలను నెలరోజులపాటు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో రాతపరీక్షలను నిర్వహించాలని కోరారు.

విలీన మండలాల సాధన కోసం దీక్ష చేయండి

(మొదటిపేజీ తరువాయి)

మేరకే మండలాల విలీనం జరిగిందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్‌తోపాటు పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు.ఏడు మండలాలు పోవడానికి కారణం బీఆర్ఎస్, బీజేపీనే అన్నారు. తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. విభజన చట్టంలో ఏడు మండలాల ప్రస్తావన లేదని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆర్డినెన్సుతో ఏడు మండలాలను ఏపీలో కలిపారని చెప్పుకొచ్చారు. వాటి కోసం పోరాటం చేస్తానంటూ అసెంబ్లీలో చెప్పిన కేసీఆర్ ఏమయ్యారని ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణపై పూర్తిగా అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. టీపీసీసీ నూతన చీఫ్ విషయంలో కసరత్తు కొనసాగుతున్నదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని వెల్లడించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందనీ, ఆ తర్వాత పదిహేనేండ్లు తామే అధికారంలో ఉంటామంటూ కేసీఆర్ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. చింతకాని మండలంలో రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆత్మహత్య వెనుక ఎవరున్నారనే దిశగా దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. ఆత్మహత్య వెనుక ఎవరున్నా విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. హరీశ్‌రావు కల్లిబొల్లి మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తప్పిదాలు ఆయన్ని వెంటాడుతున్నాయని వివరించారు. రైతు భరోసాపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామన్నారు. ఆ నివేదికపై అసెంబ్లీలో చర్చించి, అందుకనుగుణంగా నియమ, నిబంధనలు రూపొందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కౌలు రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఐదేండ్ల కాలంలో రైతు రుణమాఫీపై ఆలస్యం చేయడంతో అన్నదాతలు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రైతులకు అటువంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయి ప్రజల కోసం ఖర్చు చేస్తామని నొక్కి చెప్పారు. ప్రజల సొమ్ముకు ప్రభుత్వం కస్టోడియం మాత్రమేననీ, ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ ప్రభుత్వం చాలా జాగ్రత్తగా ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేస్తున్నదని గుర్తు చేశారు. పంచాయతీలకు నిధులివ్వకుండా బీఆర్ఎస్ ఆలస్యం చేయడంతోనే గ్రామాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి చెందిన శ్రీనివాసరాజు ఇరిగేషన్ నిపుణుడనీ, ఆయన సేవలు ఉపయోగించుకునేందుకు పార్ట్ టైమర్‌గా నియమించామని తెలిపారు.

6న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ

రాష్ట్ర విభజన సమస్యలపై చర్చించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఈ నెల 6న భేటీ కానున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.గురుశిష్యులు భేటీ కాబోతున్నారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి గురుశిష్యులు కాదనీ, సహచరులని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని రేవంత్ చాలా సార్లు చెప్పారని గుర్తు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అని తేల్చిచెప్పారు. వారిద్దరు గురుశిష్యులు అనే వారివి అవగాహనలేని మాటలని కొట్టిపారేశారు. పదేండ్ల పెండింగ్ సమస్యలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- హైదరాబాద్ డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి
- తల్లిదండ్రులు పిల్లల నడవడికను గమనించాలి : పట్నం సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి.నర్సింహారావు



నవతెలంగాణ- అంబర్‌పేట్

మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని హైదరాబాద్ డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి అన్నారు. డ్రగ్స్ వాడకం-దుష్పరిణామలపై బుధవారం సీపీఐ(ఎం), ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ కాచిగూడ జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఈఓ మాట్లాడుతూ.. డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అత్యంత భయంకర వ్యసనమన్నారు. దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందని చెప్పారు. డ్రగ్స్ మాఫియా యువతను టార్గెట్ చేసుకుని చాపకింద నీరులా తమ వ్యాపారాన్ని విస్తరిస్తోందని తెలిపారు. ఎలాంటి అనుమానాలు వచ్చినా విద్యార్థులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పట్నం సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను, అలవాట్లను ఎప్పటికప్పుడూ గమనించాలని, చెడు వైపు అడుగులు వేయకుండా చూడాలని అన్నారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాల, కళాశాల ఆవరణలో ఎటువంటి అనుమానపు పదార్థాలు కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్‌హెచ్ఓ డాక్టర్ హేమలత, కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, హైస్కూల్ హెచ్ఎం కె.విజయలక్ష్మి హిమాయత్‌నగర్ మండలల ఐఓఎస్ అధికారి సుమన్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. మారన్న, కోశాధికారి డి.మహారాజు, ప్రజానాట్య మండలి నగర నాయకులు రఘు, రాము, సునీత, జంగయ్య, జనార్ధన్, మల్లేష్, వీరయ్య, ఆహ్వాన సంఘం సభ్యులు జెకె శ్రీనివాస్, డాక్టర్ వసంత, టీచర్లు ప్రమీల, స్వర్ణలత, వీరయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాసంచాలకులుగా నర్సింహారెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖ సంచాలకులుగా ఈవి నర్సింహారెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్, ఇతర నాయకులు ఆయన్ను కలిసి స్వాగతం పలికారు. తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ కలిసి బదిలీ పొందిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలనీ, హేతుబద్ధీకరణ నిబంధనలను అమలు చేయాలనీ, మిగిలిన పోస్టులకు పదోన్నతులు కల్పించాలనీ, పరస్పర బదిలీలకు అవకాశమివ్వాలని కోరారు. పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి బదిలీ అయిన ఎస్జీటీలను పాఠశాలకు ఇబ్బంది లేకుండా రిలీవ్ చేయాలని సూచించారు.

శ్రీదేవసేన బాధ్యతల స్వీకరణ

కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా శ్రీదేవసేన బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, పలువురు అధ్యాపకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

భవిష్యత్ తరాల మనుగడకు.. మొక్కలు నాటాలి...!

పచ్చదనం-పర్యావరణం తోనే ప్రజా జీవితం ముడిపడి ఉంది : మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ

- సింగరేణి వచ్చాకే సత్తుపల్లి పర్యావరణం దెబ్బతింది : సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- సత్తుపల్లిలో వన మహోత్సవాన్ని ప్రారంభించిన మంత్రులు



నవతెలంగాణ-సత్తుపల్లి

భవిష్యత్ తరాలు మనుగడ సాగించాలంటే పర్యావరణం బాగుండాలని, పర్యావరణం బాగుండాలంటే పచ్చదనం రావాలని, పచ్చదనం రావాలంటే మొక్కలు విరివిగా నాటాలని పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగిన వన మహోత్సవ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి మంత్రి సురేఖ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల జీవన మనుగడ ఆనందంగా, ఆరోగ్యంగా సాగడానికి మనం ఇప్పటి నుంచే మొక్కలను నాటి వాటిని వృక్షాలుగా చేయడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మొక్కలు నాటడం, పెంచడమనేది కేవలం ప్రభుత్వానిదే బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంలా భావించి మొక్కలను నాటాలని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పచ్చదనం, పర్యావరణంతోనే ప్రజా జీవితం ముడిపడి ఉందని అన్నారు. పర్యావరణం దెబ్బతింటుందంటే మన ఆరోగ్యాలకు ముప్పు ఏర్పడనున్నదని భావించాల్సి ఉందన్నారు. చెట్లు పెంచడం వల్ల ఒనగూరే ఆరోగ్య లాభాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఒక్కో వ్యక్తి 5 నుంచి 10 మొక్కలు పెంచడం ద్వారా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

అనంతరం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. సత్తుపల్లికి సింగరేణి వచ్చాకే పర్యావరణం పూర్తిగా దెబ్బతిందని అన్నారు. దెబ్బతిన్న పర్యావరణాన్ని తిరిగి పొందడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. తాత్కాలిక ప్రయోజనాలతో గ్లోబల్ వార్మింగ్‌ని కొందరు పెంచి పోషిస్తున్నారని, దాని కారణంగా వర్షాలు సమృద్ధిగా పడని దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలి, మంచి ఆరోగ్యం పొందాలంటే మొక్కలు నాటడం తప్ప మరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు లేవన్నారు. కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, సైన్స్ టెక్నాలజీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీం, ఖమ్మం సీపీ సునీల్‌దత్, చీఫ్ కన్జర్వేటర్ డి.బీమా నాయక్, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రం సింగ్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సన్యాసయ్య, సీఈవో ఎస్.వినోద్, డీపీవో హరికిషన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఆర్డీవో రాజేందర్, మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, ప్రకృతి కవి జయరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు.

ఉసురు తీస్తున్న పోటీ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

2020లో నమోదైన 12,526 కేసులతో పోలిస్తే ఇది 4.5 శాతం ఎక్కువ. పరీక్షల్లో ఫెయిలైన కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది.

ఆందోళనకరంగా విద్యార్థుల ఆత్మహత్యల రేటు

విద్యార్థుల్లో ఆత్మహత్యల రేటు ఆందోళన కలిగించే స్థాయికి చేరింది. ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 2022లో 13 వేల మందికి పైగా విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆ సంవత్సరం నమోదైన మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థులవే 7.6శాతం ఉండడం గమనార్హం. సెకండరీ స్థాయి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులే (మొత్తం ఆత్మహత్యల్లో 23.9శాతం) ఎక్కువగా ప్రాణాలు తీసుకుంటున్నారని ఈ నివేదిక తెలిపింది. తెలంగాణలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడిన వెంటనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. 2019లో కూడా ఇంటర్ ఫలితాలు ప్రకటించిన తర్వాత 22 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అందించిన సమాచారం ప్రకారం 2014-21 మధ్యకాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్ర యూనివర్సిటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన 122 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముఖ్యంగా కోటాలో చదువుతున్న విద్యార్థుల్లో ఆత్మహత్యలు పెరగడం ప్రభుత్వాన్ని, విద్యార్థులను, తల్లిదండ్రులను కలవరపెడుతోంది.

మానసిక వైద్యుల కొరత

విద్యార్థులు నిరాశానిస్పృహలకు లోనుకాకుండా చూసేందుకు తగు చర్యలు తప్పనిసరి అని గుర్తించాలి. విద్యార్థులు తరగతి గదిలో ర్యాంకుల వారీగా కాకుండా అక్షర క్రమంలో కూర్చునేలా చేయడం వీటిలో ముఖ్యమైనది. దీనివల్ల యువతలో అనారోగ్యకరమైన పోటీ, ఒత్తిడి తగ్గుతాయి. విద్యార్థుల్లో తలెత్తుతున్న మానసిక ఆరోగ్య సంక్షోభం కూడా ఆందోళన కలిగించే అంశమే. దీనిని ఎదుర్కోవడం సవాలుగా మారుతోంది. మానసిక అనారోగ్యానికి చికిత్స చేసే సైక్రియాట్రిస్టులు, సైకాలజిస్టులు, సామాజిక కార్యకర్తల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ప్రతి లక్ష మంది జనాభాకు 0.3 మంది సైక్రియాట్రిస్టులు, 0.07 మంది సైకాలజిస్టులు, 0.07 మంది సామాజిక కార్యకర్తలు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి లక్ష మందికి 6.6 మంది సైక్రియాట్రిస్టులు సేవలు అందిస్తున్నారు.

ఏం చేయాలంటే...

విద్యార్థుల ప్రవర్తనలో వస్తున్న మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం గమనిస్తూ వారితో చర్చించి సమస్యలు తెలుసుకుంటే ఆత్మహత్యలను చాలా వరకూ నివారించవచ్చు. పిల్లలు కేవలం విద్యకే పరిమితం కాకుండా పాటలు పాడడం, నృత్యం చేయడం, పెయింటింగ్స్ వేయడం, రాయడం, చదవడం, వంట చేయడం వంటి ఇతర పనులు కూడా నేర్చుకునేలా ప్రోత్సహించాల్సి ఉంది. దీనివల్ల వారిలో ఒత్తిడిని తగ్గించవచ్చు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఓ యంత్రాంగాన్ని రూపొందించాలి. ముఖ్యంగా తాము ఒంటరివారం కామని, బంధువులు, స్నేహితులు ఎల్లవేళలా తమకు అండగా ఉంటారని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావని విద్యార్థులకు అర్థంగావించాలి.



213 మంది ఖైదీలు విడుదల

- చర్లపల్లి సెంట్రల్ జైలులో కౌన్సెలింగ్, జాబ్‌మేళా
- ఆఫర్ లెటర్లు అందజేసిన డాక్టర్ సౌమ్యమిశ్రా

నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా జైలు జీవితం గడిపిన 213 మంది ఖైదీలను రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా విడుదల చేసింది. జైళ్ల నుంచి విడుదలైన వారికి బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లి సెంట్రల్ జైలు ప్రాంగణంలో కౌన్సెలింగ్ కార్యక్రమం, జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డాక్టర్ సౌమ్యమిశ్రా, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ వై.రాజేశ్ (హైదరాబాద్), ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ (వెల్ఫేర్) ఎన్.మురళీబాబు (హైదరాబాద్), డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్ డాక్టర్ డి.శ్రీనివాస్ (హైదరాబాద్), డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఎం.సంపత్ (వరంగల్ రేంజ్), జైళ్ల సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ (చెర్లపల్లి సెంట్రల్ జైలు), జైళ్ల సూపరింటెండెంట్ ఎన్.శివ కుమార్ గౌడ్ (హైదరాబాద్ సెంట్రల్ జైలు), జైళ్ల సూపరింటెండెంట్ శ్రీ.టి.కళాసాగర్ (ఖైదీల వ్యవసాయ కాలనీ, వరంగల్) ఇతర జైలు సిబ్బంది.. కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మిశ్రా.. 67 మంది పురుషులు, ముగ్గురు మహిళలకు జాబ్ ఆఫర్ లెటర్‌లను అందజేశారు. విడుదలైన 8 మంది మహిళలకు 'ఉషా' కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

నేతన్న పోరు యాత్ర తాత్కాలికంగా వాయిదా

- మంత్రి తుమ్మలతో చర్చలు సఫలం
- పలు డిమాండ్లను అంగీకరించిన ప్రభుత్వం : తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో చేపట్టనున్న నేతన్న పోరుయాత్రను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వంతో జరిపిన చర్చల అనంతరం మీడియాతో మాట్లాడారు. జులై 7 నుంచి 15 వరకు చేపట్టనున్న నేతన్న పోరు యాత్రకు స్పందించి సర్కార్ చర్చలకు పిలిచిందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్టు వెల్లడించారు. యారన్ సబ్సిడి నిధులను విడుదలచేయడంతో పాటు త్రిఫ్ట్ ఫండ్, నేతన్న బీమా పథకాలను అమలు చేస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. 2016 నుంచి పేరుకు పోయిన 50 శాతం విద్యుత్ రాయితీ పునరుద్ధరణ, చేనేత రంగానికి చెల్లించాల్సిన బకాయిల విడుదల, రాష్ట్ర వ్యాప్తంగా పేరుకు పోయిన వస్త్ర నిల్వలను కొనుగోలు, షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల బట్టలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు, సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాలను ఏర్పాటు చేస్తామని సర్కార్ హామీ ఇచ్చిందని తెలిపారు. బతుకమ్మ చీరల పథకం స్థానంలో జనతా వస్త్రాల పథకం, ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అంశాలను ముఖ్యమంత్రితో చర్చించి అమలు చేస్తామని తెలిపారు. మిగతా డిమాండ్ల విషయంలో త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని సర్కార్ హామీ ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పోరు యాత్రను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని వెల్లడించారు. కార్మికులు అధైర్యపడి, ఆత్మహత్యలకు పాల్పడ వద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పితే తిరిగి యధావిధిగా నేతన్న పోరు యాత్రను కొనసాగిస్తామని చెరుపల్లి హెచ్చరించారు. చర్చల్లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్ తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాషం రమేశ్, కూరపాటి రమేశ్, నాయకులు కోడం రమణ, గుర్రం నర్సింహ, అన్నలదాస్ గణేష్, గోషిక స్వామి, గంజి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్త టూరిజం పాలసీ

- పర్యాటకులను ఆకర్శించేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు
- డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రాలుగా నాగార్జున సాగర్, అనంతగిరి హిల్స్ : మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో కొత్త టూరిజం పాలసీని త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక రంగానికి ఓ పాలసీ అంటూ లేకుండా పోయిన నేపథ్యంలో కొత్తగా అధికారం చేపట్టిన తమ సర్కార్ నూతన పర్యాటక విధాన ముసాయిదాను సిద్ధం చేసిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనలకనుగుణంగా త్వరలో దీని అమలుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో రాష్ట్రంలో పర్యాటక శాఖ ఉన్నదనే విషయాన్ని మరిచిపోయిందని విమర్శించారు. ప్రభుత్వ - ప్రయివేట్ భాగస్వామ్యంలో టూరిస్ట్ ప్రాంతాలను అభివద్ధి చేయడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, చారిత్రక వారసత్వ సంపదకు నెలవుగా ఉందనీ, ఎన్నో వనరులున్నప్పటికీ అనుకున్న స్థాయిలో పర్యాటక రంగం అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వనరులు లేని సింగపూర్, దుబాయ్, ఆఫ్రికా లాంటి దేశాలు తమ ప్రధాన ఆదాయ వనరుగా పర్యాటక రంగాన్ని మలుచుకున్నాయని గుర్తు చేశారు. తెలంగాణ పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది లోకల్ టూ గ్లోబల్ టూరిస్ట్ లను ఆకర్శించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామప్ప, లక్నవరం, నాగార్జున సాగర్, అనంతగిరి హిల్స్ వంటి ముఖ్యమైన ప్రదేశాలను డెస్టినేషన్ వెడ్డింగ్ ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. నాగర్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని బుద్ద గయ తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. దాశరథి శతజయంతి ఉత్సవాలు, కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి కేంద్రం నుంచి పర్యాటక రంగానికి నిధులు తెచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎమ్‌డీ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

సమస్యలు వింటూ... అధికారులను ఆదేశిస్తూ..

- ప్రజా సమస్యల పరిష్కారానికే సీతక్క ప్రాధాన్యత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికార సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లాల పర్యటనలతో నిత్యం బిజీబిజీగా ఉండే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనుసూయ (సీతక్క) సమస్యలతో తమ దగ్గరకు వచ్చే ప్రజలకూ అంతే సమయమిస్తున్నారు. ప్రజాభవన్‌కు వచ్చే వారి చెప్పే సమస్యలను ఓపిగ్గా వింటూ సాంత్వన చేకూరుస్తున్నారు. వీలైనంత మేరకు అక్కడికక్కడే అధికారులతో మాట్లాడుతూ పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాదు.. తనను నమ్ముకుని వచ్చిన వారి సమస్యల పరిష్కారం ఎంత వరకు వచ్చిందని ఆరా తీస్తున్నారు. బాధితులు హైదరాబాద్ వరకు రాకుండా క్షేత్రస్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యే విధానాన్ని అవలంబించాలని అధికారులకు సూచిస్తున్నారు. అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పనులను నిర్మొహమాటంగా ఆమె తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బందులపాలు చేసే పనులను తన వద్దకు తీసుకురావద్దని సున్నితంగా హెచ్చరికలు చేసి పంపించేస్తున్నారు. తాను మంత్రినైనా ఎప్పటికీ ప్రజల మనిషినేననీ, వారే తన తొలి ప్రాధాన్యం అనే మాటకు కట్టుబడి ముందుకెళ్తున్నారు. తన మార్కుపాలనతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న సీతక్క తీరు అందరినీ ఆకట్టుకుంటున్నది.

ఖమ్మం రైతు ఆత్మహత్యలో మలుపులెన్నో ?

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన చింతకాని మండలం పొద్దుటూరు రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య అనేక మలుపులు తిరుగుతోంది. సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిందితులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించడంతో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. రైతు ప్రభాకర్ ఆత్మహత్య సమయంలో తీసిన వీడియో వైరల్ అవుతోంది. ఇదిలావుండగా మీడియా ఒత్తిడితో బుధవారం ఈ ఘటనకు కారణమైన ప్రభాకర్ భూమిని పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్ అనంతుల రమేశ్‌ను మృతుని పిల్లలు అడ్డుకున్నారు. ఆయన కాళ్లపై పడి ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. మరోవైపు పొక్లెయినర్‌ను సీజ్ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుని తండ్రి బోజెడ్ల వీరభద్రం ఎస్ఐ నాగుల్‌మీరాను అభ్యర్థించారు. ఘటనాస్థలిని జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమలరాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు కారణమైన భూ సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.

వీడియో తీసింది ఎవరు?

రైతు ప్రభాకర్ ఆత్మహత్యకు పాల్పడుతుండగా తీసిన వీడియో సంచలనంగా మారింది. ప్రభాకర్ ఆత్మహత్య సమయంలో అక్కడ ఆయనతో పాటు మరో ఇద్దరు ఉన్నట్టుగా తెలుస్తోంది. ప్రభాకర్ మాట్లాడుతుండగా ఒకతను రికార్డు చేస్తుండగా.. ఆ ఇద్దర్నీ మరో యువకుడు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ వీడియో పోలీసుల వద్ద ఉన్నట్టు వినికిడి. అయితే ఆ వీడియోలో ఉన్న యువకుల సెల్‌ఫోన్‌లకు పోలీసులు ఫోన్ చేస్తుంటే ఘటన జరిగిన రోజు నుంచి స్విచ్ఛాఫ్ వస్తున్నట్టుగా సమాచారం. వీడియో తీసిన ఈ ఇద్దరిలో ఒకరు ఓ ప్రజాప్రతినిధి అనుచరునిగా పోలీసులు గుర్తించారనే చర్చ సాగుతోంది.

పది మందిపై కేసు..

పొద్దుటూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని 276, 277 సర్వే నంబర్లలో పాము చెరువుకు సమీపంలో రైతు ప్రభాకర్, ఆయన కుటుంబసభ్యులకు 7.10 ఎకరాల భూమి ఉంది. ఈ వేసవిలో ప్రభాకర్ తన భూమిలో చెరువు మట్టిపోయించుకున్నాడు. చెరువు శిఖం భూమిలో మట్టిపోయించుకుని సాగు చేస్తున్నాడంటూ మత్స్య సంఘం సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీనిపై కొన్ని రోజులుగా ప్రభాకర్ కుటుంబానికి, మత్స్య సంఘానికి మధ్య వివాదం నడుస్తోంది. తాను మట్టిపోసిన పొలంలో మత్స్య సొసైటీ సభ్యులు పొక్లెయినర్‌తో భారీ గుంతలు తవ్వారనే మనస్తాపంతో ప్రభాకర్ తన పొలంలోనే పురుగుల మందు తాగుతూ వీడియో తీసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురం పోలీసులు పది మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ కేసుకు సంబంధించి ఎవర్నీ అదుపులోకి తీసుకోలేదని సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు

నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో జరగనున్న బోనాల ఉత్సవాలు, మొహర్రం పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందామని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సీసీసీలో బోనాల నిర్వహణపై బుధవారం 'సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్' కమిటీ సభ్యులతో ప్రమావేశం నిర్వహించారు. బోనాల ఉత్సవాలు, మొహర్రం పండుగల ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో శాంతియుత వాతావరణం ఉందని, అందుకు సెంట్రల్ పీస్ కమిటీ సహాయసహకారాలు ఎంతో ఉన్నాయని అన్నారు. కేంద్ర పీస్ కమిటీ సహాయ సహకారాలతో నగరంలో జరగనున్న బోనాల ఉత్సవాలు, మొహర్రం పండుగల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశానికి 50 మంది పీస్ కమిటీ సభ్యులతోపాటు పోలీస్ తదితరులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌పై క్రిమినల్ కేసు?

- అధికారికంగా వెల్లడించని పోలీసు అధికారులు
- జడ్పీ సమావేశంలో ఆయన తీరుపై సీఈఓ ఫిర్యాదు
- సీఈఓపైనా ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్ క్రైమ్

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 2న జరిగిన జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే, జడ్పీటీసీ సభ్యుల మధ్య చోటుచేసుకున్న వార్.. అటు ఎమ్మెల్యేపైనా, ఇటు సీఈఓపైనా పరస్పరం ఫిర్యాదు చేసుకునే వరకూ వెళ్లింది. బుధవారం ఉదయం జడ్పీ సీఈఓ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయగా.. పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా పోలీసు అధికారులు వెల్లడించలేదు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సైతం జడ్పీ సీఈఓపై వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం. ఏదేమైనా తాను ఎవరి విధులకు ఆంటకపర్చలేదని, తన విధులకు, బాధ్యతలకే ఆటంకపరిచారని ఎమ్మెల్యే తెలిపారు.

కరీంనగర్ జడ్పీ సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి.. తన అధికారాలను అవమానించేలా వ్యవహరించి, తనతో సమావేశమైన ఎంఈఓలు, హెచ్ఎంలకు నోటీసులు ఇచ్చిన డీఈఓపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. అదే సమయంలో సమావేశం నుంచి కలెక్టర్ పమేలా సత్పతి వెళ్తున్న క్రమంలో అడ్డుకుని బైఠాయించారు. సమావేశం ముగిసిన తరువాత మంగళవారం రాత్రి జడ్పీ సీఈఓ శ్రీనివాస్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు ప్రభుత్వ అధికార యంత్రాంగం విధులకు ఆటంకపరిచిన సెక్షన్లలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. భారత్ న్యాయ్ సంహిత యాక్ట్ సెక్షన్ 221, 126 (2)లో ఈ కేసు నమోదు చేశారు. దేశంలో బీఎన్ఎస్ యాక్టు అమల్లోకి వచ్చిన రెండో రోజు చట్టసభకు ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రతినిధిపై క్రిమినల్ కేసు నమోదైయింది. అయితే, ఈ కేసు నమోదు వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు.



జడ్పీ సీఈఓపై ఎమ్మెల్యే ఫిర్యాదు

హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితబంధు స్కీమ్, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై ప్రశ్నిస్తున్న క్రమంలో తన విధులకు ఆటంకం కలిగించి ప్రొటోకాల్ ఉల్లంఘించిన జడ్పీ సీఈఓ ఎం.శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులకు నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, సమస్యలను లేవనెత్తే హక్కు సభ్యులకు ఉందని అన్నారు. లేవనెత్తిన సమస్యలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. తన వ్యక్తిగత ప్రతిష్టకు, హక్కులకు భంగం కలిగించిన జడ్పీ సీఈఓపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలం.. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

మేము ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలం. సమస్యలపై ప్రస్తావించాల్సిన బాధ్యత మాపై ఉంది. జడ్పీ అయినా అసెంబ్లీ అయినా ప్రజా సమస్యలపై గళం విప్పుతాం. అలాగని మాపైనే క్రిమినల్ కేసులు పెడతారా? బీఆర్ఎస్ సర్కారులో ఏ ఒక్క విపక్ష సభ్యునిపైనా ఇలా కేసు పెట్టలేదే!. నియంతలా మారిన కాంగ్రెస్ సర్కారు వ్యవహారం కండ్ల ముందు కనిపిస్తోంది' అంటూ మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు.

బుధవారం ఉదయం జడ్పీ ఘటనపై సీఈఓపై ఫిర్యాదు చేసేందుకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మద్దతుగా వచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను సమావేశమైన ఎంఈఓలను బాధ్యతల నుంచి తప్పించి నోటీసులిచ్చిన ఘటన, దళితబంధు, ఆస్పత్రి విషయాలపై కౌశిక్‌రెడ్డి ప్రస్తావించారన్నారు. దానికి తమ విధులకు ఆటంకం కలిగించారని జిల్లా పరిషత్ సీఈవో పోలీసులకు ఫిర్యాదు చేయడం, వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయడం చాలా దురదృష్టకరమన్నారు. కౌశిక్ రెడ్డి మాట్లాడింది జిల్లా పరిషత్ సమావేశ మందిరంలోనేని, బయట కాదని తెలిపారు. తమకు మాట్లాడే హక్కు లేదా? అని, తమ సభ్యునిపై ఎఫ్ఐఆర్ ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. ఈ విషయాలపై కరీంనగర్ సీపీ ఆలోచించి విచారణ చేసి ఎవరిది తప్పయితే వారిని శిక్షించాలని కోరినట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై కక్ష సాధింపులు ఉండవని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కేసులు పెట్టి ఇబ్బంది పెడితే భయపడేది లేదని, ప్రజల సమస్యలపై కచ్చితంగా కొట్లాడతామని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలు ఇచ్చేవరకు ప్రభుత్వం వెంట పడతామని అన్నారు. తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా సహించేది లేదని, మాజీ మంత్రి గంగుల కమలాకర్, వినోద్ కుమార్ నాయకత్వంలో పోరాడతామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు నమ్మి ఆగం కావద్దన్నారు. గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు నమ్మిన జమ్మికుంట, కమలాపూర్ ఎంఆర్‌ఓలు జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. తాను స్పీకర్‌ను కలిసి డీఈవో పైనా, జడ్పీ సీఈవో పైనా ప్రివిలైజ్ మోషన్ మూవ్ చేస్తానని తెలిపారు.

కేసు నమోదు అక్రమం : కేటీఆర్

హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయడాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు (కేటీఆర్) ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను బెదిరించేందుకు అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ప్రజా పాలనంటే ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టడమేనా అంటూ నిలదీశారు. జెడ్పీ సమావేశంలో ప్రజల సమస్యలను ప్రశ్నించిన ప్రజాప్రతినిధిపై కేసు పెట్టడాన్ని ఆయన తప్పు పట్టారు. స్థానిక ఎమ్మెల్యేగా తనకున్న అధికారాల మేరకు సమావేశంలో ప్రశ్నించారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి ఫిర్యాదు చేసిన అంశాలపై దృష్టి పెట్టాల్సింది పోయి, ప్రతిపక్షాల నోరు మూయించాలనే కుట్రతో అక్రమ కేసులకు తెరదీస్తున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేసులకు, బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదనీ, ప్రజా గొంతుకగా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు.

చేనేత కార్పొరేషన్ చైర్మెన్‌గా శ్రీనివాస్‌ను నియమించాలి



మస్న రవి కుమార్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర చేనేత విభాగం కార్పొరేషన్ చైర్మెన్‌గా గూడూరు శ్రీనివాస్ నేతను నియమించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మస్న రవి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి అంకం శ్రీనివాస నేత, తెలంగాణ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి కోణంపేట్ట నరసింహా నర్సింగ్‌రావు నేత, తెలంగాన చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి బొగ్గ జగదీష్ నేత, సంగారెడ్డి అధ్యక్షులు బాలే ప్రవీణ్ నేత, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎలె నరేందర్, బొడ్డు శివనేత తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి : కార్పొరేటర్

నవతెలంగాణ-సంతోష్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. స్థానిక నాయకురాళ్ళతో కలిసి భారతీయ జనతా పార్టీ, భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సైదాబాద్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఇప్పటికీ 8 నెలలు పూర్తయింది కానీ ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు ఏమి అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ గద్దె నేక్కాక హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. వినతి అందజేసిన వారిలో పలువురు మహిళలు ఉన్నారు.





కొత్త చట్టాలకు వ్యతిరేకంగా నిరసన

నవతెలంగాణ-వనస్థలిపురం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలకు వ్యతిరేకంగా ట్రాన్స్‌పోర్టు కార్మికులు వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్య కాలనీ ఎల్బీనగర్ చౌరస్తా ఆటో స్టాండ్ దగ్గర బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కడారి రాములు, ఎల్బీనగర్ సీఐటీయూ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సెక్షన్ 106 - బిఎన్ ఎస్‌లోని సబ్ సెక్షన్ 2 మినహా కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలు భారత్ న్యాయ సహిత, భారతీయ నాగరికత సురక్ష సహిత, భారతీయ సాక్ష్య అదినీయం ఈ చట్టాలు 01 జులై 2024 నుండి అమలవుతున్నాయని, ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులుగా చేయకూడదు, కారణాలను పరిశీలించిన తర్వాత కేసును బుక్ చేయడం బాధ్యులైన ఇరువురి తప్పిదాన్ని బట్టి కేసులు బుక్ చేయాలన్నారు. అలా కాకుండా కేవలం డ్రైవర్ తప్పిదమే ఉన్నట్టుగా ఈ చట్టం ఆధారంగా డ్రైవర్లలందరికీ ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించే విధంగా చట్టం ఉందన్నారు. వెంటనే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. గతంలో ఉన్నటువంటి రాజ్య ద్రోహం చట్టాన్ని మార్చి దేశద్రోహరంగా మార్చడం, పోలీస్ స్టేషన్ కు సంబంధం లేకుండా ఆన్లైన్ ద్వారా కంప్లైంట్ ఇస్తే కేసు బుక్ చేసే విధంగా పోలీసులకు సంబంధం లేకుండా జీరో ఎఫ్ఐఆర్ చేయాలని ఉందన్నారు. కొత్త చట్టాల ఆధారంగా అమాయక ప్రజలు, కార్మికులు ఆ చట్టాల ఆధారంగా శిక్షకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. అనేక మంది కుటుంబాలు నాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు అనుమతి లేకుండా లైంగిక దాడి గురించి పత్రికలలో ప్రచురిస్తే పత్రిక మిత్రులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల స్వేచ్ఛను హరించే విధంగా కేంద్రంలో ఉన్నటువంటి కేంద్ర మంత్రి అమిత్ షా ప్రమాదకరమైన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్ స్కీముల వలన నష్టపోయిన ఆటో డ్రైవర్లను వెంటనే ఆదుకోవాలన్నారు. ఆటో కార్మికులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అనుసరించి నెలకు 12 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రైవర్ల అందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, ప్రతి కార్మికునికి 10 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. టియు నూతన హ్యాపీ యాప్ తీసుకువచ్చి కార్మికులకు జీవనోపాధి చూపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు కార్మిక నాయకులు టి కృష్ణమూర్తి, జే రాము, టి వెంకటస్వామి, ఎస్ రమేష్, ఎం గోపి, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ - ఎల్బీనగర్/ హస్తినాపురం

మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బుధవారం నూతన ఐఏఎస్ అధికారి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో పర్యటించారు. ముందుగా బైరామాల్‌గూడ చెరువును సందర్శించారు. చెరువులో పేరుకుపోతున్న దానికి తీసేందుకు ఒక వ్యక్తిని నియమించాలని ఎమ్మెల్యే అన్నారు. అలాగే చెరువులోకి డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు సుందరీకరణ పనులు చేయాలని కోరారు. అనంతరం పక్కనే ఉన్న సాయి ప్రకాష్ నగర్ కాలనీలో పర్యటించారు. అక్కడ కొన్ని రోజుల క్రితం నుంచి జరుగుతున్న నూతన సీసీ రోడ్డు సమస్యలను పరిశీలించారు. దానిలో భాగంగా అక్కడ కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ రోడ్డు స్థలం మాది అని చెప్పి రోడ్డు వేయకుండా అడ్డుకున్నారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు రోడ్డు పబ్లిక్ సొసైటీ రోడ్డు అని నిర్ణయించి రెండు, మూడు రోజుల్లో మిగిలిన 150 ఫీట్ల సీసీ రోడ్డు వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకీయా సుల్తానా, అధికారులు అశోక్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ నాయక్, సత్యంచారి, రఘుమారెడ్డి కాలనీవాసులు రాఘవేంద్ర, రామకృష్ణ, ప్రవీణ్, రాజశేఖర్, హరిక్రిష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



- స్కూల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి

నవతెలంగాణ- సిటీ బ్యూరో

విద్యార్థులు చిన్నప్పటి నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని స్కూల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ మెగా సిటీ స్కూల్లో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థుల ఎలక్షన్లు నిర్వహించినట్టు తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఎలక్షన్లు నిర్వహించినట్టు చెప్పారు. చదువుతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులను గుర్తించడం, ప్రోత్సహించడం వలన నాయకత్వ లక్షణాలు స్కూలు నుండే ప్రారంభం అవుతాయని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అన్ని తరగతుల్లో ఎలక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు అందరు పాల్గొని తమకు నచ్చిన నాయకులను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపాల్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లో వోల్టేజీని పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని డివిజన్ పరిధిలో ఉన్న గడ్డం ఎంక్లేవ్ ఫేస్ వన్, ఫేస్ టు, ఫేస్ త్రి, అరవింద్ నగర్, మారుతీ నగర్ కాలనీలలో ఉన్న విద్యుత్ లో వోల్టేజీ సమస్య, రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను పరిష్కరించాలని 26వ డివిజన్ కార్పొరేటర్ రామిడి కవిత రాంరెడ్డి కోరారు. ఈ విషయంపై తుర్కయంజాల్ విద్యుత్ శాఖ ఏడీకి కార్పొరేటర్ రామిడి కవిత రాంరెడ్డి బుధవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా లో వోల్టేజీ సమస్యతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందుకు ఏడీ ఫోన్లో సానుకూలంగా స్పందించి.. త్వరలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వటంతో వినతి పత్రం అడిషనల్ ఇంజనీర్ రమేష్‌కు అందచేసినట్లు తెలిపారు. వినతి అందజేసిన వారిలో కాలనీలకు సంబంధించిన అధ్యక్షులు, కాలనీల సభ్యులు అనిల్ రెడ్డి, సిహెచ్ సురేష్, ఎం.సురేష్, శేఖర్, ఈత రాజు, ఏ.యాదయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డివిజన్‌కు నిధులు మంజూరు చేయండి

కార్పొరేటర్ సుజాత

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ కోరారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్ ఆదర్శనగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్పొరేటర్ వెంట నాయకులు డి. కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్ నాయక్ తదితరులు ఉన్నారు.

రైతు బజార్ ఆధునీకరణకు కృషి చేస్తా



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-చైతన్యపురి

సరూర్‌నగర్ రైతు బజార్ ఆధునీకరణకు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ రైతు బజార్‌ను గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సెక్రెటరీ చిలుక నరసింహారెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. తర్వాత రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. 1994 - 95లో ఏర్పాటు చేసిన నిర్మాణం కావడంతో రైతులకు వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, షెడ్ లో నిర్మాణాన్ని కొద్దిగా ఎత్తు పెంచి సహజ గాలి, వెలుతురు వచ్చే విధంగా నూతన నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే తోపుడు బండి వ్యాపారులకు రైతు బజార్‌లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మార్కెట్లో రైతులకు నూతన మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.

అనంతరం బీజేఆర్ భవన్ భవనాన్ని పరిశీలించి..అత్యాధునిక వసతులతో ఆధునీకరించాలని అసిస్టెంట్ ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ అధికారిని కుసుమ లావణ్యకు సూచించారు. ఎండా కాలంలో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో బోర్ వేయించడంతోపాటు, బీజేర్ భవన్‌లో కార్యక్రమాలు చేసుకునే నిర్వాహకుల కోసం వంట చేసుకునే విధంగా వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఆధునీకరణ కోసం రూ. 4కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. పూర్తి వివరాలతో ఎస్టిమేషన్ వేసి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఈఓ స్రవంతి రెడ్డి, డీఈ రవీందర్, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, నియోజకవర్గ మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రామ్ నర్సింహా గౌడ్, సీనియర్ నాయకులు ఆకుల అరవింద్, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహిళా అధ్యక్షురాలు ఊర్మిల రెడ్డి, సాజిద్, శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, అంకి రెడ్డి, డివిజన్ మాజీ యూత్ అధ్యక్షుడు శ్యామ్ గుప్త, మహేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, ఋషి, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ- నాగోల్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నాగోలు డివిజన్‌లోని గ్రీన్ ఫీల్డ్ కాలనీలో కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమ్మ పేరుతో ఒక మొక్క' నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, సతీష్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌కు సన్మానం



నవతెలంగాణ - సంతోష్‌నగర్

హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం హైదరాబాద్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ వారు డీసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాన్నారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పీస్ కమిటీ సభ్యులందరూ సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్ ఈస్ట్ జోన్ జనరల్ సెక్రెటరీ ఆల్ జోన్స్ కిషన్ శర్మ, సౌత్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఖాజా ఫజిఉద్దీన్, జాయింట్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

'విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి'



నవతెలంగాణ - చైతన్యపురి

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లీదండ్రులు ఇబ్బందులు పడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని, దానికి నిరసనగా నేడు (గురువారం) విద్యా సంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివకుమార్ అన్నారు. ఈ మేరకు చైతన్యపురిలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 25 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తే అవకతవకలు జరిగాయని అన్నారు. ప్రశ్నా పత్రమును రూ.30లక్షలకు అమ్ముకున్నామని స్వయంగా నేరస్తులు ఒప్పుకున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. నీట్ పరీక్ష రద్దు చేయాలని జరుగుతున్న బంద్ విజయవంతం కోసం ఉపాధ్యాయులు, తల్లీదండ్రులు, విద్యార్థులు సహకరించి.. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షులు కానుగుల అరుణ్, డివిజన్ కమిటీ సభ్యులు నరేష్, పవన్, తరుణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్‌నగర్

దేశంలో విద్యా రంగం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నేడు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం మలక్‌పేట్‌లో బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. చైతన్య యాదవ్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణలు మాట్లాడారు. నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ల లీకేజీల వలన నష్టపోయిన విద్యార్థులకు, తల్లీదండ్రులకు పూర్తిస్థాయి భరోసా కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పేపర్ లీకేజీ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కోరారు. నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు షేక్ మహమూద్, అనీల్ కుమార్, వంశీ, రాహుల్, దశరథ్, అంజి పాల్గొన్నారు.



'బాలాపూర్‌లో ప్రభుత్వ భూమి కబ్జా'

- కలెక్టర్, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు





నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 74లో గల ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్, బాలాపూర్ మండల తహసీల్దార్ మాధవి రెడ్డికి బుధవారం దళిత నాయకులు మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేష్, బొర్ర రవి కుమార్, గిరీష్, అంజయ్యల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలాపూర్ గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 74లో 2.5 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని గతంలో గ్రామానికి చెందిన సింగిరెడ్డి జైహింద్ రెడ్డి తన సోదరులతో కలిసి కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేయటానికి ప్రయత్నం చేస్తుండగా.. ఆ సమయంలో సరూర్ నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆనాటి తహసీల్దార్ ప్రసాద్, చంద్రారెడ్డిలకు ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. ఆ రోజుల్లో 2012,13,14 సంవత్సరంలో వారు ప్రభుత్వ భూమిని సర్వే చేయించి అందులో ప్రభుత్వ భూమి అని బోర్డును కూడా ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుండి 2021వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేయలేదన్నారు. తరువాత కొంత కాలం ఏమి చేయకుండా నిలుపుదల చేసి మరల రాత్రికి రాత్రే అక్కడ ఉన్న ప్రభుత్వ భూమి అని ఉన్న బోర్డును తొలగించి.. తిరిగి పనులు ప్రారం భించినట్లు తెలిపారు. అందుకే తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆ భూమిని సర్వే చేయించి, ప్రభుత్వ భూమిగా నిర్ధారణ చేసి అక్రమ నిర్మాణాలను చేయరాదని బోర్డును ఏర్పాటు చేసి పనులను ఆపి వేయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం అదే ప్రభుత్వ భూమిలో అధికార పార్టీ నాయకుల అండ దండలతో అక్రమ నిర్మాణాలను చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కాకుండా చూడాలని కోరారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం..



ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తు న్న వారిపై చట్టపరంగా చర్య లు తీసుకుంటాం. ఇప్పటికే సర్వేయర్‌ను ఆ భూమిని సర్వే చేయటానికి పంపించాం. అతని నుండి సర్వే రిపోర్ట్ వచ్చిన వెంటనే కబ్జా దారులపై చర్యలు తీసుకుంటాం.

తహసీల్దార్ మాధవి రెడ్డి

పదవి లేకున్నా ప్రజల కోసం పనిచేస్తా

- వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ బుర్ర రేఖ మహేందర్ గౌడ్



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పదవిలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన ఉంటూ వారి కోసమే నిరంతరం పనిచేస్తానని ఎంపీపీ బుర్ర రేఖ మహేందర్ గౌడ్ తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పాలకవర్గం ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీడీపీ శ్రీవాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుర్రరేఖ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ గడిచిన 5 సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం తకెంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. సహచర ఎంపీటీసీ సభ్యుల సహకారాలు, వారి త్యాగాల ఫలితంగా ఐదు వసంతాలు పూర్తి చేసుకుని అభివృద్ధిలో ముందుకెళ్లడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో విధేయతగా ఉంటూ పార్టీ బలోపేతం కోసం మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో కింది స్థాయి కార్యకర్తగా పనిచేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆశీస్సులతో, ప్రజలందరీ సహకారంతో తనకు ఎంపీపీ పదవీ వరించదని హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధిలో భాగస్వాములైన వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీలు అనిత మహేందర్ గౌడ్, మేడిపల్లి బాలమణి, తాటిపల్లి సౌమ్య రమేష్, రాచపాక లావణ్య, సీక సాయికుమార్ గౌడ్, భీమగోని భాస్కర్ గౌడ్, చేగూరి వెంకటేష్, గ్యార బాల లింగస్వామి, కేసెట్టి వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు ఎండీ గౌస్ పాషాల సహకారాలు, త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. అలాగే అభివృద్ధికి సహకరించిన ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ వినోద, పంచాయతీ కార్యదర్శిలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. పాలన పరంగా ఏమైన చిన్న పొరపాట్లు జరిగితే క్షమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి

నవతెలంగాణ - చైతన్యపురి

రంగారెడ్డి జిల్లా ఎస్సీ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలు, సీజనల్ వ్యాధులు డెంగ్యూ, ఫీవర్ లాంటివి రాకుండా చర్యలు చేపట్టాలని సోషలిస్ట్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేష్ కోరారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్ రామారావు నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ మెట్రిక్ హాస్టల్‌లో దుప్పట్లు, బెడ్ షీట్స్ పంపిణీ చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు పరిసర ప్రాంతాల్లో కళాశాల బాయ్స్, గర్ల్స్‌కు నూతన సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలకుర్ల మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగింది

- డాక్టర్ రాహుల్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషన్స్ అవార్డు-2024లో భాగంగా 'హైదరాబాదులో మోస్ట్ ట్రస్టెడ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్' చైతన్యపురిలోని ప్రాణహిత హాస్పిటల్‌కు రావడం వైద్యం పట్ల మరింత బాధ్యతను పెంచిందని డాక్టర్ రాహుల్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా హాజరైన కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్, శ్రీపద్ నాయక్, ఎస్పీ సింగ్, హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, సమక్షంలో బాలీవుడ్ నటి, ఎంపీహేమమాలిని చేతుల మీదుగా రాహుల్ రెడ్డి అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక నాణ్యమైన వైద్యాన్ని అందరికీ అందుబాటులో తేవడమే కాకుండా, పేద ప్రజలకు అతి తక్కువ ధరలకే వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి నాణ్యమైన వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో డాక్టర్లు అనీల్ కుమార్, కృష్ణ ప్రీతమ్ రెడ్డి లతో పాటు ప్రముఖులు పాల్గొన్నారు.

కులాంతర వివాహం చేసుకున్న జంటకు రూ.2.50 లక్షల బాండ్ అందజేత



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి డివిజన్ కృపా కంప్లెక్‌కు చెందిన తాళ్లూరి పవన్ రాజేష్ (ఓసీ), సీమల పుష్పలత (ఎస్సీ) కులాంతర వివాహం చేసుకొని ఇటీవల ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ ఇన్సెంటివ్ క్యాష్ అవార్డు కోసం ఎస్సీ సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన రూ.2లక్షల 50వేల విలువ చేసే ఫిక్స్ డిపాజిట్ బాండ్ పత్రాలను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీకర్ రెడ్డి, పాండు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మేడ్చల్ మండల ప్రజా ప్రతినిధులు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా బుధవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో మేడ్చల్ మండల ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ రుక్సానా యూనిస్ పాషా, పీఏసీఎస్ చైర్మెన్ సద్ది సురేష్ రెడ్డి, మాజీ సర్పంచులు గీతా భాగ్యరెడ్డి, బైరి లక్ష్మీ సంజీవ, చిన్నోళ్ల కవితా జీవన్, రాజమల్లారెడ్డి, రామోదర్ రెడ్డిలు ఉన్నారు.

ఇక 'ప్రత్యేక' పాలన

- ముగిసిన మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం
- జెడ్పీకి కలెక్టర్, మండలాలకు జిల్లా అధికారులు..
- పదవీ బాధ్యతలు చేపట్టనున్న స్పెషల్ ఆఫీసర్లు
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంకా రాని స్పష్టత



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్థానిక సంస్థల పాలక మండళ్ల కాలపరిమితి ఒక్కొక్కటిగా ముగుస్తోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీల పాలకవర్గాల కాల పరిమితి ముగియగా.. నిన్నటితో మండల పరిషత్‌లు పదవీ కాలం పూర్తి కాగా, నేటితో జిల్లా పరిషత్ పాలక మండళ్ల పదవీ కాలం సైతం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల పాలక మండళ్ల గడువు ముగిసినా.. ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా.. ఎన్నికల నిర్వహణకు చాలా సమయమే పడుతుంది. షెడ్యూల్ విడుదల, ఓటరు జాబితా తయారీ, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల సిబ్బంది నియామకం, పోలింగ్ నిర్వహణ వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం కనీసం రెండు నెలల సమయమైనా పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమిస్తున్నారు.

గతంలో మాదిరిగానే..!

గతంలోనూ ఎన్నికలు నిర్వహించలేని సందర్భంలో జిల్లా స్థాయి అధికారిని మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఈసారి కూడా ఇదే విధానాన్ని అవలంభిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 43 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరి కాల పరిమితి బుధవారంతో ముగిసింది. జిల్లా పరిషత్‌లో ఐదుగురు జెడ్పీటీసీలు ఉన్నారు. ఇందులో ఒకరు చైర్మెన్, మరొకరు వైస్ చైర్మెన్ కాగా.. మరో ముగ్గురు సభ్యులు ఉన్నారు. వీరి కాల పరిమితి సైతం నేటితో ముగియనుంది.

పాలకవర్గానికి వీడ్కోలు

పదవీ కాలం పూర్తి కావడంతో మేడ్చల్‌లోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం పాలకవర్గానికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్, సభ్యులను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ప్రత్యేకాధికారులు ఇలా..

జెడ్పీ చైర్మెన్ స్థానంలో జిల్లా కలెక్టర్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల స్థానంలో జిల్లా అధికారులు ప్రత్యేకాధికారులుగా నియామకం కానున్నారు. నేటి నుంచి ఎంపీటీసీల బాధ్యతలను, రేపటి నుంచి జెడ్పీటీసీల బాధ్యతలను స్పెషల్ ఆఫీసర్లు, జెడ్పీ చైర్మెన్ బాధ్యతలను జిల్లా కలెక్టర్ నిర్వర్తించనున్నారు. ఈ విషయాలను అధికారికంగా నేడు ప్రకటించనున్నారు. కాగా ఇప్పటికే జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దాదాపుగా ఆరు నెలలుగా కొందరు జిల్లా అధికారులు సైతం ఆయా గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లుగా కొనసాగుతున్నారు. ఇదే తరుణంలో జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక మండళ్ల పదవీ కాలం ముగియడంతో ఆయా మండలాలకు ఎంపీటీసీలు, జెడ్పీటీసీల స్థానంలో ప్రత్యేకాధికారులుగా జిల్లా అధికారులు కొనసాగతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొందరు జిల్లా అధికారులు జీపీలకు స్పెషల్ ఆఫీసర్లుగా కొనసాగుతున్న వారికి మినహాయింపు ఇస్తారా..? లేక వారికి కూడా గ్రామ, మండల ప్రత్యేకాధికారులుగా రెండేసి బాధ్యతలు కట్టబెడతారా..? అనేది నేడు తేలనుంది.

ఇక జెడ్పీ సమావేశాలు లేనట్టే..

ఇక నుంచి మేడ్చల్ జెడ్పీ సమావేశాలు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఔటర్ రింగు రోడ్డు లోపలి భాగం మొత్తాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కీసర మండల పరిధిలోని చీర్యాల, గోధుమకుంట, కరీంగూడ, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి గ్రామ పంచాయతీలు, ఘట్‌కేసర్ మండల పరిధిలోని ఎదులాబాద్, అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, మర్రిపల్లిగూడ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో కలువనున్నాయి. ఇక మిగిలిన 51 గ్రామ పంచాయతీలను పక్క జిల్లాల్లో వీలీనం చేస్తారా? ప్రత్యేక విధానం ఏమైనా తీసుకొస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పైపులైన్, సీసీ రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుషాయిగూడను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతానన్నారు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రతి సమస్యనూ త్వరలోనే పరిష్కరిస్తామని అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోంశేఖర్ రెడ్డి, పండాల శివకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి, పంజాల బాబు, వాసుదేవ ముదిరాజ్, చిత్తుల కిషోర్, చల్లా వెంకటేష్, చిన్నోజి వరప్రసాద్, కొడకండ్ల యాదయ్య, దయానంద్, గణేష్, పిట్ల రాజు, జి. కృష్ణ కుమార్, నర్సింగ్ రావు, క్యాత దినేష్, సారా శ్రీధర్ ముదిరాజ్,సుదీర్ బాబు, మణి కిరణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల కోసం అదనపు తరగతి గదుల నిర్మాణానికి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ అదనపు తరగతుల నిర్మాణానికి రూ.13.5 లక్షలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానికులు తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, ఫైళ్ల ప్రవీణ్, దయాకర్ రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, రఘు, నాగరాజు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన జవహర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు బుధవారం కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్‌ను వీఏన్ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ అసోసియేషన్ సభ్యులను సన్మానించి జవహర్‌నగర్ కాలనీ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సిహెచ్. నారాయణ, ఉపాధ్యక్షులు కాశిరెడ్డి, సెక్రటరీ జాన్, కోశాధికారి ముత్యంరెడ్డి, సభ్యులు పద్మావతి, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, కాలనీ పెద్దలు జగన్మోహన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, కృష్ణమూర్తి, సంఘం సభ్యులు అన్నపూర్ణ, మాధవి, అంజుబాయ్, లక్ష్మీ, నరసమ్మ, పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా హై స్కూల్ యాజమాన్యాన్ని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావు డివిజన్‌లోని St.థెరిస్సా హై స్కూల్ యాజమాన్యాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులో రాయితీ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఎమ్మెల్యే కోరారు. సానుకూలంగా స్పందించిన యాజమాన్యం తప్పక అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌రావునగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా మెరుగుపరచాలి



- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-మల్కాజిగి

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్, ఇందిరా నగర్, నెహ్రూ నగర్, గోపాల్ నగర్, మల్లికార్జున నగర్ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి మారేడ్‌పల్లి జలమండలి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీజీఎం కృష్ణ, జలమండలి మేనేజర్ శ్రవంతిలతో మాట్లాడారు. మంచినీరు సక్రమంగా రావడం లేదని ఆయా కాలనీ వాసులు తన దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. మంచినీటి ఎక్కువసేపు సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధి రాములు, బైరు అనిల్, కాటంరాజు , నందు, పరమేష్ , అనిత, మల్లేష్, గణేష్ నాయక్ తదితరులు ఉన్నారు.



చర్లపల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు సంపత్ కుమార్ తల్లి హైమవతి అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న బండారి లక్ష్మారెడ్డి బాధితురాలి నివాసంలో బుధవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మహేష్ గౌడ్ పాల్గొన్నారు. -నవతెలంగాణ, కాప్రా

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్వోకు వినతి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఎమ్మార్వో సీతారాం నాయక్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను సకాలంలో అందజేయాలని కోరారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్, అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) సమస్యను పరిష్కరించాలన్నారు. ముస్లిం శ్మశాన వాటికకు స్థలాలు కేటాయించాలన్నారు. మల్కాజిగిరిలోని సర్దార్ పటేల్ నగర్‌లోని 74 మంది భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని తెలిపారు. చంద్రబాబు నాయుడు కాలనీలో ఇండ్ల పట్టాలు ఇవ్వని వారికి ఇండ్ల పట్టాలు అందజేయాలని పేర్కొన్నారు. మహేంద్ర హిల్స్‌లోని సర్వేనెంబర్ (84/ఏ)లోని ప్రభుత్వ భూమిని సర్వే చేయించాలని వినతి పత్రంలో కోరారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, మేకల సునీత రామ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, రావుల అంజయ్య, జీకే హనుమంతురావు, చిందం శ్రీనివాస్, సర్వే నరేష్, సర్వేష్ యాదవ్, సతీష్, బాలకృష్ణ, ఉపేందర్, గణేష్, రాజు, శివ కుమార్, శ్యామ్, నవీన్, సుధీర్, శోభ, ప్రమీళ, జయమ్మ, ఉమ, పరిమళ, నాయకులు ఉన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



నవతెలంగాణ-కాప్రా

దేశంలో విద్యా రంగం, పరీక్షల నిర్వహణ, పేపర్ లీకేజీలపై నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నేడు చేపట్టే కేజీ టూ పీజీ దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఈసీఐఎల్‌లో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నేత మహేష్ కుమార్‌లు మాట్లాడుతూ.. నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ల లీకేజీతో నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థులకు భరోసా కల్పించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వామే బాధ్యత వహించాలన్నారు. పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీతో నష్టపోయిన 24లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ఎన్‌టీఏను రద్దు చేసి కేంద్ర విద్యా శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. పేపర్ లీకేజీ ఘటనపై మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్, యూజీసీ, నెట్ పేపర్ లీకేజీకి నిరసనగా నేడు విద్యార్థి సంఘాలు చేపట్టే విద్యా సంస్థల బంద్‌కు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు గిరిబాబు, శేఖర్, అరుణ్, కిరణ్, రవి పాల్గొన్నారు.

అటెండర్ మల్లేష్‌కు మాజీ ఎంపీపీ సత్కారం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘ కాలంగా అటెండర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన మల్లేష్‌ను మాజీ ఎంపీపీ పద్మా జగన్‌రెడ్డి దంపతులు బుధవారం ఘనంగా సన్మానించారు. అర్ధతులం బంగారం, కొత్త బట్టలు అందజేసి పూలమాలవేసి, శాలువా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. దివ్యాంగుడైన మల్లేష్ పద్దెనిమిదిన్నర ఏండ్లు మండల పరిషత్తు కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించారని తెలిపారు. తన సేవలతో అధికారులను, ప్రజాప్రతినిధులను మెప్పించారని కొనియాడారు. మల్లేష్‌తో పాటు మరో ఐదు మంది అంటెడర్లకు ఎంపీపీ దంపతులు కొత్త బట్టలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసంత లక్ష్మి, ఎంపీవో వినూత్న రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రవీందర్ రెడ్డి, శాంతి పాల్గొన్నారు.


దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు లూటీ

- నాలుగు తులాల బంగారం, రూ.6 వేల నగదు అపహరణ
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-జవహర్ నగర్

దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారం, నగదు దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అంజనాద్రి నగర్ కాలనీకి చెందిన దాసరి మహిపాల్ రెడ్డి, రెండు రోజుల క్రితం కుటుంబంతో సహ శ్రీకాళహస్తి దేవాలయనికి వెళ్లి తిరిగి మంగళవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి లోపలికి వెళ్లి చూసేసరికి బెడ్ రూమ్ బీరువా తాళం పగుల గొట్టి, వస్తువులు అన్ని చిందారవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం రూ. 6 వేల నగదు కనిపించలేదు. దీంతో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం



- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి

నవతెలంగాణ-జవహర్‌నగర్

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జవహర్ నగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. బుధవారం కాప్రా తహశీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు జవహర్ నగర్‌లోని పలు సర్వే నెంబర్లలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది జేసీబీతో కూల్చేశారు. ప్రభుత్వ భూములను కాపాడడం తమ కర్తవ్యమని తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపడితే అట్టి నిర్మాణాలను కూల్చేవేయడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వోల్టేజ్ సమస్య తలెత్తకుండా చూస్తాం

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లో వోల్టేజ్ సమస్య తలెత్తకుండా చేస్తామని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. చిల్కానగర్‌లోని మార్కెండేయ స్వామి టెంపుల్ ఆలయ ప్రాంతంలోని ఉన్న బస్తీ వాసులు విద్యుత్ ఓల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని టీవీలు, ఫ్రిజ్‌లు, మోటర్లు కాలిపోతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సమస్యను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు బాలేందర్ ముదిరాజ్, ఆటో శీను, అనీఫ్ బాయ్, బలరాజ్ గౌడ్, రాంనర్సయ్య, చెర్రి, కుమార్, శ్రీనాథ్, శ్రీనివాస్, గౌరయ్య, వేణు, సువర్ణ, సుకన్య, రమా, కళావతి, తదితరులున్నారు.

అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు



- డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్ నిహారిక గౌడ్
- అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జవహర్ నగర్

అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని జవహర్ నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్ అన్నారు. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ అయ్యప్ప దేవాలయం పక్కన రూ.3 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జమాల్పూర్ నవీన్, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్, నాయకులు రమేష్ చారీ, సింగన్న బాలరాజు, దేవేందర్ రెడ్డి, చెన్నా రెడ్డి, శ్రీమన్నారాయణ, శ్రీనాధ్, పాల్గొన్నారు.

అల్వాల్‌లో ఘనంగా మెకానిక్ దినోత్సవం



నవతెలంగాణ-ఆల్వాల్

అల్వాల్‌లో ద్విచక్ర వాహనాల మెకానిక్ దినోత్సవాన్ని బుధవారం అట్టహాసంగా జరుపుకున్నారు. అల్వాల్ 143 డివిజన్ కార్పొరేటర్ ఈ కార్యక్రమానికి హాజరై జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. మెకానిక్‌లు అందరూ ఐక్యమత్యంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సామాజిక సేవలో సైతం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డి. శ్రీనివాస్ రాము, శ్రీశైలం సందీప్, మాధవరెడ్డి, రామ్ రెడ్డి ,రహీం, కరీం, జయానంద్, రాజు నాయకులు యాదగిరి గౌడ్, వివిఎస్ రాజు, కన్నా, గిరి, సాజిత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడ్చల్ మండల పరిషత్ వీడ్కోలు సమావేశం



- ప్రజాప్రతినిధులను సన్మానించిన చామకూర ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం నేటితో పూర్తి అవుతున్న సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మండల పరిషత్ సభ్యులను సన్మానించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మండల పరిషత్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మెన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, పీఏసీఎస్ చైర్మెన్‌లు సద్ది సురేష్ రెడ్డి, రణదీప్ రెడ్డి, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పద్మారెడ్డికి బండారి లక్ష్మారెడ్డి పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

బీజేపీ రాష్ట్ర నాయకులు ఎంపాల పద్మారెడ్డి అనారోగ్యంతో ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాస్పిటల్‌కి వెళ్లి పద్మారెడ్డిని బుధవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. ఆయన వెంట సాయిజన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన జగదీశ్వర్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు.దుద్దిల శ్రీధర్ బాబుని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సంబంధిత అధికారులు అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేసే విధంగా, పేద ప్రజలకు అండగా ఉండి తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారని జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు.

ముత్తుకు శుభాకాంక్షల వెల్లువ..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పోలీసు స్టేషన్, నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా కొత్తపల్లి ముత్తుని భాధ్యతలు స్వీకరించారు. ముత్తుని రెయిన్బో విష్టాస్, రాక్ గార్డెన్ అసోసియేషన్ తరుపున.. అసోసియేషన్ అధ్యక్షులు మధు సూదనరెడ్డి, అసోసియేషన్ సభ్యులు రామ్, ప్రమోద్ రెడ్డి, ప్రసాద్, శ్రీపాద్, పూసపాటి దీప్తిలు కలిసి, శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు.

ప్రమాద భరితంగా రోడ్లు

- తహిసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రోడ్డు గుంతలమయం
- పాదాచారుల, వాహనదారుల ఇక్కట్లు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కోట్లాది రూపాయలు ప్రజాధనం మన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏం చేస్తున్నారో తెలియదు గానీ.... కనీసం వసతులు కల్పించడంలో వారికి చీమకుట్టినట్టైనా లేదని వాహనదారులు, పాదాచారులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామరం సర్కిల్ దేవేందర్ నగర్‌లోని తహిసిల్దార్ కార్యాలయం ముందు రోడ్డు గుంతలుగా మారి వర్షపు నీరు ఉండడంతో వాహన దారుల, పాదాచారుల బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వర్షం పడ్డప్పుడు రోడ్డు మధ్యలో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక పడిపోయిన పరిస్థితులు, ప్రమాదాలు జరిగిన సంఘటనలు కోకొల్లలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల, అధికారుల ఇండ్ల ముందర ఈ విధంగా రోడ్లు ఉంటే ఊరుకునే వారేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు చిత్తశుద్ధితో తక్షణమే దీన్ని పరిశీలించి గుంతలు పూడ్చే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు. సోమవారం, శుక్రవారం ఈ కూడలిలో వారాంతపు మార్కెట్ జరుగుతుందని మార్కెట్ సమయంలో ట్రాఫిక్ భారీగా ఏర్పడి నీళ్ళతో నిండిపోయిన గుంతల వల్ల ప్రజలు మహిళలు, చిన్నపిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పత్రికల వారితో మొరపెట్టుకుంటున్నారు.

పూర్తి సమాచారంతో హాజరుకావాలి



- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈనెల 6న నిర్వహించనున్న జీహెచ్‌ఎంసీ 9వ సాధారణ సమావేశానికి ఆయా విభాగాల అధికారులు పూర్తి సమగ్ర సమాచారంతో సిద్దంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్ర పాలి కాట సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం తన చాంబర్‌లో జీహెచ్‌ఎంసీ ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి, స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సాధారణ సమావేశం ఎజెండా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కౌన్సిల్ సమావేశంలో కొచ్చన్, ఆన్సర్‌లకు సంబంధించి ఆయా విభాగాల అధికారులు సమగ్ర వివరణ ఇచ్చేలా సిద్ధం కావాలని సూచించారు. పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు. కౌన్సిల్ సమావేశం సాఫీగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన పలు అంశాలపై ఆమె చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఈ.ఎన్.సీ జియా ఉద్దీన్, ప్రాజెక్ట్స్ సీ.ఈ దేవానంద్, సీ.ఈ కోటేశ్వర రావు అడిషనల్ కమిషనర్ కే. శ్రీ వాత్సవ, స్నేహ శబరీష్, శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, యాదగిరి రావు, సునంద రాణి, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్, సీ.ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డా. రాంబాబు, చీఫ్ వెటర్నరి డాక్టర్ అబ్దుల్ వకీల్, శానిటేషన్, లేక్స్, ఇంజనీరింగ్, తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో కలిసి పనిచేద్దాం

- ఇ.వీ.డీ.ఎం కమిషనర్ రంగనాథ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలం వేళ ఇ.వీ.డీ.ఎం విభాగంతో పాటు పోలీసుల సమన్వయంతో పని చేసి నగరంలో వర్షం నిలువకుండా తగు చర్యలు తీసుకుందామని జీహెచ్‌ఎంసీ ఎన్ఫోర్స్మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలో వర్షంనీరు రోడ్లపై నిలిచిపోకుండా అన్ని ముందస్తు జాగ్రత్త తీసుకునేందుకు ఇ.వీ.డీ.యం కమిషనర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అదనపు కమిషనర్‌తో పాటు ట్రై పోలీస్ కమిషనరేట్ల (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ)పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా అధిక వర్షపాతం నమోదైనప్పుడు అక్రమణలకు గురైన ప్రాంతాలతో పాటు, వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలువకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలతో పాటు ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణ చేసి వ్యాపారాలను కొనసాగిస్తున్న వాటిని తొలగించడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ట్రాఫిక్ అధికారులు తమ పరిధిలోని ప్రధాన వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి వరద నీటి త్వరగా తరలించే మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు.

విద్యార్థులకు నోట్ బుక్‌ల పంపిణీ..

- కీలుకానీ సోమయ్య , సోమమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కీలుకానీ సోమయ్య, సోమమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోతే మండల పరిధిలో సిరికొండ, లాలు తండా, బీక్య తండా గ్రామ పంచాయతీల పరిధిలో ప్రాథమిక పాఠశాలలో ఫౌండర్ కీలుకానీ లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌లు, పలకలు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ కీలుకానీ లక్ష్మణ్, ఫౌండేషన్ సభ్యులు కీలుకాని వెంకన్న, కీలుకానీ వీరన్నలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మోతే మండల పరిధిలో సిరికొండ చుట్టు పక్కల తండాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల న్నిటిలో పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, నేడు ప్రతి పరీక్షలలో వారు సత్తా చాటుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని ఫౌండేషన్ సభ్యులు కీలకని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరు చొక్కా రావు, అనంతుల వెంకన్న, వెంకట్ రెడ్డి, రత్నావత్ కృష్ణ, ధరావతు లాలులు, పాఠశాలల సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ తిరుపతి, లాల్ తండా మాజీ సర్పంచ్ ఉమా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ జిల్లా, సూరారంలోని అంబేద్కర్ భవనం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం, న్యూ శివాలయ నగర్ రోడ్‌లో అంబేద్కర్ భవనం ప్రక్కన ఓ పురుషుడి మృతదేహాన్ని గుర్తించి, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు పోలీసులు వెళ్లి పరిశీలించగా... మృత దేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతి చెందిన వ్యక్తి 45 - 50 సంవత్సరాలు వయసు కలిగి ఉన్నట్లు.. మృతుడు భిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లు ఇలా.. నడిచేది ఎలా..



- ప్రధాన రహదారిపై మురుగు పరుగు
- తీవ్ర దుర్గంధంతో ప్రజలు పరేషాన్
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అధికారుల నిర్లక్ష్యం వాహనదారుల ప్రజల పాలిట శాపంగా మారింది. కారణంగా గత నాలుగైదు రోజులుగా జగద్గిరిగుట్ట ప్రధాన రహదారి మధ్యలో డ్రయినేజీ మ్యాన్ హెూల్ పూర్తిగా ధ్వంసమైపోయి రోడ్లపై డ్రయినేజీ నీరు మురుగు. ప్రవహిస్తుండడంతో పాదాచారులు, వాహనదారులతోపాటు వ్యాపార సంస్థల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రదుర్గంధం రావడంతో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. సీజనల్ వ్యాధులు సంభవిస్తున్న క్రమంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు సంచరిస్తుండడంతో రోడ్లపై ఉన్న డ్రయినేజీ నీరు పాదాచారులపై పడుతుండడంతో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహన దారులు కోరుతున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



- దిల్ ఖుష్ నగర్ ఐద్వా మహిళా సంఘం సభ్యత్వ కార్యక్రమంలో డిమాండ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని బాలానగర్ మండల పరిధిలోని దిల్ కుష్ నగర్‌లో డివిజన్‌లో స్థానికంగా పలు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి అని దిల్ ఖుష్ నగర్ ఐద్వా మహిళా సంఘం కార్యక్రమంలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా బస్తీలో నెలకొన్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని బోరు మరమ్మతులు చేయాలని తెలిపారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా ఆరు గ్యారెంటీలు, కొత్తవారికి రూ. 4వేలు వెంటనే ఇవ్వాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలని పేరొన్నారు. అదేవిధంగా మహిళలకు రూ.2500లు వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఈ మేరకు దిల్ కుష్ నగర్‌లో జరిగిన సభ్యత్వ కార్యక్రమంలో వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.విజయ, నాయకురాళ్లు లక్ష్మీ రాణి, అమీనా, ఆజీమ బేగం, గౌస్య సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు..



నవతెలంగాణ-దుండిగల్

మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమనిర్మాణాలు చేబడితే చర్యలు తప్పవు అని కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో బుధవారం పలు ప్రాంతాలలోని అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర చేసి కూల్చి వేతలు చేపట్టారు. ముఖ్యంగా మల్లంపేట్ అవుటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గల బహుళ అంతస్థుల భవనం, సాయి బాలాజీలోని ప్రణీత్ సంస్థ అక్రమ నిర్మాణాల బహుళ అంతస్థు కూల్చి వేశారు. అక్రమ నిర్మాణంతో బహుదూర్ పల్లి పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా టెక్ మహేంద్ర ప్రధాన రహ దారిలో 100 ఫీట్ రోడ్ ఉండగా అక్రమ నిర్మాణం చేస్తున్నారని పిర్యాదు రావడంతో.. అక్రమ బిల్డింగ్ నిబంధనలకు విరుద్దంగా నిర్మించడంతో ఇటీవల మల్లంపేట్‌లో ఏదేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాల పై వివిధ వరుస కథనాలు వార్త పత్రికలలో రావడంతో ఇప్పుడి వరకు స్తబతగా ఉన్న మునిసిపల్ కమీషనర్, అధికారులు టీపీవో సంజన, చైన్మెన్‌లతో కలిసి కూల్చి వేతలు చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు కృషి

- కార్పొరేటర్ కొలుకుల జగన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, ఆటస్థలం తదితర అంశాలపై ఆయన చర్చించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలు స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రయివేట్ పాఠశాల దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బస్తీ మాజీ అధ్యక్షులు శేషానికి నర్సింగ్ గౌడ్, స్థానిక నాయకులు ప్రకాష్, నరసయ్య, విటల్ ముదిరాజ్, సిహెచ్.దాసు,ఉపాధ్యాయులు, మహిపాల్ పాల్గొన్నారు.

సరికొత్త ప్రణాళికలతో కాంగ్రెస్..

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



నవతెలంగాణ-బాలానగర్

విపక్షాలు చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టేలా సరికొత్త ప్రణాళికలతో కాంగ్రెస్ ముందుకు వెళుతోందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2500 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేసిందని శ్రీరంగం తెలిపారు. ముఖ్యమంత్రి వినతికి తెలంగాణ ప్రభుత్వానికి భూములను అప్పగించేందుకు కేంద్ర రక్షణ శాఖ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేయటం హర్షించదగ్గ విషయమని శ్రీరంగం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలకు, తెలంగాణ అభివృద్ధి పట్ల ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం రక్షణ శాఖ భూములను సాధించారని, కంటోన్మెంట్‌ను మిలట్రీ పరిధి నుండి మినహాయింపుకు తెచ్చారని వెల్లడించారు. తాజాగా స్మార్ట్ సిటీల కాలపరిమితిని వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగింపు సాధించారని, పదేళ్లలో కేసీఆర్ చేయలేనిది, ఆరు నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించారని అన్నారు. పనిమంతుడికి, మాటల మాంత్రికుడికి తేడా ఇదేనని అన్నారు. అభివృద్ధి పట్ల అంకితభావంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఆరు నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త వ్యూహాలతో, సరికొత్త ప్రణాళికలతో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. విపక్షాల విమర్శలకు ఆస్కారం లేకుండా చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ నిషేధ దినోత్సవం..



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ వాడక నిషేధ దినోత్సవం సందర్భంగా బుధవారం జన విజ్ఞాన వేదిక, పికాసో- ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి పరిధిలోని ఎస్ఆర్ డిజి పాఠశాల సర్దార్ పటేల్ నగర్ శాఖలో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించండి, ప్లాస్టిక్ బ్యాగ్ వాడకాన్ని నిరోధించాలని ఇతివృత్తంతో జరిగిన ఈ పోటీల్లో 200 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు, నాలుగో తరగతి నుంచి ఏడవ తరగతి వరకు, ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు మూడు విభాగాలుగా జరిగిన ఈ పోటీల్లో ఒక్కో విభాగానికి ముగ్గురు చొప్పున 12 మంది విజేతలుగా నిలిచారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక, పికాసో- ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ తరపున సర్టిఫికెట్లు, మొమెంటోలు ప్రదానం చేశారు. విజేతలు గీసిన చిత్రాలు చెకుముకి సైన్స్ మ్యాగజిన్ ఆగస్టు సంచికలో ప్రచురితమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కూకట్‌పల్లి జోన్ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు చల్లా శ్రీనివాసరావు, స్వాతి, గణేష్, షాహిజ్, పికాసో ఆర్ట్స్ స్కూల్ హెడ్ రమేష్ బాబు, ఎస్ఆర్ డిజి సర్దార్ పటేల్ నగర్ శాఖ ప్రిన్సిపాల్ రాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో లబ్ది పొందని వారి సమస్యలు పరిష్కరించాలి



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, శంశిగుడా వార్డు ఆఫీస్‌ను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సందర్శించి, సిబ్బందితో మాట్లాడి, వార్డ్ ఆఫీస్ కార్యకలాపాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్, గ్యాస్‌కు సంబంధించిన పథకాల లబ్ది కోసం ప్రజలు ఎక్కువగా వస్తున్నారని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కాని ఆన్ లైన్ అవ్వక లబ్ది పొందని వారు, రోజూ వార్డ్ ఆఫీస్‌కు వస్తున్నారని అన్నారు. ఈ విషయంన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అర్హులై ఉండి కూడా లబ్ది పొందని వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీస్ ఆపరేటర్ పద్మావతి సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తా



- ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

అంబేద్కర్ నగర్ కాలనీ వాసుల సమస్యలు త్వరగ పరిష్కరిస్తా అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధాత్రి నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో, ఆయన నివాస కార్యాలయంలో, కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని, కాలనీలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా, మిగిలిపోయిన స్మశాన వాటికను త్వరలోనే అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంబేద్కర్ నగర్ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, స్మశాన వాటికను అన్ని హంగులతో సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని, స్నానపు గదులు,మంచి నీటి వసతి, దహన సంస్కరణ వాటిక, సీసీ రోడ్లు వంటి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అదేవిధంగా కాలనీలో విద్యుత్ అంతరాయం కలగకుండా ట్రాన్స్ఫార్మర్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియచేసారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలో మీకు అందుబాటులో ఉంటానని, అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధాత్రి నాథ్ గౌడ్, అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు నాగరాజు, గోపాల్, కేశవ్, బాబీ, సీతారాం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

- ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ పిలుపు



నవతెలంగాణ-ఓయూ

నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని , నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 7100 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, ప్రభుత్వ యూనివర్సిటీలలో వీ.సీ ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మెకానిక్‌ల దినోత్సవం



నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రపంచ మెకానిక్‌ల దినోత్సవం సందర్భంగా బుధవారం బోయిన్‌పల్లి మెకానికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంసరి బజార్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మెకానిక్‌లు కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ మెకానిక్స్ డే అనేది మెకానిక్ నిపుణులు అందించే సేవను గుర్తించడానికి కేటాయించిన రోజు అని చెప్పారు కాగా అన్ని వత్తుల వారు వారి దినోత్సవం నిర్వహించుకుంటారని... కానీ మెకానిక్ లకు గుర్తింపు లేకుండా పోతున్నదన్నారు. కావున వారికి గుర్తింపు వచ్చేందుకు ప్రపంచంలో మెకానిక్ డే నిర్వహించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు బోయిన్‌పల్లి పరిసర ప్రాంతాలలోని మెకానిక్‌లు అందరూ ఒకచోట కలిసి కేక్ కట్ చేసుకుని సంబరాలు చేసుకుంటున్నామని చెప్పారు.

నగరంలో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. మల్టీ జోన్-2 పరిధిలో పని చేస్తున్న 40 మంది పోలీసు అధికారులను బదిలీ చేస్తూ నగర్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బ్రీత్ ఎనలైజర్ ఎత్తుకెళ్లిన నిందితుడు అరెస్ట్

నవతెలంగాణ-కంటోన్మెంట్

గత నెల 27న రాత్రి బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తుండగా బ్రీత్ అనలైజర్ పరికరాన్ని ఎత్తుకెళ్లిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఆల్కహాల్ బ్రీత్ ఎనలైజర్ మిషన్, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రాం పల్లికి చెందిన కొత్తపల్లి శ్రావణ్ కుమార్ అని తెలిసింది. అతను తార్నాకలో నివాసం ఉంటున్నాడు. నిందితునిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కళాశాల యజమాన్యాలపై విచారణ చేపట్టాలి

- వలిగొండ నరసింహ

నవతెలంగాణ-ఓయూ

డొనేషన్ల రూపంలో అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు సిండికేట్ గా మారి, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రాంత ప్రతిభగల విద్యార్థులను, ఉన్నత విద్యకు దూరం చేస్తున్నాయని.. ఆయా ఇంజినీరింగ్ కాలేజీలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ రీసెర్చ్ స్కాలర్ వలిగొండ నరసింహ కోరారు. ఈ మేరకు బుధవారం ఉన్నత విద్య మండలి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్వర్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో జేఏసీ నాయకుల బందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వలిగొండ నరసింహ మాట్లాడుతూ. రాష్ట్రంలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకముందే ఐఐటీ కళాశాలల్లో ర్యాంకులు వచ్చిన విద్యార్థుల చేత ,రాష్ట్రంలో టాప్‌గా పిలవబడుతున్న ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి, గోకరాజు గంగరాజు, నారాయణమ్మ, బీవీఆర్ఐటి, వర్ధమాన్, శ్రీనిధి, ఎంవీఎస్ఆర్, సీబీఐటీ వంటి పలు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల చేత వెబ్ ఆప్షన్స్ ఇప్పించుకుని సీఎస్ఈ,ఏఐఎంఎల్ వంటి పలు బ్రాంచీల అడ్మిషన్లను బ్లాక్ చేయించి, తరువాత అనర్హుల నుంచి లక్షలాది రూపాయలు డొనేషన్ల రూపంలో తీసుకొని అడ్మిషన్ ఇచ్చి, విద్యని వ్యాపారంగా చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతిభగల ఆర్థికంగా వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాల మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంజినీరింగ్ ఉన్నత విద్యను దూరం చేస్తున్న కళాశాల యజమాన్యాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, కోరారు. అన్ని అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో జరిగే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పేర్ల బాలు , రాష్ట్ర సెక్రటరీ మామిడాల రవికుమార్, ఓయూ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



ముదిరాజులకిచ్చిన హామీలను అమలు చేయాలి

- ముఖ్యమంత్రికి ముదిరాజ్ మహాసభ విజ్ఞప్తి

నవతెలంగాణ-బంజారాహిల్స్

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ముదిరాజ్ మహాసభ విజ్ఞప్తి చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రెటరీ గుర్రాల మల్లేష్,అశోక్ ముదిరాజ్‌లు మాట్లాడారు.ప్రస్తుతం బీసీడీ జాబితాలో ఉన్న తమ సామాజిక వర్గాన్ని బీసీ ఏ లోకి మార్చాలని కోరారు. ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీకి వెయ్యి కోల రూపాయల నిధులు కేటాయించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రధాన భూమిక పోషించిన తమ సామాజిక వర్గం పట్ల వివక్ష చూపకుండా మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా బీసీ ఏ జాబితాలో చేర్చేందుకు సుప్రీంకోర్టును సాకుగా చెప్పకుండా రాష్ట్ర బీసీ కమిషన్ ద్వారా ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. కుల వత్తులపై ఆధారపడ్డ తమ సామాజిక వర్గానికి చెందిన పేదలకు పెన్షన్ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి,బల్ల సత్తయ్య,మహిళా ఉపాధ్యక్షురాలు ఉషాదేవి, యూత్ అధ్యక్షులు పండగ బాలు, కార్యనిర్వాకులు కనకయ్య మేడ్చల్ అధ్యక్షుడు ఉపసాగర్, శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యురాలు పులి కల్పన అన్నారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో బియాన్ డోనర్ సంస్థ అందించిన నోటు పుస్తకాలు,పెన్నులు, ఇతర స్టేషనరీ వస్తువులను హమలి బస్తీకి చెందిన 50 మంది గహ కార్మికుల పిల్లలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు.ఇంగ్లీషు బాషలో కంప్యూటర్ లలో నైపుణ్యాన్ని పెంపొందించుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో బియాన్ డోనర్ సంస్థ ప్రతినిధులు శివమణి, వెంకట్, డీబీఎఫ్ మహిళ గహ కార్మికుల సంఘం నాయకులు సుజాత, శశికళ,పరమెశ్వరి,కవిత ,జ్యోతి పాల్గొన్నారు.

పుట్టుక లోపాలను గుర్తించిన

పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ఆటిజం కేసులను గుర్తించి సకాలంలో వైద్య చికిత్స అందించాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- నీలోఫర్ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ- సిటీబ్యూరో

బర్త్ డిఫెక్ట్స్‌తో పుట్టిన పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారి లోపాలను మెరుగుపరిచేందుకు చికిత్స అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను సూచించారు. బుధవారం నీలోఫర్ ఆస్పత్రిని కలెక్టర్ సందర్శించి ఇంటెన్సివ్ కేర్ బ్లాక్, డయాగ్నస్టిక్ ల్యాబ్, రక్త కేంద్రం, క్వాలిటీ కంట్రోల్ రూమ్, సీసీటీవీ, ఫిజియోథెరపీ, పిరియాడికల్ సర్జికల్ వార్డ్, ఆపరేషన్ థియేటర్, కాంప్రహెన్సివ్ లాక్టేషన్ మేనేజ్మెంట్ సెంటర్, ఎస్ఎన్‌సీయూ సెంటర్, నియోనేటాలజీ వార్డ్‌లను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పేషంట్లతో ముచ్చటించి వారికి అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వైద్యులతో మాట్లాడుతూ పుట్టుక లోపాలతో జన్మించిన పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలతో పిల్లలు జీవితాంతం బాధపడకుండా ఉండేందుకు వారికి సరైన చికిత్స అందించాలని ఆదేశించారు. కాన్పు అయినప్పుడే లోపాలతో పుట్టిన పిల్లల సమాచారాన్ని రిజిస్టర్‌తో పాటు ఆన్ లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పిల్లలకు సకాలంలో వైద్య చికిత్స అందించాలన్నారు. నీలోఫర్ ఆస్పత్రిలో కలెక్టర్ ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు దాదాపు 2 గంటల 30 నిమిషాల పాటు అన్ని విభాగాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎస్పీహెచ్ఓలు, ఆర్‌బీఎస్‌కే వైద్యులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో పుట్టుకతో వచ్చే లోపాలను, అన్ని ప్రసవ ఆస్పత్రుల్లో గుర్తించాలన్నారు. గుర్తించిన లోపాలను వెనువెంటనే నీలోఫర్ ఆస్పత్రిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)కు పంపించి అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆర్‌బీఎస్‌కే వైద్యులు వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టి నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. సమాజంలో పెరుగుతున్న ఆటిజం కేసులను సరైన సమయంలో గుర్తించి వారికి సత్వారం చికిత్స అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రసవమవుతున్న చిన్నారులకు పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీలోఫర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ టి.ఉష రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, జిల్లా ఇమ్మ్యూనిసషన్ అధికారి డాక్టర్ శ్రీ కళ, ఆర్ ఎం ఓ కే జ్యోతి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నాగజ్యోతి డాక్టర్ రామ్ రెడ్డి డాక్టర్ కళ్యాణి శ్రీనివాస్, డి గంగా ప్రసాద్, ఆర్ బి ఎస్ కే వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా బంద్

- మరమ్మతుల నేపథ్యంలో జలమండలి నిర్ణయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు 3, 4 ఫేజులకు విద్యుత్తు సరఫరా చేసే 132కేవీ పెద్దాపూర్, కంది సబ్ స్టేషన్లలో టీజీ ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. పనులను 4న గురువారం ఉదయం 7గంటల నుంచి మరుసటి రోజు శుక్రవారం ఉదయం 7గంటల వరకు జరుగుతాయని జలమండలి అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో నీటి సరఫరాలో పలు చోట్ల పూర్తిగా అంతరాయం కలుగుతుందని, పలు చోట్ల లో-ప్రెజర్‌తో నీటి సరఫరా జరగుతుందన్నారు.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

- ఓ అండ్ ఎం డివిజన్ 3 : షేక్ పేట్ (పూర్తి అంతరాయం), భోజగుట్ట రిజర్వాయర్ (లో-ప్రెజర్)

- ఓ అండ్ ఎం డివిజన్ 6 : జూబ్లీహిల్స్, సోమాజిగూడ, బోరబండ (పూర్తి అంతరాయం), బంజారా, ఎర్రగడ్డ (లో-ప్రెజర్)

- ఓ అండ్ ఎం డివిజన్ 9 : మూసాపేట్ (పూర్తి అంతరాయం), కేపీహెచ్ బీ, హైదర్ నగర్ (లో-ప్రెజర్)

- ఓ అండ్ ఎం డివిజన్ 15 : నల్లగండ్ల,చందానగర్, హుడా కాలనీ, హఫీజ్ పేట్ (పూర్తి అంతరాయం)

- ఓ అండ్ ఎం డివిజన్ 18 : మణికొండ, నార్సింగి, మంచిరేవుల (పూర్తి అంతరాయం)

- ఓ అండ్ ఎం డివిజన్ 24 : తెల్లాపూర్, ఓ అండ్ ఎం డివిజన్-8 లోని బల్క్ కనెక్షన్స్ ప్రాంతాల్లో పూర్తిగా నీటి సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాంగోపాల్ పేట డివిజన్ చుట్టాల బస్తీలోని గ్రౌండ్‌లో కమ్యూనిటీ హాల్ లో రూ. 9.50 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. స్థానిక యువత ఈ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పక్కనే ఉన్న వ్యాయామశాల (దంగల్)ను సందర్శించి పరిశీలించారు. వ్యాయామశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని ఈ సందర్భంగా నిర్వహకులు ఎమ్మెల్యే దష్టికి తీసుకు రాగా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ వ్యాయామశాల మరింత అభివద్ధి కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా టాయిలెట్స్, అదనపు గది నిర్మాణం చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా గ్రౌండ్ లో మొక్కలు నాటడం, ఇతర అభివద్ధి పనులు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.



సీవరేజ్ సమస్య గురించి ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు అందజేయాలని అన్నారు.కార్పొరేటర్ సచిత్ర, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, డీసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు మొక్కను అందజేసిన విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వన మహోత్సవం లో భాగంగా బుధవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎమ్మెల్యేకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు, అంతస్తులు కాదని.. కాలుష్య రహిత వాతావరణం, ఆరోగ్యం తమైన జీవితం అని చెప్పారు. విరివిగా మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెంపొందుతుందని, తద్వారా సకాలంలో వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని కోరారు. గౌతమ్ స్కూల్ డీన్ కల్పన, ప్రిన్సిపాల్ యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మోకాలి నొప్పులతో బాధపడుతున్న వారికి

ఎపిసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్

- తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో...



నవతెలంగాణ-బేగంపేట్

యువతలో కార్టిలేజ్ గాయాల కారణంగా తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న వారికి ఏపీసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్ శస్త్ర చికిత్స ద్వారా మోకాలు మార్పిడి చేయకుండానే దెబ్బతిన్న కార్టిలేజ్ భాగాన్ని తిరిగి అమర్చే ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఈ టెక్నాలజీ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా బేగంపేట కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో 40 సంవత్సరాల వ్యక్తికి సర్టిఫైడ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్, ఆర్థోపెడిక్, ఆర్థోస్కోపి సర్జన్ డాక్టర్ కుషాల్ హిపాల్ గోవాంకర్, స్టాక్‌హోమ్ లోని కేరోలిన్ స్కా ఇన్స్టిట్యూట్ మాజీ ప్రొఫెసర్, ఏపీ సర్ఫ్ మెడికల్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ లైఫ్ రీడ్ తో కలిసి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు.

యువతలో కార్టిలేజ్ గాయాల కారణంగా మోకాలు నొప్పి ఎంతగానో కంగదీస్తుంది. ఇలాంటి వారికి ఎపిసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్ ఫోకల్ ఆస్టియోకాండ్రల్ లోపాలు, ఆస్టియో ఆర్థరైటిస్ గాయాల చికిత్సల కోసం నిర్దిష్టమైన ఇంప్లాంట్స్‌తో కూడిన టెక్నాలజీని ఏపీసర్ఫ్ మెడికల్ అభివద్ధి చేసింది. కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స వరకు వెళ్లకుండా చూడటం, లేదా ఆలస్యం చేయడం ఈ పద్ధతి ద్వారా చేయవచ్చు. ఏపీసీలర్ మోకాలు ఇంప్లాంట్ ను ఎమ్మారై స్కాన్ ఆధారంగా రూపొందిస్తారు. డేటా ప్రాసెసింగ్ ద్వారా దెబ్బతిన్న మోకాలి ఉప్పరితలాన్ని వర్చువల్ 3డీ మోడల్ తయారుచేసి గాయాన్ని నిర్ధారిస్తారు. ఏపీసీలర్ పరికరాలతో దెబ్బతిన్న కణజాలాన్ని తొలగించడానికి ఆ ప్రాంతానికి సరిగ్గా సరిపోయే విధంగా ఇంప్లాంట్స్ తయారుచేస్తారు, ఇలా తయారు చేసిన తర్వాత శస్త్ర చికిత్స సమయంలో ఇంప్లాంట్ అమెరికాలో కచ్చితంగా పెరుగుతుంది.

బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కుషాల్ మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న మోకాలు గాయాలకు ఆధునికంగా అందుబాటులోకి వచ్చిన ఎపిసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్ శస్త్ర చికిత్స ద్వారా యుక్త వయసులోనే మోకాలు మార్పిడి వరకు వెళ్లకుండా చూడవచ్చని తెలిపారు. ఏపీసీలర్ అనేది స్వీడన్ నుంచి కష్టం మేడ్ ఇంప్లాంట్ అని తెలిపారు. ఈ శస్త్ర చికిత్స తర్వాత రోగి సాధారణ జీవితం గడుపుతారన్నారు. ఈ పద్ధతి ద్వారా విదేశాల్లో వందలాది మంది రోగులకు ప్రయోజనం చేకూరిందని ఇప్పుడు భారత్‌లో తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సన్ షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్స్టిట్యూట్ చైర్మెన్, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ వి గురవారెడ్డి మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ రోగులకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు కిమ్స్ సంక్షేమ హాస్పిటల్ కృషి చేస్తుందని తెలిపారు. ఎపిసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్ పద్ధతిలో యుక్త వయసులో దెబ్బతిన్న కార్టిలేజ్ సైజును సీటీ స్కాన్ ద్వారా 3డీ ఇమేజ్ స్వీడన్‌కు పంపి అక్కడినుంచి ప్రత్యేకంగా తయారు చేసిన ఇంప్లాంట్ల సాయంతో రోగికి దెబ్బతిన్న కార్టేజ్ భాగంలో అమర్చడం జరిగిందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ సీఓఓ సుధాకర్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోర్డు పరిధిలోని అన్ననగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని బుధవారం ప్రతినిధులు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమలా నగర్ గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించేందుకు సీఎంతో చర్చించండి

- ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతి పత్రం అందజేసిన లైబ్రేరియన్లు



నవతెలంగాణ-బంజారా హిల్స్

నియామకమైనప్పటి నుంచి కేవలం లైబ్రేరియన్ లుగానే కొనసాగుతున్న తమకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేయాలని ప్రొఫెసర్ కోదండరాంకు లైబ్రేరియన్లు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన కోదండరామ్‌ను తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రేరియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలు నాయక్, శివకుమార్ల ఆధ్వర్యంలో బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. జూనియర్ కాలేజీలలో లైబ్రరీగా నియామకమైన తాము పదవి విరమణ వరకు ఒకే క్యాడర్‌లో కొనసాగాల్సి వస్తున్నదని ఆయనకు వివరించారు. ఎంతోకాలంగా పదోన్నతుల కోసం ప్రయత్నిస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం న్యాయం జరుగుతుందని భావించినా నిరాశ మిగిలిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ప్రయత్నాలు ప్రారంభించామని చెప్పారు. తమ సమస్యను ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. అందుకు కోదండరాం తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు బాలునాయక్ తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో లైబ్రరీయన్‌లు మంజు నాయక్,రాములు నాయక్,స్రవంతి, జ్యోతి, గోపాల్ తదితరులు ఉన్నారు.

స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్



- ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులు
- ఆకట్టుకున్న ప్రాజెక్ట్ నమూనాలు

నవతెలంగాణ-ఓయూ

స్టానీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్ షాప్ ఎక్స్‌పో-2024 ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎం. కుమార్ (డీన్ ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్) ప్రొఫెసర్ డి. కరుణాసాగర్ (డీన్ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఉస్మానియా యూనివర్సిటీ) హాజరయ్యారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులు వివిధ రకాలైన ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలలో రోబోటిక్ టెక్నాలజీ, సెక్యూరిటీ డిటెక్టర్స్, రీఛార్జిబుల్ మిషన్స్, స్మార్ట్ డస్ట్ బిన్స్, సైబర్ సెక్యూరిటీ మొదలగు నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎం. కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను సాధించాలని, అనేక రకాలైన వస్తు సేవలను ఉత్పత్తి చేయాలని అన్నారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ తదితర రంగాలు ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని తెలియజేశారు. విద్యార్థులు ఆసక్తి కలిగి అనేక రకాలైన సైన్స్ పుస్తకాలను చదవాలని, రీసెర్చ్ ఆర్టికల్స్‌ను అధ్యయనం చేయాలని కోరారు. విద్యార్థులు తాము నేర్చుకున్న జ్ఞానం సమాజానికి ఉపయోగపడాలని తెలియజేశారు. ఈ వర్క్ షాప్ ఎక్స్‌పోకు డాక్టర్ కే రాజేష్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్) కన్వీనర్‌గా వ్యవహరించారు. సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కే. కృష్ణారావు , మేనేజ్మెంట్ మెంబర్స్ ప్రదీప్ రెడ్డి , రాకేష్ రెడ్డి , కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ వినయ్ బాబు , ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక , డైరెక్టర్స్ డాక్టర్ వి అనురాధ, డాక్టర్ ఏ కనకదుర్గ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రమేష్ పాల్గొన్నారు. విద్యార్థులు అధ్యాపకులు, విద్యార్థులు నమూనాలను పరిశీలించారు.విద్యార్థులు పరిశోధన ఆలోచనతో చేసిన ప్రాజెక్టులు అబ్బుర పరిచాయి..

అయోమయంలో కంటోన్మెంట్ ఉద్యోగులు

- తమను పట్టించుకోవడం లేదని ఆందోళన
- సమస్య పరిష్కారానికి ఢిల్లీ బాట పట్టిన యూనియన్ నాయకులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీ విలీనం చేసే ప్రక్రియను అధికారులు ముమ్మరం చేస్తుండడంతో కంటోన్మెంట్ ఉద్యోగులు అయోమయ పరిస్థితిలో ఉండి ఆందోళన చెందుతున్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ అటు కేంద్ర శాఖ అధికారులు పరిస్థితులను పట్టించుకోవటం లేదని ఆందోళన చెందుతున్నారు. విలీనం విషయంపై ముమ్మరంగా పావులు కలుపుతున్నా. తమ విషయం ఎవరూ పట్టించుకోవటం లేదని ఆందోళన చెందుతున్నారు. జీహెచ్ఎంసీలో విలీనం అయితే కారుణ్య నియామకాలు ఏ విధంగా జరుగుతాయి ఇంకా గ్రేడింగ్, జీతభత్యాలు హోదాలు విషయంపై కూడా అధికారులు ఇంతవరకు ప్రస్తావించటం లేదని విచారిస్తున్నారు. దీంతో ఇటీవలనే యూనియన్ నాయకులు మాజీ కార్యదర్శి సీనియర్ బీజేపీ నాయకుడు పరశురాం ఆధ్వర్యంలో ఢిల్లీ బాట పట్టారు. అక్కడ మల్కాజిగిరి పార్లమెంటరీ సభ్యులు ఈటల రాజేందర్‌ను కలిసి వారి సమస్యలు చెప్పుకున్నారు .కంటోన్మెంట్ ఉద్యోగులు ఇప్పటికీ కంటోన్మెంట్‌లో కారుణ్య ఉద్యోగాలు నియామకాలు పెండింగ్ లో ఉన్నాయని అవి ఇంకా పూర్తి కాలేదని జీహెచ్ఎంసీలో కలిస్తే వాటి పరిస్థితి ఏమిటి అని కూడా వారు పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌కు వివరించారు. ప్రస్తుతం కంటోన్మెంట్ బోర్డులో పనిచేస్తున్న సిబ్బందికి లక్షల్లో వేతనాలు ఉన్నాయని, జీహెచ్ఎంసీలో కలిస్తే వారి వేతనాలు ఏ విధంగా ఉంటాయి అన్న విషయం కూడా వారు ఈటలతో చర్చించినట్టు సమాచారం. అయితే విలీనం కంటే ముందు ఉద్యోగుల సమస్యను కూడా పరిష్కరించాలని వారు పార్లమెంట్ సభ్యులకు, రక్షణ శాఖ అధికారులకు వినతి పత్రాలను కూడా అందజేశారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో యూనియన్ అధ్యక్షుడు మహేందర్ ఇంకా పలువురు ప్రతినిధులు ఉన్నారు.

నేడు విద్యా సంస్థలు బంద్

- కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల భారత్ బంద్ ను విజయవంతం చేయండి
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్

నవతెలంగాన-సిటీబ్యూరో

నేడు నిర్వహించనున్న విద్యా సంస్థలు బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ పిలుపునిచ్చారు. నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజ్ పై, అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి, నీట్ పరీక్షను మళ్ళీ నిర్వహించాలని, ఎన్‌టిఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నీట్ విద్యార్థుల పట్ల ఎన్‌డిఏ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త విద్య సంస్థల బంద్‌నకు పిలుపునిచినట్టు తెలిపారు.నీట్ పరీక్షలో పేపర్ లీక్ అవకతవకలు జరిగాయని దేశమంతా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యాన్ని మరవక ముందే మొన్న దేశవ్యాప్తంగా నిర్వహించిన యుజీసి- ఎన్ఎటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడాడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లో మొత్తం 23 లక్షల 33 వేల 297 మంది, యుజీసి-ఎన్ఎటి పరీక్షల్లో మొత్తం 11 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని, యుజీసి-ఎన్ఎటి రద్దు చేయడం వెనుక నీట్ అవకతవకలను మరిపించడం కోసమేననే అనుమానాలు కలుగుతున్నాయని ఆరోపించారు. నీట్, యుజీసి-ఎన్ఎటి పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జ్ చేత న్యాయ విచారణ జరిపించాలని, పరీక్ష కుంభకోణంకు బాధ్యత వహిస్తూ వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని, కేంద్ర పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పజెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నుంచి ఇప్పటివరకు విద్యార్థి సంఘా నేతల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, యూనివర్సిటీలలో స్వేచ్ఛ వక్రీకరణ



ప్రజాస్వామ్యం అణిచివేత చర్యలు ఆపాలి. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్రాలకే నిర్వహించేలా అప్పజెప్పాలి. పాఠశాలలో విద్యార్థులు లేరని పాఠశాల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని వారు డిమాండ్ చేశారు. ఈ బంద్ విజయవంతంకై పాఠశాలల, కళాశాల యజమాన్యం సహకరించి స్వచ్ఛందంగా బంద్ చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎంఐజీ కాలనీలలో పెట్రోలింగ్ పెంచి ఆకతాయిలపై నిఘా పెంచాలి
- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్
- భరత్‌నగర్ కాలనీలో పర్యటన

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ ఎంఐజీ కాలనీలో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ అన్నారు. స్థానిక డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీలోని ఎంఐజీ పార్క్ వసతుల కల్పన కోసం జీహెచ్ఎంసీ ఏఈ పవన్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సతీష్ గౌడ్ మాట్లాడుతూ కాలనీలోని రాత్రి సమయాల్లో ఆకతాయిలు పార్క్ సమీప పరిధిలో కొందరు ఆకతాయిలు తాగిన మైకంలో అరుపులు, కేకలు చేస్తూ అలజడి సృష్టిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సనత్ నగర్ సీఐ పురుషోత్తంరెడ్డికి ఫోన్ చేసి పార్కులో ఆకతాయిల ఆగడాల నివారణకు బస్తీలను ముమ్మరం చేయాలని కోరారు. సీఐ పురుషోత్తంరెడ్డి పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తానని, ఆకతాయిల కదలికలను గుర్తించడం కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా సరే సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, సాంబశివారెడ్డి, వినయ్, ఉమావతిగౌడ్, జ్యోతిగౌడ్, పుతిలీ బేగం తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ ఆకస్మిక తనిఖీ



నవ తెలంగాణ- సిటీ బ్యూరో

దారుషిఫా డిప్యూటీ ఈవో కార్యాలయంతో పాటు రేఫా - ఈ - ఆన్ పాఠశాలలో ఉన్నా బహదూర్‌పుర బుక్ స్టోరేజీ పాయింట్‌లను బుధవారం హైదరాబాద్ డీఈవో ఆర్. రోహిణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో అన్నీ స్కూళ్లకు బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ అందయో లేదో అడిగి తెలుసుకున్నారు. మిగిలి ఉన్న పుస్తకాలను వెంటనే వేరే మండలాల్లో అవసరమున్న చోటుకి పంపాలని మండల అధికారులను ఆమె ఆదేశించారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు రెండు రోజులు లో అందజేయాలని, అలసత్వం వహించే అధికారులు, పాఠశాల హెచ్ఎంలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే స్టాక్ రిజిస్టర్ కరెక్ట్ గా మెయింటైన్ చేయలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బహదూర్‌పుర డిప్యూటీ ఈవో సత్యవతి, డిప్యూటీ ఐఓఎస్ కలీల్, కోఆర్డినేటర్ ఎస్.రజిత, సీనియర్ అసిస్టెంట్ ముక్తాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఉప్పల్

దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని బుధవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే బాలునాయక్ నివాసంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల సమక్షంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో దేవరకొండ మండలం ఉమ్మడి ముదిగొండ మాజీ ఎంపీటీసీ వడ్త్య బిక్కునాయక్, సూర్యతండ మాజీ సర్పంచ్ నేనావత్ నారాయణ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలు నాయక్ చేత కేక్ కట్ చేయించారు. ఎమ్మెల్యేకు కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ కు మంత్రివర్గ విస్తరణలో భాగంగా మంత్రి పదవి దక్కేలా చూడాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించేలా, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందేలా భగవంతుడు ఆశీస్సులు అందించాలని వారు భగవంతుడిని ప్రార్థించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉమ్మడి ముదిగొండ మాజీ ఎంపీటీసీ వడ్త్య బిక్కునాయక్, సూర్యతండ మాజీ సర్పంచ్ నేనావత్ నారాయణ నాయక్ తో పాటు మాజీ సర్పంచ్ లక్ష్మణ్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

లాగిన్ పాయింట్లను ఎప్పటికప్పుడు క్లియర్..



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పలు చోట్ల నిలుస్తున్న నీటిని డీఆర్ఎఫ్, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాయి. మంగళవారం రాత్రి నగరంలో పలుచోట్ల కురిసిన వర్షానికి నీరు నిలిచిన ప్రాంతాల్లో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాల నీరు నిలిచిన ప్రాంతాలలో నీటిని తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూశారు. ఈ.సీ.ఐ.ఎల్ ఎక్స్ రోడ్, కాప్రా, ఏ.ఎస్.రావు నగర్, బేగంపేట్, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తమై వాటర్ లాగిన్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని తొలగించారు. నగర వ్యాప్తంగా 238 స్థాటిక్ 154 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు పని చేస్తున్న విషయం తెలిసిందే.

యాంటీ డ్రగ్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

యాంటీడ్రగ్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం సమాజాన్ని మేల్కొల్పుదాం' అనే అంశంతో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 31 వరకు ప్రభుత్వం, ప్రైవేట్ హైస్కూల్స్, జూనియర్ కాలేజీలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలల్లో యాంటీ డ్రగ్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంద ర్భంగా బుధవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఆహ్వాన సంఘం చీఫ్ పాట్రన్స్ డీ.జీ.నరసింహా రావు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.మారన్న, టీ.రఘు, పీ.మల్లేష్ నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌ను కలిశారు. యాంటీడ్రగ్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూళనకు మీ వంతు కృషి చేయడం అభినందనీయమన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

2018లో జీఓ 510లో నష్టపోయిన 4వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఎన్.హెచ్.ఎం. కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ ఏఐటీయూసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం బృందం కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్ ఎంలో పనిచేస్తున్న ఉదోగులను 17514 మంది ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ విషయంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

డ్రయినేజీ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూస గోరఖ్నాథ్



నవతెలంగాణ-ముషీరాబాద్

డ్రయినేజీ సమస్యపై స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూస గోరఖ్నాథ్ ముషీరాబాద్ డివిజన్ గంగ పుత్ర కాలనీ వాసులు గత 30 సంవత్సరాల నుంచి డ్రయినేజీ వ్యవస్థ సక్కగా లేక ఇబ్బంది పడటంతో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జై సింహ చొరవతో సీవరేజి కొత్త లైన్ పైపులు రావడంతో గంగపుత్ర కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

అనుమానస్పదంగా కనిపించిన బాలుడిని చేరదీసిన నాంపల్లి రైల్వే పోలీసులు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అనుమానస్పదంగా కనిపించిన బాలుడిని నాంపల్లి రైల్వే పోలీసులు చేరదీశారు. బుధవారం నాంపల్లి ప్రభుత్వ రైల్వే స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ వివరాలను వెల్లడించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా నాంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నెంబర్ 4 వద్ద తనిఖీలు చేస్తుండగా బాలుడిని గమనించి అదుపులోకి తీసుకున్నామన్నారు. జై కిసాన్ మండల్ (15) తొమ్మిదవ తరగతి, ఒడిస్సా రాష్ట్రం బాలేశ్వరి జిల్లా సిమ్లా తానాకు చెందిన గుర్తించామన్నారు. అతను హైదరాబాద్ చూసేందుకు వచ్చానని చెప్పానని తెలిపారు. అతని సమాచారాన్ని బాలుడిని తల్లిదండ్రులకు తెలియజేశామన్నారు. అప్పటివరకు చైల్డ్ హెూమ్ సూపర్వైజర్ సి.అశోక్ కుమార్ అప్పగించామని తెలిపారు.

'సన్‌ప్యూర్' మార్కెటింగ్ ప్రచారం ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద ఎడిబుల్ ఆయిల్ బ్రాండ్, సన్‌ప్యూర్ తన తాజా మార్కెటింగ్ ప్రచారాన్ని ప్రారంభించినట్టు ప్రకటించింది. ఈ వాణిజ్య ప్రకటనలో మాస్టర్‌చెఫ్ ఇండియా సీజన్ 8 విజేత మహ్మద్ ఆషిక్, ప్రముఖ టెలివిజన్, కన్నడ సినీ నటి మేఘా ఎస్ ఉన్నారు. ఈ ప్రచారం గురించి ఎంకె ఆగ్రోటెక్ ప్రయివేటు లిమిటెడ్ సీవోవో శ్రీధర్ వైద్యనాథన్ మాట్లాడుతూ "ఈ ప్రచారం రుచి, నాణ్యత ఖచ్చితమైన సమ్మేళనాన్ని మాత్రమే కాకుండా, రసాయన రహిత సన్‌ప్యూర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్రయోజనాలను కూడా వివరిస్తుంది" అని తెలిపారు.

వికలాంగుల పింఛన్‌ను పెంచాలి

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ ఆరు వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ వాటా రూ. 300 లను రూ. 3 వేలకు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వికలాంగ హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట జరిగిన నిరసనల్లో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ఎన్‌పీఆర్‌డీ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011 నుంచి కేంద్ర ప్రభుత్వం వాటా పెన్షన్ లలో కేవలం రూ.300లు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుతం ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని, ధరల పెరుగుదల సూచి ఇండెక్స్‌కు పెన్షన్స్‌ను అనుసంధానం చేసి ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న పెన్షన్ వాటాను రూ. 3000కు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పెన్షన్ రూ. 6000కు పెంచి వెంటనే అమలు చేయాలని కోరారు. 2024 జనవరి నుంచే పెరిగిన పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి 7 నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పెన్షన్స్ పెంపు కోసం 44,49,767 మంది లబ్దిదారులు ఎదురు చూస్తున్నారని, కొత్త దరఖాస్తులు సుమారు 24.84 లక్షల మందికి ఇప్పటికీ పెన్షన్ మంజూరు కాలేదని తెలిపారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్స్ మంజూరుకు ఆదాయ పరిమితి విధిస్తూ జీవో 17ను విడుదల చేసిందని గుర్తు చేశారు. దీన్ని వెంటనే రద్దు చేయాలని, 2015కంటే ముందు సదరం సర్టిఫికెట్ పొందిన వారి ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకునే అవకాశం లేదని, 2015 కంటే ముందు ఇచ్చిన సదరం సర్టిఫికెట్స్‌లను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. హైదరాబాద్ సౌత్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.శశికళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల గుర్తింపు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోపు పెన్షన్స్ పంపిణి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటిన్లలో వికలాంగులకు 5శాతం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని, తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలావేన్స్ కోసం లబ్దిదారుల గుర్తింపు పక్రియను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి నాగమణి, హైదరాబాద్ జిల్లా నాయకులు రాజు, సంజీవ, నర్సింగ్, కుమార్, మమత, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్‌ను రూ.3వేలకు పెంచాలి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే రూ.300తో వికలాంగులు ఎలా విధంగా బతుకుతారనీ, ఈ రూ. 300 పెన్షన్‌ను రూ.3వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు మెమోరండం అందజేశారు.ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని రాష్ట్ర సర్కార్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిందనీ, ప్రభు త్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా హామీ అమలు చేయ డం లేదన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, లక్ష్మీపతి, సహాయ కార్యదర్శి మల్లేష్, విజయ లక్ష్మి, రమేష్, షైన్ బేగం, నవ్య, భాను, బ్రహ్మయ్య, కోటయ్య, మన్నాన్, చంద్రయ్య, సుల్తాన్, రమేష్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాబినెట్ విస్తరణలో లంబాడీలకు అవకాశం కల్పించాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్



నవతెలంగాణ-ముషీరాబాద్

క్యాబినెట్ విస్తరణలో లంబాడిలకు అవకాశం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బాగ్‌లింగంపల్లిలో విలేకరుల సమావేశంలో నరసింహ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 10 శాతం పైగా ఉన్న లంబాడీలకు ఒక్కటంటే ఒక్క మంత్రి పదవిని కూడా దక్కలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని అధికారం వస్తే సంపండ కులాలకు రాజ్యాధికారం వస్తుందని రాజ్యాధికారం కోసమైనా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చి తీరా అధికారం రాగానే 10% పైగా ఉన్న లంబాడాలకు మొండి చేయి చూపించారని ఇప్పుడైనా రేపో మాపు జరగబోయే క్యాబినెట్ విస్తరణలో లంబాడీలకు అవకాశం కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కనకాల శ్యాం కుర్మా, విక్రం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పానుగంటి విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని వేధించిన సీఐపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఐ ఎస్సీ కులానికి చెందిన వాడు కాబట్టే చిన్నచూపు
- తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మెన్ చెరుకు రాంచందర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎస్ఐని వేధించిన సీఐపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మెన్ చెరుకు రాంచందర్ ఆరోపించారు. ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఎస్సీ మాల కులానికి చెందిన వాడు కాబట్టే సీఐ జితేందర్ రెడ్డి అవమానాలకు గురిచేస్తూ చిన్న చూపు చూస్తున్నాడన్నారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌ను అకారణంగా సీఐ జితేందర్ రెడ్డి ఇబ్బందులకు గురి చేస్తూ అనేక విధాలుగా అవమానాలకు గురి చేయడంతోనే ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్యకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. సీఐ జితేందర్‌రెడ్డి వేధింపులు తాళలేక ఆత్మహత్యయత్నం చేసి ప్రస్తుతం యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీగా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఎస్ఐ శ్రీనివాస్‌కు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఐ జితేందర్ రెడ్డి ఇల్లీగల్ భూములకు సపోర్ట్ చేస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతూ పోలీస్ సిబ్బంది ముందే ఎస్ఐ శ్రీనివాస్‌ను అవమానపరచడం సిబ్బంది, ఎస్ఐ మాటలను వినకుండా విధులు నిర్వర్తించకుండా ఎస్ఐని లెక్క చేయకపోవడం శోచనీయమన్నారు. సీఐతో పాటు పోలీస్ సిబ్బంది కూడా ఎస్ఐని అవమానపరచి టార్చర్‌కు గురి చేశారని ఆరోపించారు. అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ సీఐ జితేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిపై పోలీస్ ఉన్నతాధికారు లు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఐ శ్రీనివాస్‌కు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయ న హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మెన్ బేర బాలకిషన్, వైస్-చైర్మన్ ఎస్. నాను, దాసరి సత్యనారాయణ, బి.యాదయ్య, వెంకటే శ్వర్లు, చంద్రశేఖర్, నాయకులు బిట్ల శ్రీనివాస్, దాసరి భాస్కర్, ఆర్.మల్లేష్, తాలూకా అనిల్, శ్రీకాంత్, రమేష్, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి సైకాలజిస్టులకు శిక్షణ తరగతులు

- తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

21 నుండి ట్రాంజాక్షనల్ అనాలసిస్ నందు సైకాలజిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతైన మానవ సంబంధాల గతిశీలతను అర్థం చేసుకోవడానికి, వ్యక్తి విజేతగా నిలవడానికి 'ట్రాం జాక్షనల్ అనాలసిస్' ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సైకాలజిస్టుల నైపుణ్యాభివృద్ధే ధ్యేయంగా తమ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ సభ్యుల నైపుణ్యాల పెంపుదలకు నిరంతర కౌన్సిలింగ్ విద్య పేరుతో కౌన్సిలింగ్ నందు శిక్షణ తరగతులను అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 21న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు హైదరాబాద్‌లో 'ట్రాంజాక్షనల్ అనాలసిస్' (మానవ సంబంధాలు, వారి వ్యక్తిత్వ విశ్లేషణ) నందు శిక్షణ అందిస్తున్నామన్నారు. వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలు పెంపొందించుటకు ఇది ఒక సాధనమన్నారు. ఆచరణాత్మక, శక్తివంతమైన అనువర్తిత మానసిక సాధనం, మానవ సంబంధాలు, సైకో థెరపీ, విద్యా, ప్రేరణా శిక్షణ కార్యక్రమాల యందు ఉత్తమ ఫలితాల కోసం ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి వివిధ నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి ఈ వర్క్ షాప్ అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సైకాలజిస్టులే కాకుండా నాన్ సైకాలజిస్టులు, ప్రొఫెషనల్స్, స్టూడెంట్స్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆసక్తి కలిగి ఉండి స్వయంగా అభివృద్ధి చెందాలనుకునే వారు హాజరు కావచ్చు నని ఆయన తెలిపారు.పూర్తి వివరాలకు 9533660938 ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరని కోరారు.

నేడు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

- విద్యార్థి సంఘాల నాయకుల పిలుపు
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

నేడు విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, పీడీఎస్‌యు, విజేఎస్, డీఎఫ్ఐ, ఏఐవైఎఫ్, వై జెఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశంలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో లక్షల రూపాయలకు నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ చేసి 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెలగాటం ఆడిందని దేశవ్యాప్త ఆందోళనలు జరిగిన దేశ ప్రధాని ఇప్పటి వరకు స్పందించలేదని బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో స్పష్టంగా కండ్లకు కట్టినట్టుగా కనిపిస్తున్న పరిస్థితి ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా నేడు జరిగే దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు ప్రయివేట్ యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, పీడీఎస్ యు నాయకులు శ్రీను, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావిద్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి సాయి కృష్ణ, నాయకులు శ్రీమన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడిని అరికట్టాలి

- కార్మికులకు జీఓ నెంబర్ 60ని సక్రమంగా అమలు చేయాలి
- కోఠి డీఎంఈ కార్యాలయం ముందు ఏఐటీయూసీ భారీ ధర్నా



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడిని అరికట్టాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహాలు అన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయుచున్న కాంట్రాక్ట్, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన వేతనాలు సక్రమంగా చెల్లించకుండా జీఓ నెంబర్ 60 నీ టెండర్ షెడ్యూల్‌లో పెట్టి దానిని అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మిక చట్టాలను అమలు చేయకుండా కార్మికుల్ని శ్రమదోపిడికి గురి చేస్తున్నారన్నారు. బుధవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కాంట్రాక్టర్ల కింద దాదాపు 20 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేయుచున్నారని 2022లో టెండర్ పిలిచినటువంటి సందర్భంలో వారికి జీఓ నెంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లిస్తామన్నారు. కానీ జీఓ నెంబర్ 60 ప్రకారం కార్మికులకు రూ.13,600 జీతం రావాల్సి ఉందని తెలిపారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నటువంటి ఏ ఆస్పత్రిలో కూడా ఈ వేతనాలు అమలు కావటం లేదని మండిపడ్డారు. అప్పటి అధికారులు టెండర్‌లో జీఓ నెంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లిస్తున్నట్లు పొందుపరిచి దానిని అమలు చేయకుండా వేరొక సర్క్యులర్ తీసుకురావడం ద్వారా కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ సర్కులర్ ప్రకారం కూడా రూ.12 వేల రావాల్సి ఉన్నప్పటికీ అది కూడా వారికి చెల్లించటం లేదన్నారు. అన్ని విధాలుగా కాంట్రాక్టు కార్మికుల్ని కాంట్రాక్టర్లు, అధికారులు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ ఉస్మానియా, నీలోఫర్ లాంటి పెద్ద ఆస్పత్రుల్లో పడకలకు సరిపడా కార్మికుల్ని నియమించకుండా తక్కువ మంది కార్మికులతో పని చేయించుకుంటూ పని భారాన్ని పెంచుతున్నారన్నారు. టీవీవీపీ ఆస్పత్రుల్లో స్థానిక డీసీహెచ్ఎస్‌లో కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయ్యి కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు సైతం అమలు చేయకుండా పనిచేయించుకుంటున్నారని అలాంటి వారిపై కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్‌కు మెమోరండం అందజేశారు. కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం నాలుగు పండుగ సెలవులు, నాలుగు జాతీయ సెలవులు, 16 ఆర్జిత సెలవులు మొత్తం 23 సెలవులు ఇవ్వాల్సి ఉన్న వాటిని సైతం ఇవ్వకుండా అన్యాయంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్మికులకు 3200 పిఎఫ్ జమ చేయాల్సి ఉండగా కేవలం 1500 మాత్రమే పిఎఫ్ జమ చేస్తూ పీఎఫ్ డబ్బులు సైతం కాంట్రాక్టర్లు తింటున్నారని అధికారులకు దృష్టికి తీసుకువచ్చారు. కార్మికులతో నిత్యం అనేక పనులు చేయించుకుంటున్నటువంటి అధికారులు వారికి రావలసిన జీతం ఇప్పించడంలో ఆస్పత్రుల అధికారులు పట్టించుకోవడంలేదని కోరారు. సమస్యలు పరిష్కరించుకుంటే రాబోయే రోజుల్లో సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, టీవీవీపీ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఓమయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తోటా రామాంజనేయులు, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, రాష్ట్ర కార్యదర్శులు పి సురేష్, ఎస్ కిష్టమ్మ, ఏఐటీసీ నాయకులు సిరా దేవేందర్,వినోద, జె లక్ష్మీసర్వేశ్వర్, మదన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మూసీ సుందరీకరణ పేరుతో

పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదు




- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.అబ్బాస్

నవతెలంగాణ-ధూల్‌పేట్

మూసీ సుందరీకరణ పేరుతో పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్ అన్నారు. గోల్కొండ మండలంలోని రాందేవ్ గూడా, పద్మా నగర్ కాలనీలలో ఆయన సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి విఠల్, నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనేక సంవత్సరాలుగా పనులు చేసుకుంటూ సంపాదించిన డబ్బుతో, గ్రామాల్లో భూములమ్ముకొని వచ్చిన డబ్బుతో 50 గజాల స్థలాలు కొనుక్కొని, బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకొని ఇక్కడ ఇండ్లు నిర్మించుకున్నామని, ప్రభుత్వం అకస్మాత్తుగా మా ఇండ్లను లాక్కోవడానకి ప్రయత్నం చేస్తుందని స్థానికులు తమ గోడు వెలుబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు వల్ల మూసీ ఇరువైపులా ఉన్న వేలాదిమంది పేదలకి అన్యాయం జరిగే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ అధికారుల సర్వేలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం ప్రజల అనుమానాలను నివృత్తి చేసి, పేదలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం మూసీ సుందరీకరణకు వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నదని, ఆ నిధులు పేదల అభివృద్ధికి ఉపయోగపడేలాగా చూడాలన్నారు. మూసీకి ఇరువైపులా అనేకమంది పేదలు సంవత్సరాల తరబడి నివాసం ఉంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించకుండా, వారితో చర్చించకుండా, స్థానిక బస్తీ కమిటీలను, రాజకీయ పక్షాలను సంప్రదించకుండా ఏకపక్షంగా బస్తీ సర్వేలు చేయడం సరైనది కాదన్నారు. ఇది ప్రజలన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నదన్నారు. ప్రభుత్వం వెంటనే దీనిపైన స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పట్టా భూములలో ఇండ్లు నిర్మించుకున్న వారు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపైన ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న దాదాపు 20వేల కుటుంబాల వరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వలన నష్టపోయే అవకాశం ఉందన్నారు. సీపీఐ(ఎం) పార్టీ వీరందరినీ సమీకరించి వారికి తగు న్యాయం జరిగేలాగా కృషి చేస్తుందని అన్నారు. లేదంటే సీపీఐ(ఎం) పార్టీ పేద ప్రజలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోదని, వాళ్ళ పక్షాన పోరాటం చేసి వాళ్ళకి న్యాయం జరిగేలాగా పోరాటం చేస్తామని చెప్పారు.

కొలెస్ట్రాల్ ఎక్కువైతే..

- కొంతమందికి అకస్మాత్తుగా కాలి, చీలమండల వాపు వస్తాయి. ఇవి కూడా అధిక కొలెస్ట్రాల్ సంకేతాలు కావచ్చు. కాబట్టి ఆలస్యం చేయకుండా అనుభవజ్ఞులైన వైద్యుల సలహాతో రక్తపరీక్ష చేయించుకోవాలి.
- చలికాలం, ఎండాకాలం, వర్షాకాలం ఇలా అన్ని కాలాల్లోనూ రాత్రిపూట పాదాలు రోజూ చల్లగా మారుతుంటే.. అప్రమత్తంగా ఉండాలి. రక్తంలో కొలెస్ట్రాల్ పెరిగితే శరీరంలో రక్తప్రసరణ సరిగా జరగదు.
- అధిక కొలెస్ట్రాల్ స్థాయిల మొదటి లక్షణం కొద్దిగా నడిచినా లేదా కొంచెం వ్యాయామం చేసినా ఆయాసం రావటం.



రక్తంలో కొలెస్ట్రాల్ పెరిగితే, రాత్రిపూట పాదాలు నిరంతరం చల్లగా ఉంటాయి.
- చాలా మందికి అరికాళ్లలో మంట అనిపిస్తూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కొలెస్ట్రాల్ పెరగడం వల్ల కూడా ఈ సమస్య రావచ్చు. ■

భరించలేక పోతున్నారా?

మారుతున్న జీవన విధానం, పని వేళల్లో మార్పులు, మారిన వర్క్ కల్చర్... కారణం ఏదైనా చాలా మంది ఒత్తిడితో ఇబ్బంది పడుతు న్నారు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ టెన్షన్‌తో కూడిన జీవితం కారణంగా



చాలా మంది మానసిక సమస్యల బారిన పడుతున్నారు. దీంతో మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. అయితే ఈ సమస్య నుంచి బయటపడడానికి కొన్నిరకాల చిట్కాలను పాటించాలని నిపుణులు చెబుతున్నారు.

- సంగీతం వినడం వల్ల మానసిక స్థితితో పాటు భావోద్వేగాలను చాలా వరకు మెరుగుపరుస్తుంది. ఇది మనల్ని సంతోషంగా ఉంచడంలో సహాయ పడుతుంది. రోజులో కొంత సేపు సంగీతం వింటే ఒత్తిడి తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది.
- ఏదైనా పుస్తకాన్ని చదవడం వల్ల కూడా ఒత్తిడి దూరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. రోజులో కొద్ది సేపు పుస్తకం చదవడం వల్ల మనసుకు టెన్షన్, ఒత్తిడి లేకుండా ఉంటుంది. మనస్సును రిలాక్స్‌గా ఉంచడానికి చదవడం సులభమైన మార్గం.
- మానసిక ఒత్తిడిని తగ్గించడంలో శారీరక వ్యాయామం కూడా ఎంతగానో ఉపయోగ పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రతీ రోజూ వాకింగ్, యోగా, రన్నింగ్ వంటి వాటితో మనసు ప్రశాంతంగా మారుతుంది.
- ఎక్కువ సేపు పనిచేసిన తర్వాత ఏర్పడే ఒత్తిడిని తగ్గించటంలో ధ్యానం బాగా పనిచేస్తుంది. ఉదయం లేదా సాయంత్రం, ఏకాంత ప్రదేశంలో కూర్చుని, కళ్లు మూసు కుని శ్వాసపై దృష్టి పెట్టాలి. ఇలా క్రమం తప్పకుండా ప్రతిరోజూ చేస్తే మార్పు మీరే స్పష్టంగా గమనిస్తారని నిపుణులు చెబుతు న్నారు.
- ఇక పనిలో ఎంత బిజీగా ఉన్న ప్రతీ రోజూ కొద్ది సేపైనా మీకు కావాల్సిన వారితో మాట్లాడాలని చెబుతున్నారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది.

ఆరోగ్యం.. రుచి

మునక్కాయలే కాదు మునగాకులోనూ ఎన్నో ఔషధ గుణాలు, పోషకాలు ఉన్నాయి. మునగాకును మన ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు కూడా చెబుతున్నారు. ఇందులో మన ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా కాల్షియం, పొటాషియం, ఐరన్ ఇందులో అధికం. అంతేకాదు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అంతేకాదు.. కొలెస్ట్రాల్, షుగర్ వంటి ఎన్నో అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు ఉన్నవారు మునగాకుతో చేసిన ఆహారాన్ని ప్రతిరోజూ తింటే అవి అదుపులో ఉంటాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ ఆకుతో చేసే కొన్ని రకాల రెసిపీలు మీ కోసం...



పప్పు

కావలసిన పదార్థాలు : పెసరపప్పు – ఒక కప్పు, ఉల్లిపాయ – ఒకటి, పచ్చిమిర్చి – నాలుగు, టమాటా – ఒకటి, పసుపు – చిటికెడు, పచ్చి



శనగపప్పు– మూడు స్పూన్లు, కాబూలీ శనగలు – పావు కప్పు, నూనె – తగినంత, పచ్చి కొబ్బరి తురుము – పావు కప్పు, వెల్లుల్లి – ఐదు రెబ్బలు, ఎండుమిర్చి – మూడు, జీలకర్ర – ఒక స్పూను, నూనె – తగినంత, మునగాక – 100 గ్రాములు, కొత్తిమీర తరుగు – రెండు స్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా

తయారీ విధానం : పెసరపప్పు, శనగపప్పు, కాబూలీ శనగలు అన్నిటిని శుభ్రంగా కడిగి కుక్కర్లో వేయాలి. అందులోనే తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, టమాటాలు, పసుపు వేసి ఉడికించుకోవాలి. కనీసం మూడు విజిల్స్ వచ్చేదాకా ఉడికించుకోవాలి. తర్వాత స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. ఆ నూనెలో ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు, ఎండు మిర్చి వేసి వేయించాలి. ఆ తర్వాత శుభ్రంగా కడిగిపెట్టుకున్న మునగాకు వేయాలి. అది పచ్చివాసన పోయేదాకా వేయించుకోవాలి. ఉడికించుకున్న పప్పును వేపుకున్న మునగాకులో వేసి బాగా కలపాలి. రుచికి సరిపడా ఉప్పును వేసుకోవాలి. పచ్చి కొబ్బరి తురుమును వేసి బాగా కలపాలి. అవసరం అయితే పావు గ్లాసు నీళ్ల వేసి మూత పెట్టాలి. చిన్న మంట మీద ఉడికించుకోవాలి. తర్వాత స్టవ్ కట్టేయాలి. అంతే మునగాకు పప్పు రెడీ అయినట్. ఇది చాలా టేస్టీగా ఉంటుంది.

పచ్చడి

కావలసిన పదార్థాలు : మునగాకు – ఒక కప్పు, కొత్తిమీర తరుగు – అర కప్పు, నువ్వులు – నాలుగు స్పూన్లు, చింతపండు – నిమ్మకాయ సైజు, ఎండుమిర్చి – పది, నూనె – 8 నుంచి 10 స్పూన్లు, వెల్లుల్లి – ఆరు రెమ్మలు.

తయారీ విధానం : మునగాకును, కొత్తిమీరను శుభ్రంగా కడిగి పక్కన ఆరబెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక మునగాకును వేసి వేయించాలి. అవి వేగాక తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే కళాయిలో శనగపప్పు వేసి వేయించాలి. అలాగే ఎండుమిర్చి, వెల్లుల్లి కూడా వేసి వేయించాలి. చివరిలో నువ్వులను వేయాలి. వీటన్నింటినీ తీసి పక్కన పెట్టుకోవాలి. అలాగే కొత్తిమీర తరుగును కూడా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్‌లో వేయించిన అన్నింటిని వేసి, చింత పండును వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ మొత్తం మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. ఆ నూనెలో ఆవాలు, జీలకర్ర, శనగపప్పు, మినపప్పు, కరివేపాకు, ఎండు మిర్చి వేసి వేయించి ఈ పచ్చడిలో కలుపుకోవాలి. ఇలా తాలింపు పెట్టుకుంటే పచ్చడి టేస్టీగా ఉంటుంది. ఈ పచ్చడి చేయడం చాలా ఈజీ. రుచికి రుచి.. ఆరోగ్యానికి



కూడా ఎంతో మేలు చేస్తుంది.

చపాతీ

కావలసిన పదార్థాలు : గోధుమపిండి – ఒకటిన్నర కప్పు, మునగాకులు – ముప్పావు కప్పు, కొత్తిమీర తరుగు – అర కప్పు, అల్లం తరుగు – అర స్పూను, పచ్చిమిర్చి – నాలుగు, ఉల్లిపాయ – ఒకటి, జీలకర్ర – కొద్దిగా, ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ విధానం : ఒక గిన్నెలో గోధుమ పిండి తీసుకొని అందులోనే సన్నగా తరిగిన మునగాకులు, ఉల్లి తరుగు, కొత్తిమీర తరుగు, పచ్చిమిర్చి తరుగు, అల్లం తరుగు వేసి బాగా



కలపాలి. అందులోనే జీలకర్ర పొడి, చాట్ మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. నీరు వేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఆ పిండిని గాలి తగలకుండా మూత పెట్టి అరగంట సేపు పక్కన పెట్టాలి. ఇప్పుడు చిన్న బాగాన్ని తీసుకొని చపాతీలా ఒత్తుకోవాలి. స్టవ్ మీద పెనం పెట్టి కొద్దిగా నెయ్యి వేసుకోవాలి. అది వేడెక్కాక ఈ చపాతీని దానిపై వేసి రెండు వైపులా కాల్చుకోవాలి. దీన్ని ఏ కూరతో తిన్నా టేస్టీగా ఉంటుంది. రుచి కూడా అదిరిపోతుంది.

లడ్డు...

కావలసిన పదార్థాలు : మునగాకు పొడి – రెండు కప్పులు, కొబ్బరి తురుము – ఒక కప్పు, సన్



ఫ్లవర్ సీడ్స్ – అరకప్పు, ఖర్జురాలు – స్వీట్‌కు సరిపడా, బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష గార్నిష్‌కు సరిపడా.

తయారీ విధానం : స్టవ్ మీద కళాయి పెట్టి వేడెక్కాక.. అందులో తురిమిన కొబ్బరిని వేసి కాస్త బంగారు రంగులోకి మారేవరకు వేయించుకోవాలి. దాన్ని పక్కనపెట్టుకోవాలి. ఇప్పుడు అందులో పొద్దుతిరుగుడు గింజలను వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. అలాగే బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష, వేసి వేయించుకోవాలి. వీటన్నింటినీ మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. అందులోనే ఖర్జూరాలను కూడా వేసి పొడి చేసుకోవాలి. అలాగే బ్లెండర్లో ఖర్జూరాలను కూడా వేసి పొడి చేయండి. ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకొని అందులో మునగాకుల పొడిని వేయండి. అలాగే వేయించిన కొబ్బరి తురుము, నట్స్, ఖర్జూరం కలిపిన పేస్టు, తేనె, వేయించుకున్న పొద్దుతిరుగుడు గింజలు, యాలకుల పొడి వేసి బాగా కలుపుకోవాలి. కాస్త నెయ్యిని వేసి చేతులకు కూడా నెయ్యి రాసుకోండి. ఈ మిశ్రమాన్ని లడ్డూల్లా చుట్టుకొని గాలిచొరబడని డబ్బాలో వేసుకోవాలి. వీటిని ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎన్ని రోజులైనా నిల్వ ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

సూప్

కావలసిన పదార్థాలు: మునగాకు – ఒకటిన్నర కప్పు, చిన్న ఉల్లిపాయలు – నాలుగు, టమాటా – ఒకటి,

జీలకర్ర – అర టీ స్పూను, వెల్లుల్లిరెమ్మలు – అయిదు, నీళ్ల – రెండు కప్పులు, ఉప్పు – రుచికి సరిపడా, నూనె – తాలింపుకు రెండు స్పూను.

తయారీ విధానం : మునగాకులను శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి. తర్వాత స్టౌ పై బాండి పెట్టుకుని నూనె వేసి.. వేడి చేయాలి.. నూనె వేడెక్కాక జీలకర్ర వేసి కొద్దిగా వేయించాలి. అందులో వెల్లుల్లి రెబ్బలను బాగా నలిపి వేసుకోవాలి. తరువాత కొంత సేపు వేయించి అందులో చిన్నగా తరిగిన ఉల్లిపాయలు, ఉప్పు వేసుకుని వేయించాలి. ఉల్లిపాయలు వేగిన తర్వాత చిన్నగా తరిగిన టమాటా ముక్కలను వేయాలి. టమాటా బాగా వేగిన తర్వాత కడిగి పక్కన పెట్టుకున్న మునగాకులను వేసుకుని కొంత సేపు వేయించుకోవాలి. ఆ తర్వాత అందులో నీరు పోసుకోవాలి. 10 నిమిషాల పాటు సన్నని మంటపై మరిగించాలి. దింపే ముందు కొద్దిగా మిరియాల పొడి చల్లుకుని స్టౌ మీద నుంచి దింపేస్తే.. మునగాకు సూప్ రెడీ.. వేడి వేడిగా తాగితే.. రుచి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం. ■

పార్లమెంటరీ, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా రామ్మోహన్ నాయుడు

రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా జి.కిషన్ రెడ్డి

నవతెలంగాణ – న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర పార్లమెంటరీ కమిటీల సభ్యులుగా మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జి. కిషన్ రెడ్డికి అవకాశం దక్కింది. పార్లమెంటరీ, రాజకీయ వ్యవహారాల కమిటీల్లో సభ్యుడిగా రామ్మోహన్ నాయుడు నియామకం అయ్యారు. రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా కిషన్ రెడ్డికి చోటు దక్కింది. ఇక అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్‌లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా ఉన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో వేర్వేరు కమిటీలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. క్యాబినెట్ కమిటీ ఆన్ అకామిడేషన్, క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్, క్యాబినెట్ కమిటీ ఆన్ పార్లమెంటరీ ఎఫైర్స్, క్యాబినెట్ కమిటీ ఆన్ పొలిటికల్ ఎఫైర్స్, క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ, క్యాబినెట్ కమిటీ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ గ్రోత్, క్యాబినెట్ కమిటీ ఆన్ స్కిల్, ఎంప్లాయిమెంట్ అండ్ లైవ్లీహుడ్ కమిటీలను కేంద్రం ఏర్పాటు చేసింది.

మారని మోడీ తీరు

(మొదటిపేజి తరువాయి)

గమనిస్తున్నారని అన్నారు. చర్చల్లో వారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంటే, వినే ధైర్యం కూడా వారికి లేకపోయిందని ఎద్దేవా చేశారు.

సభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

రాజ్యసభలో ప్రధాని మోడీ ప్రసంగాన్ని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించాలని నినాదాలు చేస్తూ ప్రధాని ప్రసంగానికి అడ్డుతగిలారు. అధికార పక్షం తీరును నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ప్రధాని ప్రసంగంలో కొన్ని తప్పుడు అంశాలను సభకు వెల్లడించినందుకు నిరసనగా తాము వాకౌట్ చేశామని తెలిపారు. అసత్యాలు పలకడం ఆయనకు అలవాటని, సత్యదూరమైన అంశాలను ప్రస్తావిస్తుంటారని విమర్శించారు. ప్రధాని రాజ్యాంగం గురించి మాట్లాడుతుంటే, మీరు రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తారని తాను పేర్కొన్నానని చెప్పారు. రాజ్యాంగం కోసం పాటుపడేది ఎవరు, దాన్ని వ్యతిరేకించేది ఎవరనేది స్పష్టం చేశానని తెలిపారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నదని, వారు బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారని విమర్శించారు. బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అగౌరవపరుస్తుందని మోడీ పదేపదే చెబుతుంటారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ సభలో బాబా సాహెబ్ ఏం చెప్పారో, ఆర్గనైజర్‌లో ఆర్ఎస్ఎస్ ఏం రాసిందో చెప్పాలని తాను డిమాండ్ చేశానని ఖర్గే తెలిపారు.

కవిత కస్టడీ పొడిగింపు

(మొదటిపేజి తరువాయి)

కేసులో మార్చి 15న హైదరాబాద్‌లో కవితను ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి తీహార్ జైల్లోనే ఉంటున్నారు. మరోవైపు బెయిల్ కోసం ఆమె చేసిన అభ్యర్థనలను న్యాయస్థానాలు తోసిపుచ్చాయి. కవితతో పాటు ఢిల్లీ మాజీ మంత్రి మనీశ్ సిసోడియా కస్టడీని కూడా అదే తేదీ వరకు పొడిగించారు.

తలలో పెన్ను గుచ్చుకుని..

(మొదటిపేజి తరువాయి)

ప్రమాదవశాత్తు కిందపడగా తలలోకి పెన్ను దిగింది. దాంతో కుటుంబీకులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని సూచించడంతో ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ ఆస్పత్రిలో అతి కష్టం మీద వైద్యులు శస్త్ర చికిత్స చేసి పెన్ను తొలగించారు. పెన్ను తొలగించడంతో బాలికకు ప్రాణాపాయం తప్పిన ట్టేనని వైద్యులు భావించారు. ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ, పరిస్థితి విషమించి రియాన్షిక కన్నుమూసింది. సర్జరీ తర్వాత ఇన్‌ఫెక్షన్ సోకడంతోనే ఆమె చనిపోయిందని వైద్యులు ప్రకటించారు. బతికిందని సంతోషించే లోపే బిడ్డ మృతి చెందిందన్న వార్తతో ఆ తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. దాంతో సుభాష్ నగర్ కాలనీలో విషాదం నెలకొంది.

ఉద్యోగ బదిలీలకు పచ్చజెండా

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తేసింది. శుక్రవారం నుంచి ఈ నెల 20 వరకు బదిలీలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు (జీవోనెంబర్ 80) జారీ చేశారు. 15 రోజుల్లో బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు పేర్కొన్నారు. గత నెల 30 నాటికి ఒకేచోట నాలుగేండ్లకు పైబడి పనిచేస్తున్న ఉద్యోగులు కచ్చితంగా బదిలీ కావాలని తెలిపారు. గత నెల 30 నాటికి ఒకే చోట కనీసం రెండేండ్లకు పైబడిన వారే బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. 2025, జూన్ 30 నాటికి ఉద్యోగ విరమణ పొందే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల నుంచి ఐచ్ఛికాలు తీసుకుని ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా పారదర్శక విధానంలో బదిలీలను పూర్తి చేస్తామని వివరించారు. 40 శాతం వరకు ఉద్యోగులను బదిలీ చేసేందుకు అనుమతించామని తెలిపారు. భార్యాభర్తలు ఒకే చోట పనిచేసేలా, 2025 జూన్ 30 నాటికి ముందు ఉద్యోగ విరమణ పొందే వారికి, 70 శాతానికి పైగా వైకల్యం ఉన్న వికలాంగులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలు ఉన్న వారికి, కారుణ్య నియామకాల కింద ఉద్యోగం పొందిన వితంతువులు, క్యాన్సర్, నరాల వ్యాధులు, కిడ్నీ, లివర్ మార్పిడి, గుండె ఆపరేషన్ చేయించుకున్న వారు, బోన్ టీబీతో బాధపడుతున్న వారు, దీర్ఘకాలంగా మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. బదిలీ అమలైతే వ్యక్తిగత, ఆరోగ్య కారణాలుంటే వాటిని ఆయా శాఖల విభాగాధిపతులు పరిశీలిస్తారనీ, ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తారని తెలిపారు. ఆ తర్వాత తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని వివరించారు. సర్వీసును ఏ ప్రాంతంలో పనిచేస్తున్నారో దాన్ని పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రాంతం అంటే (నగరం, పట్టణం, గ్రామం) ప్రాతిపదికన బదిలీలను చేపడతామనీ, కార్యాలయం, సంస్థను పరిగణనలోకి తీసుకోబోమని వివరించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘాల ఆఫీసు బేరర్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రస్థాయి క్యాడర్ పోస్టులకు సంబంధించి సంబంధిత శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్యకార్యదర్శి, కార్యదర్శి కాంపిటెంట్ అథారిటీ ఉంటారనీ, సంబంధిత శాఖ విభాగాధిపతి కన్వీనర్‌గా, అదనపు, జాయింట్, డిప్యూటీ సెక్రెటరీలను సంబంధిత శాఖ కార్యదర్శులు నామినేట్ చేస్తారన్నారు. మల్టీజోనల్, జోనల్ పోస్టుల బదిలీలను సంబంధిత శాఖ విభాగాధిపతి నేతృత్వంలో కమిటీ నిర్వహిస్తుందని వివరించారు. జిల్లా స్థాయి క్యాడర్ పోస్టులకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కమిటీ బదిలీ ప్రక్రియను చేపడుతుందనీ, సంబంధిత శాఖ జిల్లా అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన మూడు రోజుల్లో ఉద్యోగులు రిలీవ్ కావాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రపతి ఉత్తర్వులను పాటించాలని తెలిపారు. ఈ నెల 21 నుంచి బదిలీలపై నిషేధం తిరిగి అమల్లోకి వస్తుందన్నారు.

ఉద్యోగ సంఘాల హర్షం

ఉద్యోగుల సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం ప్రకటించాయి. ఈ మేరకు టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బదిలీలకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు ప్రకటించారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు కావాల్సిన నిబంధనలను రూపొందించి ప్రకటించాలని టీజీవో ఆర్గనైజింగ్ కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ తెలిపారు. నూతన అధ్యాపకులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని టీజీజేఎల్ఏ–475 అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ డిమాండ్ చేశారు. సొంత జోన్ కోల్పోయిన వారికి వారి స్థానికత ఆధారంగా వెళ్లే అవకాశమివ్వాలని తెలిపారు. ఏడాది సర్వీసు పూర్తయిన అధ్యాపకులకు కూడా బదిలీలకు అవకాశం కల్పించాలని టీజీఎల్ఏ అధ్యక్షులు గాదె వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగుల బదిలీల షెడ్యూల్

తేది	వివరాలు
జులై 5 నుంచి 8 వరకు	ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు చేసి ప్రక్రియను సిద్ధం చేయాలి ఖాళీలు, తప్పనిసరిగా బదిలీ అయ్యే ఉద్యోగుల వివరాలను ప్రకటించాలి.
జులై 9 నుంచి 12 వరకు	దరఖాస్తుల స్వీకరణతో పాటు ఆప్షన్ల నమోదు
జులై 13 నుంచి 18 వరకు	దరఖాస్తుల పరిశీలన, మాస్టర్ లిస్టు రూపకల్పన తర్వాత కౌన్సెలింగ్
జులై 19 నుంచి 20 వరకు	బదిలీల ఉత్తర్వుల జారీ, మూడో రోజు వరకు ఉద్యోగులు పాత స్థానం నుంచి రిలీవ్ కావాలి.

ఆ ఇద్దరి వల్లే బ్రేక్..

(మొదటిపేజి తరువాయి)

కొంత సమయం పడుతుందని రాష్ట్ర నేతలు చెబుతున్నారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో పీసీసీపై నిర్ణయం తీసుకోవడం కంటే కొద్ది రోజుల తర్వాత చర్చించడం మంచిదనే అభిప్రాయానికి హైకమాండ్ వచ్చింది. ఇటీవల ఇదే విషయమై ఢిల్లీకి వెళ్లిన సీనియర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని హామీనిచ్చింది. ఏదేమైనా పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణ విషయాల్లో రాష్ట్ర నేతలతో సమావేశాలు, సంప్రదింపులు, చర్చల తర్వాతే, అది కూడా పరస్పర అంగీకారం కుదిరాకే ముందుకు కదలాలంటూ ఏఐసీసీ... సీఎంకు సూచించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.



పీసీసీ పీఠంపై గంపెడాశలు...

కాగా పీసీసీ చీఫ్ పదవికి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు ప్రధానంగా వినిపిస్తున్నప్పటికీ ఆయనతో పాటు మరికొందరు సీనియర్లు సైతం ఆ పీఠంపై కన్నేసినట్టు వినికిడి. మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎంపీలు బలరాం నాయక్, సురేశ్ షెట్కర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఈ పదవిని ఆశిస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క కూడా ఆ పోస్టు కోసం అడుగుతున్నారని సమాచారం. ఇప్పుడు ఆ నియామకానికి బ్రేక్ పడటంతో వారి ఆశలకు కూడా బ్రేకులు పడ్డట్టయింది.

టీపీసీసీ అధ్యక్ష నియామకం వాయిదా

తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడి నియామకం తాత్కాలికంగా వాయిదా పడింది. కాంగ్రెస్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎంపిక ప్రక్రియను ఏఐసీసీ వాయిదా వేసినట్లు తెలిసింది. ఈ విషయమై వారం రోజుల్లో మరోసారి చర్చించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. కాంగ్రెస్ అగ్రనేతల పరస్పర అంగీకారం అనంతరం పీసీసీ అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పదవి కోసం ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎంపీలు బలరాం నాయక్, సురేష్ షెట్కర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీతక్కలు సైతం అధ్యక్ష పదవిని అడుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. పీసీసీ అధ్యక్షుడి నియామకం తరువాతే మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని సమాచారం.

ఆగని ఎన్‌కౌంటర్లు

(మొదటిపేజి తరువాయి)

చోటుచేసుకున్నాయని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. "ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఆ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నాం. భద్రతా సిబ్బంది సురక్షితంగా ఉన్నట్టు సమాచారం అందింది" ఆయన చెప్పారు. జిల్లా రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, వివిధ జిల్లాలకు చెందిన ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసులతో కూడిన ఈ ఆపరేషన్ ఆదివారం ప్రారంభించినట్టు పోలీసులు తెలిపారు.తాజా ఘటనతో రాష్ట్రంలో భద్రతా బలగాలతో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఈ ఏడాది ఇప్పటివరకు మరణించిన మావోయిస్టుల సంఖ్య 138కి చేరుకున్నది. నారాయణపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో 136 మంది మావోయిస్టులు హతమయ్యారు. జూన్ 15న నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయి స్టులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్)కి చెందిన ఒక జవాన్ మరణించారు. జూన్ 5న నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు, మే 23న నారాయణపూర్–బీజాపూర్ సరిహద్దులో ఏడుగురు హతమయ్యారు. మే 10న బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కనీసం 12 మంది మావోయిస్టులు మరణించగా, ఏప్రిల్ 30న నారాయణపూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దులో ముగ్గురు మహిళలతో సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ 16న కంకేర్ జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 29 మంది మావోయిస్టులు హతమయ్యారని అధికారులు తెలిపారు.

నేటినుంచి ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

- 6 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 15 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- 19న సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల ఆరు నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. ఈనెల ఎనిమిది నుంచి 15 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. అదేనెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం www.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

బాలికపై లైంగికదాడి

పోక్సో చట్టం కింద కేసు.. నిందితునికి రిమాండ్

నవతెలంగాణ–అంబర్‌పేట్

పక్కింట్లో ఉండే బాలికకు మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి రెండు నెలలుగా లైంగికదాడికి ఒడిగట్టాడు. ఈ ఘటన హైదరాబాద్ అంబర్‌పేట్‌లో జరిగింది. నిందితుడినిపై పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ డి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట చెన్నారెడ్డినగర్‌కు చెందిన 14 ఏండ్ల బాలిక 8వ తరగతి చదువుతోంది. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన డేవిడ్ అతని భార్యతో అంబర్‌పేటలో నివాసముంటున్నాడు. వీరు బాలిక ఇంటి పక్కనే కిరాయికి ఉంటున్నారు. డేవిడ్ మొబైల్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. తన భార్య గర్భం దాల్చడంతో పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో పక్కింటి బాలికకు మాయమాటలు చెప్పి రెండు నెలలుగా పలుమార్లు లైంగిక దాడి చేశాడు. ఇది గమనించిన బాలిక తల్లి నిలదీయడంతో కూతురు అసలు విషయం చెప్పింది. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు డేవిడ్‌పై అంబర్‌పేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి బుధవారం అతన్ని రిమాండ్‌కు తరలించారు.



లైలా..గా విశ్వక్‌సేన్

హీరో విశ్వక్‌సేన్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తూ ఓ డేరింగ్ స్టెప్ తీసుకున్నారు. ఈ జనరేషన్ హీరోలెవరూ లేడీ క్యారెక్టర్ చేయడానికి సాహసం చేయరు. అలాంటిది ఆయన లేడీ గెటప్‌లో 'లైలా'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న లేటెస్ట్ మూవీ 'లైలా'. ఇందులో మ్యాన్ అండ్ ఉమెన్‌గా విశ్వక్ కనిపించనున్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకుడు.

బుధవారం మేకర్స్ 'లైలా ఐ లుక్'ని రిలీజ్ చేశారు. విశ్వక్ సేన్ లైలాగా ఛార్మింగ్ లుక్‌తో అదరగొట్టారు. ఆయన బ్యూటీఫుల్‌గా మేక్‌ఓవర్ అయ్యారు. ఫిమేల్ గెటప్‌లో విశ్వక్‌లా మరే యాక్టర్ కనిపించి ఉండరనడంలో సందేహం లేదు. ఆ పాత్రకు ఆయన ఎంత అద్భుతంగా సూట్ అయ్యాడో ఆ కళ్లను చూస్తేనే అర్థమవుతుంది. లైలాగా విశ్వక్ కంప్లీట్ ఫేస్‌ని చూసేందుకు అందరిలోనూ మరింత ఎగ్జైట్‌మెంట్‌ని పెంచింది.

బుధవారం పూజా కార్యక్రమాలతో ఈసినిమా గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దర్శకుడు హరీష్ శంకర్ కెమెరా స్విచాన్ చేశారు. నిర్మాతలు వెంకట సతీష్ కిలారు, జెమినీ కిరణ్ స్క్రిప్టును మేకర్స్‌కి అందించారు. హై ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో రూపొందనున్న ఈ సినిమాతో ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి నిర్మాత: సాహు గారపాటి, దర్శకత్వం: రామ్ నారాయణ్, రైటర్: వాసుదేవ మూర్తి, సంగీతం: తనిష్క్ బాగ్చి, జిబ్రాన్, సినిమాటోగ్రాఫర్: రిచర్డ్ ప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, ఎడిటర్: అన్వర్ అలీ.

నవచిత్రం

ఆపరేషన్ రావణ్ రిలీజ్‌కి రెడీ



రక్షిత్ అట్లూరి

రక్షిత్ అట్లూరి హీరోగా, రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ బాషల్లో రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిస్తోంది.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ బుధవారం అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు.

రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ పై ఓ సైకో స్టోరీ అనే క్యాప్షన్ పెట్టారు. యాక్షన్ సీక్వెన్స్‌లోని హీరో రక్షిత్ అట్లూరి స్టిల్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది.

ఈ సినిమాలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యా సాగర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా విజయంపై మూవీ టీమ్ కాన్ఫిడెంట్‌గా ఉంది.

కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, కెఎ పాల్ రాము, విద్యా సాగర్, టీవీ5 మూర్తి, కార్తీక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, డైలాగ్స్: లక్ష్మీ లోహిత్ పూజారి, ఎడిటర్: సత్య గిద్దుటూరి, ఆర్ట్: నాని.టి, ఫైట్స్: స్టంట్ జాషువా, కోరియోగ్రఫీ: జేడీ, ఛాయాగ్రహణం: నాని చమిడిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొళ్లేటి, నిర్మాత: ధ్యాన్ అట్లూరి, రచన-దర్శకత్వం: వెంకట సత్య.

హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్ కోసం..



వెంకటేష్, మీనాక్షి చౌదరి, అల్లు అరవింద్

వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబినేషన్లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం. 58 కోసం హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

రెండు హిలేరియస్ హిట్‌లు 'ఎఫ్ 2, ఎఫ్ 3' తర్వాత ఓ ఆసక్తికర ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో అత్యంత గ్రాండ్‌గా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబు కెమెరా స్విచాన్ చేయగా, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు.

హీరో, ఆయన ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్, ఆయన ఎక్సలెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్‌ట్రార్డినరీ ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

వెంకీ, అనిల్ రావిపూడి కాంబోలో ఇప్పటి వరకు వచ్చిన 'ఎఫ్2, ఎఫ్3' చిత్రాలు పక్కా కామెడీ కమర్షియల్‌గా ఉంటే, ఈ సినిమా వాటికి పూర్తి భిన్నంగా ఉండనుంది. ఎక్స్‌గర్ల్‌ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్‌లతో వెంకీ చేసే ప్రయాణం ఎలా ఉంటుంది?, దీన్ని ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు ఎలా మార్చారు? అనేది మాటల్లో కంటే వెండితెరపై చూస్తేనే థ్రిల్లింగ్‌గా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.

వెంకటేష్, అనిల్ రావిపూడి, దిల్‌రాజు.. ఈ ముగ్గురూ ఇప్పటికే రెండు బ్లాక్‌బస్టర్‌లను అందించిన నేపథ్యంలో వారి కలయికలో మరో చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రేక్షకులకు మునుపెన్నడూ లేని అనుభూతిని అందించడానికి టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదీప్ కాబ్రా, చిట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: దిల్ రాజు, నిర్మాత: శిరీష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, డీవోపీ: సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్. ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, సహ రచయితలు: ఎస్. కృష్ణ, జి.ఆదినారాయణ, యాక్షన్ డైరెక్టర్: వి వెంకట్,

భిన్న కథతో రాచరికం



అప్సరా రాణి

అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో గతంలో ఎన్నడూ చూడని కథతో 'రాచరికం' అనే మూవీ రాబోతోంది. చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఈశ్వర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సురేష్ లంకలపల్లి కథ, కథనాన్ని అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు.

ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాకు సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పర్ఫెక్ట్ అవుట్ పుట్ తీసుకొస్తున్నారు మేకర్స్.

రీసెంట్‌గా ఈ మూవీ నుంచి హీరోయిన్ అప్సరా రాణి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేయగా, ప్రేక్షకుల నుంచి భారీ రెస్పాన్స్ వచ్చింది. కాళీ మాత ఉగ్ర రూపం దాల్చితే, రక్తంతో ఒళ్లంతా తడిసి ముద్దైతే ఎలా ఉంటుందో.. ఈ పోస్టర్‌లో అప్సరా రాణి అలా కనిపించారు. ఈ పోస్టర్ చూస్తుంటే అప్సరా రాణికి అద్భుతమైన పాత్ర లభించినట్టుగా కనిపిస్తోంది. థ్రిల్లింగ్ కాన్సెప్ట్, డిఫరెంట్ కంటెంట్, సగటు ప్రేక్షకుడిని కట్టిపడేసే సన్నివేశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. సారథి స్టూడియోస్‌లో జరుగుతున్న పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరిదశలో ఉన్నాయి.

ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకులు భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. హైపర్ ఆది, రంగస్థలం మహేష్, విజయ రామరాజు, శ్రీకాంత్ అయ్యంగార్, మహబూబ్ బాష, రూపేష్ మర్రాపు, ప్రాచీ థాకర్, లత, ఈశ్వర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీకి వెంగి సంగీతాన్ని అందించగా, ఆర్య సాయి కృష్ణ కెమెరామెన్‌గా పని చేశారు. రామ్ ప్రసాద్ మాటలు సమకూర్చారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చాణక్య, ఎడిటర్‌గా జేపీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అతి త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్‌ని మేకర్స్ అనౌన్స్ చేయనున్నారు.

మహిళల త్యాగాన్ని తెలిపే పాట..



'నా పేరు శివ', 'అంధగారం' వంటి హిట్ చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ 'పేక మేడలు'తో హీరోగా పరిచయం అవుతున్నారు. అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'ఎవరికి చెప్పొద్దు' సినిమాతో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థను స్థాపించి విజయాన్ని అందుకుని, ఇప్పుడు ఈ సినిమాతో ప్రేక్షకులు ముందుకు వస్తున్నారు నిర్మాత రాకేష్ వర్రే.

గతంలో ఈ సినిమాకు సంబంధించి రిలీజైన టీజర్, ఫస్ట్ సాంగ్‌కు అనూహ్య స్పందన లభించింది. రీసెంట్‌గా హీరో వినోద్ కిషన్ చేసిన వినూత్న ప్రమోషనల్ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమాలోని రెండవ సింగిల్ 'ఆడపిల్ల..' సాంగ్ విడుదలైంది.

'ఆనందం అత్తకు స్వాహా.. మనశాంతి మామకు స్వాహా.. ఆడదాని జన్మంతా స్వాహా' అంటూ సాగే ఈ పాటను సాకే రాజశేఖర్ పాడగా,భార్గవ కార్తీక్ అద్భుతమైన లిరిక్స్ రాశారు. స్మరణ్ సాయి అందించిన మ్యూజిక్ చాలా ఎట్రాక్టీవ్‌గా, కొత్తగా ఉంది. ఈ పాట ఆద్యంతం కొత్తగా, వైవిధ్యంగా చిత్రీకరించినట్టుగా తెలుస్తోంది. ఒక మంచి కాన్సెప్ట్, కంటెంట్ ఉన్న స్టోరీగా ఈ సినిమా ఖచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది. ఈ సినిమాని ఈనెల19న విడుదల చేస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. రితిక శ్రీనివాస్, జగన్ యోగి రాజ్, అనూష నూతల, గణేష్ తిప్పరాజు, నరేన్ యాదవ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: రాకేష్ వర్రే, రచయిత- దర్శకుడు: నీలగిరి మామిళ్ల, డి ఓ పి: హరిచరణ్ కె., ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, సంగీత దర్శకుడు: స్మరణ్ సాయి, లైన్ ప్రొడ్యూసర్: అనూషా బోరా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కేతన్ కుమార్.

ఆటలు



విజయోత్సవ సంబరాలకు సిద్ధం

- నేడు ముంబయిలో ఓపెన్ బస్ పరేడ్
- ప్రధానిని కలవనున్న టీమిండియా ఆటగాళ్లు

బీసీసీఐ

ముంబయి: టి20 ప్రపంచ కప్ సాధించిన టీమిండియా ఆటగాళ్లు ముంబయిలో మెరైన్ డ్రైవ్ ప్రాంతంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు బిసిసిఐ కార్యదర్శి జే షా ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేశారు. గురువారం సాయంత్రం 5గంటలకు ఈ సంబరాలు మొదలవుతాయని తెలుపుతూ అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ధోనీ సారథ్యంలో భారత్ 2007 టి20 ప్రపంచ కప్ సాధించినప్పుడు కూడా ముంబయిలో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఆ సందర్భంగా వేలాది అభిమానులు టీమిండియా ఆటగాళ్లున్న బస్సు వెంట నడిచి గెలుపు సంబరాల్లో



భాగస్వాములయ్యారు. తాజాగా అప్పటి ఫొటోను బిసిసిఐ కార్యదర్శి జే షా సామాజిక మాధ్యమాల్లో పంచుకొని అభిమానులు భారీ సంఖ్యలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. టీమిండియా ఆటగాళ్ల కోసం బిసిసిఐ ప్రత్యేక విమానంలో బార్బడోస్ నుంచి స్వదేశానికి తిరిగి రానున్నారు. ఈ విమానం గురువారం ఉదయం న్యూఢిల్లీకి చేరనుంది. ఆ తర్వాత భారత ఆటగాళ్ల ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తారు. అనంతరం భారత ప్రపంచ కప్ జట్టు ముంబయికి చేరుకుని విజయోత్సవ సంబరాల్లో పాల్గొంటుంది.

మూడోరౌండ్‌కు గాఫ్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో అమెరికా యువ సంచలనం కోకా గాఫ్ హవా కొనసాగుతోంది. 2వ సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్.. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో వరుససెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేసి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. తొలిరౌండ్‌లో గాఫ్ 6-2, 6-1తో టొడోని(ఫ్రాన్స్)పై సునాయాసంగా నెగ్గింది. ఇతర పోటీలో 20వ సీడ్ హడ్డాడ్ మాయా(బ్రెజిల్) 7-5, 6-3తో ఫ్రెచ్(పోలండ్)ను ఓడించింది.

రూథ్ ఔట్..

పురుషుల సింగిల్స్‌లో పెను సంచలనం నమోదైంది. 8వ సీడ్, నార్వేకు చెందిన కాస్పర్ రూథ్ అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో రూథ్ 4-6, 5-7, 7-6(7-1), 3-6తో ఫోగ్నిని(ఇటలీ) చేతిలో పోరాడి ఓడాడు.

డబుల్స్‌లోనూ సుమిత్‌కు నిరాశ..

పురుషుల సింగిల్స్‌లో తొలిరౌండ్‌లోనే ఓడిన సుమిత్ నాగల్‌కు పురుషుల డబుల్స్ లోనూ నిరాశ తప్పలేదు. బుధవారం జరిగిన డబుల్స్ తొలిరౌండ్ పోటీలో నాగల్-లాజొవిక్(క్రొయేషియా) జోడీ 2-6, 2-6తో స్పెయిన్ జోడీ చేతిలో వరుససెట్లలో ఓటమిపాలైంది.

కోస్టల్ రైడర్స్ విజయం



విశాఖపట్నం : విశాఖ వేదికగా జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 3లో బుధవారం బెజవాడ టైగర్స్ జట్టుపై ఎనిమిది పరుగుల తేడాతో కోస్టల్ రైడర్స్ విజయం సాధించింది. పిఎం.పాలెంలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బెజవాడ టైగర్స్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 170 పరుగులు చేసింది. ఓపెనర్ బ్యాట్స్‌మ్యాన్లు కెప్టెన్ షేక్ రషీద్ 47 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులతో 67 పరుగులు, అభిషేక్ రెడ్డి 22 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35 పరుగులు చేశారు. కార్తీక్ రామన్ 9 బంతుల్లో 19 పరుగులు చేసి రాణించాడు. మొత్తంగా 170 పరుగుల స్కోరును బెజవాడ టైగర్స్ ముందు నిలిపారు. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన బెజవాడ టైగర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 162 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎనిమిది పరుగుల తేడాతో ఓటమి చెందింది. ఓపెనర్లు ధ్రువకుమార్ రెడ్డి, కెప్టెన్ రిక్కీ బుయి, పైలా అవినాష్ రాణించినప్పటికీ వరుసగా వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టు ఓటమిపాలైంది.

టర్కీ సంచలనం

ఆస్ట్రియాపై 2-1గోల్స్‌తో గెలుపు



బెర్లిన్: యూరో-2024లో టర్కీ జట్టు సంచలనం నమోదు చేసింది. బుధవారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో పటిష్ట ఆస్ట్రియా జట్టును ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో టర్కీ 2-1గోల్స్ తేడాతో ఆస్ట్రియాను చిత్తుచేసింది. టర్కీ తరఫున మెర్త్ డెర్మినల్ మ్యాచ్ ప్రారంభమైన తొలి నిమిషంలోనే గోల్ కొట్టి ఆస్ట్రియాను షాక్‌కు గురి చేశాడు. ఆ తర్వాత 59వ ని.లో మరో గోల్ కొట్టడంతో టర్కీ 2-0 ఆధిక్యతలోకి వెళ్లింది. ఆస్ట్రియా తరఫున ఏకైక గోల్‌ను మిచెల్(66వ ని.)లో చేశాడు. 7న జరిగే క్వార్టర్స్‌కు టర్కీ జట్టు నెదర్లాండ్స్‌తో తలపడనుంది. మంగళవారం రాత్రి జరిగిన మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 3-0గోల్స్ తేడాతో రొమేనియాను చిత్తుచేసి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

రూ.300తో ఎలా బతుకుతారు..?

కేంద్రం వాటా పింఛన్ రూ.3వేలకు పెంచాలి

- రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇవ్వాలి : ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్
- జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో/విలేకరులు

"కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ వాటా రూ.300తో వికలాంగులు ఎలా బతుకుతారు..? దాన్ని రూ.3వేలకు పెంచి రాష్ట్రాలకు ఇవ్వాలి. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ మేరకు రూ.3వేల పింఛన్‌ను 6వేలకు పెంచాలి" అని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం కలెక్టరేట్ల ధర్నాలు చేశారు. అందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో వెంకట్ మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే పింఛన్ పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిందని తెలిపారు. కానీ, ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా హామీ అమలుకు నోచుకోలేదన్నారు. 44,49,767 మంది లబ్దిదారులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 24,84,000 మందికి ఇప్పటివరకు పింఛన్ మంజూరు కాలేదన్నారు. 2014లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ల మంజూరుకు ఆదాయ పరిమితి విధిస్తూ విడుదల చేసిన జీవో 17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2015 కంటే ముందు సదరన్ సర్టిఫికెట్ పొందిన వారికి ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకునే అవకాశం లేదని, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు పింఛన్ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్‌లలో వికలాంగులకు 5 శాతం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని, తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్ కోసం లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు మెమోరాండం అందజేశారు.

హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ.. ధరల పెరుగుదల సూచి ఇండెక్స్‌కు పింఛన్‌ను అనుసంధానం చేసి ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న వాటాను రూ.3000కు పెంచాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు.సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వికలాంగుల దగ్గరికి వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్డీ జిల్లా గౌరవ అధ్యక్షులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పింఛన్‌ల వాటా 2011 నుంచి రూ.300 మాత్రమే ఇస్తోందన్నారు. గడిచిన 13 ఏండ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ధరల పెరుగుదల సూచీకి అనుగుణంగా పింఛన్‌లు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కాలపరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్‌లు వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం కొత్తగా గుర్తించిన 14 రకాల వైకల్యాలకు సదరం సర్టిఫికెట్‌లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా నిజామాబాద్, నిర్మల్, నారాయణపేట్, వికారాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, సూర్యాపేట, భువనగిరి, మెదక్, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

పూర్వ వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి

- ప్రభుత్వానికి తెలంగాణ వీఆర్వోల సంక్షేమ సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పూర్వ వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖలో తీసుకోవాలని తెలంగాణ వీఆర్వోల సంక్షేమ సంఘం అధ్యక్షులు గరికె ఉపేందర్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో కుట్ర పూరితంగా మిగులు సిబ్బందిగా పేర్కొంటూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా లాటరీ పద్ధతిన వీఆర్‌ఏలను ఇతర శాఖలకు బదిలీ చేసిందని విమర్శించారు. 90 ఏండ్ల తెలంగాణ చరిత్రలో నిజాం పాలనలో మినహా సమగ్ర భూసర్వే నిర్వహించనప్పుడు రికార్డుల్లోని తప్పులకు వీఆర్వోలనే ఎలా బాధ్యులు చేస్తారని ప్రశ్నించారు. వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు చేసిన తర్వాత కూడా 2.31 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఎలా మాయం అయ్యాయో చెప్పాలని నిలదీశారు.గ్రామాల్లో సరైన మొఖా విచారణ లేక రికార్డులకు భద్రత కరవైందన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించడానికీ, పూర్వ వీఆర్వోలకు సర్వీసు పరంగా జరిగిన అన్యాయం సరి చేయడానికి సత్వరమే రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని కోరారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పుట్టుక లోపాలను గుర్తించి చికిత్సనందించాలి

- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పుట్టుక లోపాలు గల పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి చికిత్సనందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి వైద్యాధికారులను సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఇంటెన్సివ్ కేర్ బ్లాక్, డయాగ్నస్టిక్ ల్యాబ్, రక్త పరీక్షల కేంద్రం, క్వాలిటీ కంట్రోల్ రూమ్, సీసీటీవీ, ఫిజియోథెరపీ, పీరియాడికల్ సర్జికల్ వార్డ్, ఆపరేషన్ థియేటర్, కాంప్రహెన్సివ్ లాక్టేషన్ మేనేజ్మెంట్ సెంటర్, ఎస్ఎన్సీయూ సెంటర్, నియోనాటాలజీ వార్డులను తనిఖీ చేసి అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో ముచ్చటించారు. అనంతరం ఆస్పత్రి రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పు జరిగిన వెంటనే లోపాలతో పుట్టిన పిల్లల సమాచారాన్ని రిజిస్టర్ చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, నిలోఫర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి, ఆర్ఎంఓ కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం హుండీ ఆదాయం రూ.21,44,464

నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం హుండీలను బుధవారం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఏ మారుతి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీల లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా పి. ప్రసాద్ హాజరయ్యారు. 3 నెలల 7 రోజులకు గాను రూ.21,44,464 ఆదాయం వచ్చినట్టు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో ఎంపీటీసీ రేవెల్లి మమత, దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ కాళేశ్వరం సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, విలేజ్ పోలీస్ ఆఫీసర్ హెచ్ కనకయ్య, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ కరీంనగర్ సభ్యులు, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి కామారెడ్డి, సిరిసిల్ల సభ్యులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యేపై కేసు నమోదు

- ఖండించిన కేటీఆర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను దుర్భాషలాడారంటూ కాంగ్రెస్ నాయకుడు కుడ్మేత విశ్వనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కేసు నమోదు చేసినట్టు సీఐ సతీష్ తెలిపారు. నూతన చట్టాలైన బీఎన్ఎస్ 351(2), 396(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కాగా, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయడాన్ని ఎక్స్(ట్విట్టర్) వేదికగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరిని ఖండిస్తూ నిరసన తెలిపితే కేసు నమోదు చేయడం సరైన విధానం కాదన్నారు.

చికిత్స పొందుతూ తల్లీకూతురు మృతి

- నాలుగు రోజుల కిందట ఆత్మహత్యాయత్నం
- మిగతా ఇద్దరు కుమార్తెల పరిస్థితి విషమం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని గజ్జిగూడ గ్రామంలో నాలుగు రోజుల కిందట ఆత్మహత్యాయత్నం చేసుకున్న తల్లీకూతురు మృతిచెందారు. కుటుంబ పెద్ద తీరుతో విసిగిపోయిన తల్లి, ముగ్గురు కుమార్తెలు సోమవారం పురుగుల మందు తాగిన విషయం విదితమే. బుధవారం చికిత్స పొందుతూ తల్లి అనిత(45), కూతురు రమ్య(16) మృతిచెందారు. మిగతా ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి కూడా విషమంగానే ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు తెలిపారు.

కె.పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీటి పారుదల శాఖ సలహాదారుగా ఉన్న కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు బుధవారం ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. మే 15 నుంచి మరో 6 నెలల పాటు పొడిగింపు ఉత్తర్వులు వర్తిస్తాయి. ఈ కాలంలో నెలకు రూ.ఒక లక్షా 50 వేల చొప్పున ఆయనకు పారితోషకాన్ని అందజేస్తారు.

ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాలి

- డీఎంఈకి ఏఐడీఎస్ఏ వినతి


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాలని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐడీఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మంజూర్ అహ్మద్ నేతృత్వంలో నాయకులు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకురాలు డాక్టర్ వాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రిన్సిపాల్ కారణంగా కళాశాల సమస్యల నిలయంగా మారిపోయిందని, ఆమే సమస్యలను సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారని చెప్పారు. ఇటీవల బీడీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 22 మందిని డిటెయిన్డ్ చేసి అన్యాయం చేశారని డాక్టర్ వాణి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత బ్యాచ్ విద్యార్థుల హాస్టల్ వసతి కూడా ప్రిన్సిపాల్ కారణంగా సమస్యాత్మకంగా మారిందని చెప్పారు.

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

- నారాయణఖేడ్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి
- అజ్మీర్ దర్గా దర్శించుకుని వస్తుండగా..

కల్వర్టును ఢీకొన్న కారు



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

అజ్మీరా దర్గా సందర్శనకు వెళ్లి.. తిరిగి వస్తుండగా మహారాష్ట్రలోని పూణే సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు దుర్మరణం చెందారు. మరో యువకుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారరం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్‌కు చెందిన ఆరుగురు యువకులు ఆదివారం అజ్మీర్ దర్గా సందర్శనకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముంబై మీదుగా వస్తుండగా.. మంగళవారం రాత్రి పూణే సమీపంలో వారి కారు కల్వర్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహబూబ్ ఖురేషి, రఫీ ఖురేషి, కంగ్టికి చెందిన ఫిరోజ్ ఖురేషి, సిర్గాపూర్‌కు చెందిన మజీద్ పటేల్, హైదరాబాద్‌కు చెందిన ఫిరోజ్ ఖురేషి అక్కడికక్కడే మృతిచెందారు. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌కు చెందిన మరో యువకుడు సయ్యద్ అమర్ తీవ్ర గాయాలపాలై పూణే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ఉండగా.. వారందరూ 25 ఏండ్ల లోపు వారే కావడం గమనార్హం. మృతదేహాలను కాంగ్రెస్ యువజన నాయకులు సాగర్ షెట్కర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

పాలన చేతకాక ప్రతిపక్షాలపై ప్రతీకార చర్యలు

- కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, హత్యలు : మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగింపు కార్యక్రమాల్లో..ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



నవతెలంగాణ-విలేకరులు


సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పాలించే చేతకాక ప్రతిపక్షాలపై ప్రతీకార చర్యలకు పాల్పడుతుందని, కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, హత్యలు, లైంగికదాడులు పెరిగాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం బుధవారంతో ముగియడంతో పలు జిల్లాల్లో వారిని సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఐదేండ్లుగా కష్టపడి కరోనా కాలంలోనూ ప్రజలకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఇంతటి సేవలందించిన ప్రజాప్రతినిధులను గౌరవించు కోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసిందని, ఏడు నెలలుగా పల్లెలన్నీ మురికి కూపాలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని, భవిష్యత్తు మనదేనని ధీమా కల్పించారు. ఖమ్మం జిల్లాలో ఓ రైతు, సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో కలెక్టర్ ఆఫీస్‌లో మరో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన చేతకాక ప్రతిపక్షాలపై కుట్రలు, కేసులు పెడుతున్నారని విమర్శించారు. అనంతరం దుబ్బాక నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, నామినేటెడ్ ప్రజాప్రతినిధులను మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మెమొంటోలు అందించి శాలువాలతో సత్కరించారు.యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల ఆత్మీయ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని ఎంపీపీ, జెడ్పీటీసీ,ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైట్ టూ రీకాల్‌ను శాసనమండలిలో ప్రవేశపెడతానని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఐదేండ్లలో ప్రజలకు సేవ చేయని పక్షంలో వారిని పదవి నుంచి తొలించే పద్ధతినే రైట్ టూ రీకాల్ అంటారని తెలిపారు. ఈ పద్ధతి ద్వారా ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు ప్రజాసేవే లక్ష్యంగా ఎన్నికల్లో నిలబడి పనిచేసేలా చేస్తారన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యానికి పెద్దపీట వేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. తాను చదువుకున్న తన సొంత గ్రామమైన మాదాపూర్ ఉన్నత పాఠశాలకు తన నిధుల నుంచి రూ.50 లక్షలు వెచ్చించి మోడల్‌హైస్కూల్‌గా తయారు చేస్తున్నట్టు చెప్పారు. అందుకు తన వంతుగా తన తండ్రి పేరు మీద రూ.5లక్షలు అందజేశారు.

సిద్దిపేట జిల్లా మద్దూరు ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి పాల్గొని వారిని శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయం అంటేనే ప్రజా సేవ అని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు సాయుధ పోరాటం, నక్సల్స్ పోరాటం, తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. హన్మకొండ జిల్లా పరిషత్ హాల్‌లో జరిగిన జెడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగింపు ఆత్మీయ వీడ్కోలు సమావేశం లో జెడ్పీ చైర్మెన్ సుధీర్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. రాజకీయనాయకులు ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని, ఎదిగిన కొద్ది ఒదిగి ఉండాలని అన్నారు. అనంతరం జెడ్పీటీసీలను సన్మానించారు.

సంపద సృష్టి, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలనే కేంద్రంగా

అమరావతిని పునర్నిర్మిస్తాం

- న్యాయపరమైన చిక్కులు తొలగిస్తాం • శ్వేతపత్రం విడుదలలో చంద్రబాబు ప్రకటన





అమరావతి : న్యాయపరమైన చిక్కులు తొలగించి అమరావతిని రాష్ట్ర రాజధానిగా పునర్నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఆయన అమరాతిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరాతిని సంపద సృష్టి, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, నిధుల కోసం కేంద్రాన్ని కోరతామనిచెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా అమరావతిని ఆపబోమని అన్నారు. రాష్ట్ర ప్రజలందరు గర్వంగా చెప్పుకునేలా అమరావతిని రూపొందిస్తామని చెప్పారు. దీనికోసం కొత్త ప్రణాళికలు ఏమీ లేవని, పాతవాటితోనే పనులు చేస్తామని తెలిపారు. రాష్ట్రానికి ఎటువైపు నుండి చూసినా అమరావతి సమదూరంలో ఉందని, రైతులు ముందుకొచ్చి 34 వేల ఎకరాలు ఇచ్చారని, ఇతర భూములూ కలుపుకుంటే 53,475 ఎకరాలు వచ్చిందని పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోనే రికార్డని, ఇంత పెద్ద స్థాయిలో భూ సమీకరణ ఎక్కడా జరగలేదని అన్నారు

జగన్ అన్యాయం చేశారు. .

అమరావతిని నాశనం చేసి తెలుగు జాతికి జగన్ తీరని అన్యాయం చేశారని చెప్పారు. అసెంబ్లీలో అమరావతి రాజధానిగా ఉండాలని చెప్పిన ఆయన అధికారంలోకి రాగానే మాట మర్చారని అన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు రాజధాని మొత్తం భూమిలో రోడ్లు ఇతర నిర్మాణాలకు 27,885 ఎకరాలు, రిటర్నబుల్ ప్లాట్ల కింద 11,826 ఎకరాలు, ఇతర అవసరాలకు 14,037 ఎకరాలు పోను 8274 ఎకరాలు ప్రభుత్వం వద్ద ఉంటుందని తేల్చినట్లు చెప్పారు.

దీంతో రాజధాని నిర్మాణం చేయొచ్చని అనుకున్నామని, కేంద్రం కూడా రైతులకు క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు ఇచ్చిందని చెప్పారు. సింగపూర్ సాయంతో మాస్టర్‌ప్లాను తయారు చేశామని, అన్ని భవనాలు ఒకేచోట ఉండాలని ప్లాను చేస్తే వైసిపి ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరించిందని తెలిపారు. రూ.51,687 కోట్లతో అభివృద్ధికి అంచనా వేసి రూ.41,170 కోట్లకు టెండర్లు పిలిచామని చెప్పారు. అప్పటికే జరిగిన నిర్మాణాలకు రూ.4,318 కోట్లు బిల్లు చెల్లించగా రూ.1268 కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని పరిధిలో నిర్మాణాలన్నీ నిలిపేశారని అన్నారు. వ్యవసాయ కూలీలకు అందించాల్సిన పెన్షన్లు, రైతులకు ఇవ్వాల్సిన కౌలుకు కూడా ఇబ్బందుల సృష్టించారని తెలిపారు. సింగపూర్ కన్సార్టియంపైనా ఆరోపణలు చేశారని, హ్యాపీనెస్ట్ పూర్తయితే ప్రభుత్వానికి రూ.54 కోట్ల అదాయం వచ్చేదని, ఆపేయడం వల్ల రూ.164 కోట్ల నష్టం వచ్చిందని చెప్పారు. వ్యవస్థలను ఇలా ఛిన్నాభిన్నం చేస్తే పెట్టుబడిదారులు ముందుకురారని, సింగపూర్‌కు చెందిన సంస్థలయితే ఆలోచనలో పడ్డాయని పేర్కొన్నారు. అమరావతికి సంబంధించి రేటింగ్స్ కూడా దెబ్బతిన్నాయని, దీనివల్ల రుణాలు ఇవ్వాలన్నా బ్యాంకర్లు ఆలోచించే పరిస్థితి ఉందని తెలిపారు.

బ్రాండ్‌ను దెబ్బతీశారు

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అమరావతి బ్రాండ్ దెబ్బతిందని, నిర్మాణ ఖర్చు పెరిగిందని, పెట్టుబడిదారుల్లో నమ్మకం సన్నగిల్లిందని వివరించారు. రాష్ట్రంలోని యువత చిన్నపాటి ఉపాధికి కూడా పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చిందని, రెవెన్యూ అదాయమూ తగ్గిపోయిందని చెప్పారు. రాజధాని పరిధిలో రోడ్లనూ తవ్వుకుపోయారని చెప్పారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన అన్ని పునాదులూ నీళ్లలో ముంచేశారని పేర్కొన్నారు. అన్ని రకాల నిర్మాణాలను అర్థాంతరంగా నిలిపేశారని వివరించారు. 2019లో ఎక్కడున్నామో ఐదేళ్లపాటు అక్కడే ఉన్నామని, ఆర్థికంగా దెబ్బతిన్నామని చెప్పారు.

దెబ్బతిన్నచోట నుండే బంగారు భవిష్యత్

రాష్ట్ర అభివృద్ధిపై ప్రజలకు నమ్మకం రావాలని, గత పాలకులు నాశనం చేసిన ప్రాంతం నుండే బంగారు భవిష్యత్‌కు నాంది పలుకుతామని చంద్రబాబు తెలిపారు. ప్రజా రాజధాని ఏ ఒక్కరికోసమో కాదని, దీనివల్ల రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఉండేవారందరికీ ఉపాధి దొరుకుతుందని వివరించారు. ప్లాను ప్రకారం నిర్మాణం జరిగి ఉంటే పన్నులు, జిఎస్‌టి ఇతర రూపాల్లో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని, రూ.30 వేల కోట్లు ఖర్చుపెడితే రూ.20 వేల కోట్ల ఆదాయం వచ్చేదని అన్నారు. రాజధాని ఎక్కడ ఆగిందో అక్కడ నుండే పనులు ప్రారంభిస్తామని చంద్రబాబునాయుడు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, సిఆర్‌డి ఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో.. అరుదైన సిడితల వీరగల్లు గుర్తింపు

- తెలంగాణ చరిత్ర బృందం నిర్ధారణ





నవతెలంగాణ-రాయపోల్

చాళుక్య రాష్ట్ర కూటుల కాలానికి చెందిన శిల్పాలు రాయపోల్ మండల కేంద్రంలో గుర్తించబడ్డాయని, శిల్పాలు, శాసనాలపై ఉన్న రాతలను బట్టి వీటిని నిర్ధారించినట్టు, తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు కొనిపాక శ్రీనివాస్ తెలిపారు. గుర్తించిన వాటిలో ప్రత్యేకమైన వీరగల్లు శిల్పాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు గుర్తించినట్టు చెప్పారు. ఈ శిల్పం ఆత్మాహుతి వీరగల్లుదని నిర్ధారించామని అన్నారు. ఇలాంటి శిల్పాన్ని సిడితల వీరగల్లు అంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలోని రాయపోల్ ఒక పురాతన నగరం. ఈ గ్రామంలోని గణపతి దేవాలయం దగ్గర కొన్ని విరిగిన వీరగల్లు విగ్రహాలు ఉన్నాయన్నారు. వాటిలో చాళుక్య, రాష్ట్రకూటుల కాలానికి చెందిన శిల్పాలు ఉన్నట్టు తెలిపారు. రెండంతస్తులున్న ఈ వీరగల్లులోని మొదటి అంతస్తులో ఒక వీరుడు కూర్చుని ఉన్నాడని, ఆయన పట్టుకున్న పరికరమేదో అస్పష్టంగా ఉందని, వీరుని నడినెత్తిన కొప్పు ఉందని, వంచిన వెదురుగడకు తల తెగి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అంజలి పట్టిన వీరుడు ఆసనస్థితిలో కూర్చుని ఉన్న శిల్పాలు, ఆత్మాహుతి చేసుకున్న వీరున్ని దేవలోకానికి తీసుకొనిపోతున్న ఇద్దరు చామరధారిణులైన అమరాంగనల శిల్పాలు పై అంతస్తులో కనిపిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సిడితల వీరగల్లులు రాష్ట్రంలో పది మాత్రమే లభించాయన్నారు. స్త్రీ సిడితల వీరగల్లులు.. చొల్లేరు, వనపర్తి గ్రామాల్లో దొరికాయని, పురుష సిడితల వీరగల్లులు.. లింగంపల్లి, ఇప్పుడు రాయపోల్‌లో లభించాయని చెప్పారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా, శివుని సన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఎంచుకున్నారని, అందుకే ఈ ఆత్మాహుతులు జరిగాయన్నారు. ఆ మధ్య వచ్చిన 'యుగానికి ఒక్కడు' సినిమాలో కూడా ఇలాంటి శిల్పాన్ని పోలిన దృశ్యం ఒకటి మనకు కనిపిస్తుందన్నారు. అందులో చోళులు తిరిగి చోళనాడుకు వెళ్ళే సందర్భంలో ఎవరైనా బలిదానం చేయాలి అన్నపుడు ఒక వ్యక్తి తన తల వెంట్రుకలను వెదురుగడకు కట్టి కత్తితో ఇలానే నరుక్కొని బలిదానం చేసుకుంటాడని తెలిపారు. ఇలాంటి అరుదైన శిల్పాలు మన ప్రాంతంలో ఉండటం ఎంతో గర్వకారణంగా ఉందని రాయపోల్ ప్రజలు సంబరపడుతున్నారు.



ఆర్జీయూకేటీకి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

- 8,9,10 న కౌన్సెలింగ్

నవతెలంగాణ-ముధోల్

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో 2024-2025 పీయూసీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ వెంకటరమణ అధికారులతో కలిసి విడుదల చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 1500 సీట్లకు 1404 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎంపికైన 1404 మంది విద్యార్థుల వివరాలను ఆర్జీయూకేటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో బాలికలు 69 శాతం, బాలురు 31శాతం సీట్లు పొందినట్టు వివరించారు. 99శాతం సీట్లను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే పొందినట్టు తెలిపారు. అత్యధికంగా సిద్దిపేట జిల్లా కు 330 సీట్లు దక్కగా, అత్యల్పంగా వనపర్తి జిల్లాకు ఒక్క సీటు మాత్రమే దక్కి ంది. నిర్మల్ జిల్లాకు 72 సీట్లు దక్కాయి. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 8,9,10 తేదీల్లో 500 మంది విద్యార్థుల చొప్పున యూనివర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహించి, అడ్మిషన్ ఇవ్వనున్నట్టు ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. వికలాంగులు, స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన విద్యార్థులకు 4న, ఎన్‌సీసీ, క్యాప్ కోటా కింద ఎంపికైన విద్యార్థులకు 5న ధ్రువపత్రాలు పరిశీలించి అడ్మిషన్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ అధికారులు పావని, దత్తు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

నవతెలంగాణ-బేగంపేట్

విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాలను విక్రయిస్తూ విద్యార్థులను వాటికి బానిసలుగా మారుస్తున్న ముగ్గురిని.. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి మత్తులో తూగుతున్న మరో ఎనిమిది మందిని కార్ఖానా పోలీసులతో కలిసి తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రష్మి పెరుమాళ్, నార్కోటిక్స్ బ్యూరో డీసీపీ చైతన్యతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. నగరంలోని లంగర్ హౌజ్‌కు చెందిన మహ్మద్ అక్రమ్, సికింద్రాబాద్ కార్ఖానాకు చెందిన సీఎస్ ప్రణయ్, వెస్ట్ మారేడుపల్లికి చెందిన రోహన్ విలియమ్స్ గంజాయికి అలవాటు పడ్డారు. ఆ తరువాత ముగ్గురు గ్రూపుగా ఏర్పడి గంజాయి విక్రయం మొదలుపెట్టారు. ఓజీ వెరైటీ గంజాయి, రెగ్యులర్ గంజాయితో పాటు ఎల్ఎస్డీ వంటి మాదక ద్రవ్యాలను తెచ్చి అవసరమున్న వారికి, ముఖ్యంగా కాలేజీల్లో విద్యార్థులకు విక్రయిస్తున్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం కోసం స్నాప్‌చాట్‌లో ఒక గ్రూపును కూడా ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి స్నాప్‌చాట్ ద్వారా డ్రగ్స్ డెలివరీ చేస్తున్నారు. వారి వద్ద బోయిన్‌పల్లికి చెందిన భరణీకుమార్, పద్మారావునగర్‌కు చెందిన రోహన్సింగ్ ఓసాహన్, జూబ్లీహిల్స్‌కు చెందిన విద్యార్థి ఆదిత్య నారాయణ రెడ్డి, బంజారాహిల్స్‌కు చెందిన అర్జున్ చౌదరీ, జూబ్లీహిల్స్‌కు చెందిన నిఖిల్‌రెడ్డి, సూర్యతేజ, రాయదుర్గంకు చెందిన సాయిచరణ్‌రెడ్డి, మలక్‌పేట్‌కు చెందిన సాయి పృథ్వీనాథ్ రెడ్డి మత్తు పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో కార్ఖానా ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో మిగతా ఎనిమిది మందిని అరెస్టు చేశారు. డ్రగ్స్‌ను వినియోగిస్తున్న చైన్ సిస్టమ్‌ను పోలీసులు గుర్తించారు. షాద్‌నగర్‌లోని సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 20 మంది విద్యార్థులను గుర్తించామని డీసీపీ చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి వారికి, పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తామని, డీ-అడిక్షన్ సెంటర్‌లో చేరేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 11 మందిని రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో నార్త్‌జోన్ అడిషనల్ డీసీపీ అశోక్, కార్ఖానా ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వంద కిలోల గంజాయి పట్టిస్తే రూ.2లక్షల బహుమతి యాంటి నార్కోటిక్ ఎస్పీ సాయి చైతన్య

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న యుద్ధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యాంటి నార్కోటిక్ డ్రగ్స్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య అన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ అమ్మడం, కొనడం వంటివి జరుగుతున్నట్టు సమాచారమున్నా, సీనియర్లు డ్రగ్స్ తాగాలని ఒత్తిడి చేసినా.. తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. విద్యా సంస్థల్లోకి మాదక ద్రవ్యాలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధినేతలపై ఉందని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు ఎలాంటి సమాచారమున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 8712671111కు కాల్ చేయాలని, వంద కిలోల గంజాయికి సంబంధించిన సమాచారం ఇస్తే రూ.2లక్షల బహుమతి కూడా ప్రకటించినట్టు చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కమిటీలు.. కమిషన్ల పేరుతో కాలయాపన

- ఏపీలో ఏడు మండలాల విలీనంపై
- ఏనాడూ పట్టించుకోని కేసీఆర్ : మెదక్ ఎంపీ ఎం. రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నదని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పెట్టుబడులకు డబ్బుల్లేక, రాష్ట్రంలో విత్తనాలు, ఎరువులు దొరక్క రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతు కమిషన్, కొత్త వ్యవసాయ విధానం ఏర్పాటు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు వాళ్ళిచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టో మీదనే గౌరవం లేదని విమర్శించారు. అర్హులైన ప్రతి రైతుకీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు తన భూమిని కబ్జా చేస్తున్నారని ఓ రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆంధ్రలో కలిసిన ఏడు మండలాల గురించి మాజీ సీఎం కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదనీ, కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా ఆయన కలువలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో పార్టీ ఫిరాయింపుదారులే తర్వాతి కాలంలో కేసీఆర్‌పై ఫిరంగులై పేలుతారని గతంలోనే తాను చెప్పానని గుర్తుచేశారు. పాతబస్తీలో విద్యుత్ బకాయిలు వసూలు చేయడానికి టెండర్లను పిలిచి ఏజెన్సీలకు అప్పజెప్పడాన్ని తాము కాదనలేదన్నారు. పాతబస్తీలో కరెంటు బిల్లులు వసూలు చేయడం రాష్ట్ర ప్రభుత్వంతో అయితలేదా? అని ప్రశ్నించారు.

నిధులలేమితో స్థానిక సంస్థలు నిర్వీర్యం : ఎమ్మెల్యే పాయల్ శంకర్

కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ నడుస్తున్నదనీ, నిధుల కొరతతో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచుల పాలన లేకపోవడంతో ప్రజల కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీలు వసూలు చేస్తున్న ఇంటి పన్నుల మొత్తాన్ని అధికారులు ట్రెజరీలో జమ చేస్తున్నారనీ, అవసరాల కోసం పంచాయతీలు డబ్బులు డ్రా చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ జీపీఎఫ్ నిధులు కూడా విడుదలయ్యే పరిస్థితి లేదని చెప్పారు. ఏడు నెలల నుంచి జీతాలు రాకుంటే పంచాయతీ కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పంచాయతీల కోసం కేంద్రం విడుదల చేసిన రూ.498 కోట్లను కూడా గత ప్రభుత్వం వాడుకున్నదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 70 నుంచి 80 శాతం వరకు పూర్తి చేసిన ప్రాజెక్టుల పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని సూచించారు. బడ్జెట్‌లో సంక్షేమానికి కేటాయించిన నిధుల్లో రెండు శాతం కూడా ఖర్చు చేయలేదని వివరించారు.